అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

బుధవారం 05-03-2025

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 11 | సంచిక : 13 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50

పోలీసుల పైశాచికం



ఇది ముమ్మాటికీ ముస్లిం వ్యతిరేక ఎజెండానే : బృందాకరత్ 3లో..

రాజస్థాన్‌లో ఖాకీ జులుంతో చిన్నారి మృతిపై సీపీఐ(ఎం) దిగ్భ్రాంతి



ప్రయివేటు చేతికి యుద్ధ విమానాల తయారీ

రక్షణ ప్యానెల్ సిఫారసు

దేశరక్షణకు తగదంటున్న రక్షణ శాఖ నిపుణులు

కమీషన్ల కోసమే ప్రభుత్వరంగం నిర్వీర్యం : ప్రతిపక్షాలు

న్యూఢిల్లీ : తేలికపాటి యుద్ధ విమానాలు (ఎల్‌సీఏ) ఎంకె-1ఎ తయారీకి ప్రయివేటు రంగాన్ని అనుమతించాలని రక్షణ సాధికారతా కమిటీ సిఫారసు చేసింది. యుద్ధ విమానాల ఉత్పత్తిని వేగిరపరిచేందుకు దశలవారీగా చర్యలు తీసుకోవాలని సూచించింది. ఐఎఎఫ్ స్క్వాడ్రన్ బలాన్ని, కార్యాచరణ సంసిద్ధతను మరింత పెంచడంలో ప్రయివేటు రంగం పాత్ర వుండాల్సిన అవసరాన్ని కమిటీ నొక్కి చెప్పింది. దీంతో భారత యుద్ధ విమానాల తయారీ కార్యక్రమంలో ప్రయివేటు రంగం భాగస్వామ్యానికి మార్గాన్ని సుగమమైంది. ఎల్‌సీఏ కార్యక్రమంలోని జాప్యాలను పరిష్కరించేందుకు రక్షణ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్ నేతృత్వంలో ఐదుగురు సభ్యులతో ఏర్పడిన ఈ కమిటీ తన నివేదికను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు అందచేసింది. కమిటీ చేసిన సిఫారసుల అమలును దశలవారీగా నిర్దిష్ట కాలపరిమితిలో చేపట్టాలని మంత్రి కోరారు. ఈ మేరకు సంబంధిత అధికారులు తెలిపారు. ఎల్‌సీఏ డెలివరీల్లో అసాధారణ జాప్యాల పట్ల ఐఏఎఫ్ చీఫ్ అమర్ ప్రీత్‌సింగ్ ఆందోళనలు వ్యక్తం చేయడంతో గత నెల్లో ఈ కమిటీని ఏర్పాటు చేశారు. తక్షణమే కార్యాచరణకు దిగగల స్క్వాడ్రన్‌ల సంఖ్య తగ్గిపోతున్న నేపథ్యంలో వాటి సంఖ్యను ...11లో

బకాయిలు చెల్లించండి

మిల్లింగ్ గడువు పెంచండి

కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషికి సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్ వినతి



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఎఫ్‌సీఐ 2014-15 ఖరీఫ్ కాలంలో సరఫరా చేసిన బియ్యానికి సంబంధించి తెలంగాణకు బకాయి పడిన రూ.1,468.94 కోట్లను వెంటనే విడుదల చేయాలని కేంద్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. మంగళవారం కేంద్ర మంత్రిని ఆయన నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కలిశారు. నాడు అదనపు లెవీ సేకరణకు సంబంధించిన మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించిందని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. బకాయిలు పెట్టి పదేండ్ల యిందని, వాటిని వెంటనే విడుదల చేయాల ని కోరారు. ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ యోజన కింద 2021 మే నుంచి 2022 మార్చి వరకు సరఫరా చేసిన అదనపు బియ్యం, 2022 ఏప్రిల్‌లో సరఫరా చేసిన బియ్యానికి సంబంధించిన ఉత్తర్వులను ధ్రువీకరించుకొని, అందుకు సంబంధించిన బకాయిలు రూ.343.27 కోట్లను విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. 2021 జూన్ నుంచి 2022 ఏప్రిల్ వరకు నాన్ ఎన్‌ఎఫ్‌ఎస్‌ఏ (నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ యాక్ట్) కింద పంపిణీ చేసిన బియ్యానికి సంబంధించిన బకాయిలు రూ.79.09 కోట్లు వెంటనే విడుదల చేయాలని కోరారు. సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) గడువును నెలా నెలా కాకుండా కనీసం నాలుగు నెలలు పొడిగించాలని, అప్పుడే సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తవని తెలియజేశారు.

4 వేల మెగావాట్ల సోలార్ విద్యుదుత్పత్తికి అనుమతులు పునరుద్ధరించండి : సీఎం

తెలంగాణ రాష్ట్రానికి పీఎం కుసుమ్ కింద గతంలో ఇచ్చిన 4 వేల మెగావాట్ల సోలార్ విద్యుదుత్పత్తికి అనుమతులను పునరుద్ధరించాలని కేంద్ర పునరుత్పాదక ఇంధన వనరుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. తెలంగాణకు గతంలో నాలుగు వేల మెగావాట్లకు అనుమతులు ఇచ్చిన కేంద్రం తర్వాత దానిని వెయ్యి మెగావాట్లకు కుదించిందని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రంలో మహిళా సంఘాలతో సోలార్ విద్యుదుత్పత్తిని ప్రోత్సహిస్తున్నామని కేంద్ర మంత్రికి సీఎం వివరించారు. వారి విజ్ఞప్తులపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. సమావేశంలో ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి మాణిక్‌రాజ్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ డి.ఎస్ చౌహాన్, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు.

బడ్జెట్లో మేమెక్కడ...?

ఆశగా ఎదురు చూస్తున్న పేదలు | **ఏండ్ల తరబడి పెండింగ్‌లోనే ఇండ్లు, రేషన్ కార్డులు**

'తెలంగాణ వస్తే ధర్నాచౌక్‌లో టెంట్లు వేసే అవసరమే ఉండదు..ఎలాంటి ఆందోళనలు లేకుండా అన్ని సమస్యలు పరిష్కారమైపోతాయి...' ఉద్యమ నాయకుడిగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దాదాపు పన్నెండు పదమూడేండ్ల కిందట చెప్పిన మాట ఇది. 'రాబోయేది ప్రజా ప్రభుత్వం. ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటా సౌభాగ్యం వెల్లివిరుస్తుంది...' రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నేతలు చేసిన ప్రకటనలివి. కేసీఆర్ చెప్పినట్టు తెలంగాణ వచ్చింది, ఆ తర్వాత 2023లో హస్తం పార్టీ కూడా అధికారంలోకి వచ్చింది. కానీ రాష్ట్రంలోని పేదలు, సామాన్యుల సమస్యలు మాత్రం పరిష్కారం కాలేదు. బీఆర్ఎస్ పదేండ్ల కాలంలో వీటిపై అంతులేని నిర్లక్ష్యాన్ని ప్రదర్శించి, కాలయాపన చేయగా.. నిధుల లేమి సాకుతో నేటి కాంగ్రెస్ సర్కారు సైతం వాటికి తగిన ప్రాధాన్యత నివ్వటం లేదు. ఈ నేపథ్యంలో కనీసం రాబోయే బడ్జెట్‌లోనైనా తమ సమస్యలను పరిష్కరించేందుకు వీలుగా కేటాయింపులు చేస్తారా? లేదా? అని పేదలు ఎదురు చూస్తున్నారు.

- కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది వెతలు
- ఫీజుల భారాలు
- బీఆర్ఎస్ హయాంలో సాగదీత
- కాంగ్రెస్ సర్కారుకు నిధుల గోస

బి.వి.యన్.పద్మరాజు

సమస్యలెన్నో.. తీరేదెన్నడో..



రాష్ట్రంలో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న (బీపీఎల్) వారు ప్రధానంగా ఇండ్లు, రేషన్ కార్డులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.18,520 కోట్లతో 2,80,616 డబుల్ బెడ్ రూం ఇండ్లను నిర్మిస్తామంటూ ప్రకటించింది. అయితే వాటికి చాలినన్ని నిధులను కేటాయించకపోవటంతో నిర్మాణాలు వివిధ దశల్లో ఆగిపోయాయి. దీంతో అనుకున్న లక్ష్యంలో 50 శాతం కూడా ఇండ్ల నిర్మాణం పూర్తి కాలేదు. కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద తెలంగాణకు 2,50,084 ఇండ్లను మంజూరు చేసినట్టు ప్రకటిం ...11లో

ఫీజులపై బెంబేలెత్తుతున్న తల్లిదండ్రులు

రాష్ట్రంలో ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల ధాటికి తల్లిదండ్రులు బెంబేలెత్తుతున్నారు. ఎల్‌కేజీ ఫీజులే రూ.50 వేల నుంచి లక్షన్నర ఉండటంతో వారు తమ ఆదాయంలో 50 శాతం నుంచి 60 శాతం వరకూ ఫీజుల కోసమే కేటాయించాల్సిన పరిస్థితి. రాష్ట్ర స్థాయి నుంచి మండల స్థాయి వరకూ విస్తరించిన ఈ స్కూళ్లు విద్యాహక్కు చట్టం నియమ నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘించినా గత సర్కారు పట్టించుకోలేదు. దాదాపు 11 వేల ప్రయివేటు స్కూళ్లను తన నియంత్రణలోకి తీసుకుంటానని చెప్పినా అమలు చేయలేకపోయింది. ఫీజులపై మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించినప్పటికీ ఫలితం లేకపోయింది. ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ ఏర్పాటు చేసిన విద్యా కమిషన్ ద్వారానైనా ఫీజుల నియంత్రణ సాధ్యమవుతుందా? లేదా? అనేది చూడాలి. మార్చితో ...11లో

రెండు దఫాలా? ఒకేసారా?

10లో అసెంబ్లీ సమావేశాలపై తర్జనభర్జన... రేపు రాష్ట్ర మంత్రివర్గ సమావేశం

కులగణన, ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత, బడ్జెట్‌పై చర్చించనున్న క్యాబినెట్

సుప్రీం నోటీసులు

పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో పలువురికి జారీ



22లోపు సమాధానమివ్వాలని ఆదేశం

25కు తదుపరి విచారణ

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణలో పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో అసెంబ్లీ స్పీకర్ కార్యాలయానికి, రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ఎన్నికల సంఘంతో పాటు, ప్రతివాదులకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ నెల 22 లోపు ఈ నోటీసులపై సమాధానమివ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. తదుపరి విచారణను 25కు వాయిదా వేసింది. పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈ ఏడాది జనవరి 15న ప్రతిపక్ష బీఆర్ఎస్ సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావ్, దానం నాగేందర్‌లపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, కేపీ వివేకానంద్‌లు స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్పీ)ను దాఖలు చేశారు. మిగిలిన ఏడుగురు ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎం.సంజయ్‌కుమార్, కాలె యాదయ్య, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, ప్రకాష్‌గౌడ్, గూడెం మహిపాల్ రెడ్డి, అరెకపూడి గాంధీలపై కేటీఆర్ రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై ...11లో



ఫోర్త్ సిటీ పేరుతో భూములు గుంజుకుంటుండ్రు

బలవంతపు భూసేకరణ ఆపకపోతే సీఎం ఇంటిని ముట్టడిస్తాం

తక్షణమే హైకోర్టు తీర్పును అమలు చేయాలి

నిషేధిత జాబితా నుంచి రైతుల పేర్లను తొలగించాలి

వారికి రైతు భరోసా, రైతు బీమా, పంట లోన్లు ఇవ్వాలి

మార్కెట్ రేటు ప్రకారం భూమిని కొనుగోలు చేయాలి : మేడిపల్లిలో ఫార్మాసిటీ బాధిత రైతులను కలిసిన సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

నవతెలంగాణ-యాచారం

ఫోర్త్ సిటీ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం రైతుల భూములను లాగేసుకుంటోందని, ఈ బలవంతపు భూసేకరణను ఆపకపోతే సీఎం ఇంటిని ముట్టడిస్తామని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ విమర్శించారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా యాచారం మండల పరిధిలోని మేడిపల్లి, నక్కర్తలో ఫార్మాసిటీ బాధిత రైతులను జాన్‌వెస్లీ కలిశారు. ఇంటింటికీ తిరుగుతూ గ్రామంలో స్థానిక సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ...11లో

సహాయక చర్యల్లో పురోగతి

ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో కన్వేయర్ బెల్ట్ పునరుద్ధరణ

పనుల్లో వేగం

గంటకు 800 టన్నుల మట్టిని బయటికి తరలించే అవకాశం

ఢిల్లీ నుంచి నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ ప్రతినిధుల బృందం

జీపీఆర్ స్కాన్ గుర్తించిన ప్రదేశాల్లో ఏమీ తేలని వైనం



నవతెలంగాణ- మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాద స్థలంలో సహాయక చర్యల్లో వేగం పుంజుకుంది. కన్వేయర్ బెల్ట్‌కు మరమ్మతు పూర్తవ్వడంతో బురద, మట్టి తొలగింపు, టీబీఎం మిషన్ ముక్కలను సైతం బయటకు పంపడం సులభతరం కానుంది. కన్వేయర్ బెల్ట్ పని ...2లో

మినీ అంగన్‌వాడీల పెండింగ్ జీతాలు చెల్లించాలి



పీఎంశ్రీ పథకాన్ని రద్దు చేయాలి

బేగంపేట మెట్రో నుంచి ప్రజాభవన్ వరకు ర్యాలీ 2లో..

మూడు దఫాలుగా అధికారుల చర్చలు

త్వరలో జీతాలతో పాటు ఇతర సమస్యలు పరిష్కరిస్తామని సర్కార్ హామీ

మహిళా సంఘాలకు ఆర్టీసీ అద్దె బస్సులు

ఉత్తర్వులు జారీ

మార్చి 8న సీఎం ఆవిష్కరణ



వివరాలు 2లో..

ప్రభుత్వ భూముల అమ్మకానికి సర్కారు కుట్ర

నాడు సుద్దులు... నేడు టెండర్లు

అసెంబ్లీని తప్పుదోవ పట్టించిన వైనం : మాజీ మంత్రి హరీశ్‌రావు ఫైర్



వివరాలు 11లో..

రాష్ట్రాల తీరువల్లే వైద్యం అందట్లే

ప్రయివేటు ఆస్పత్రులకు ప్రోత్సాహకంగా మారింది

ఔషధ ధరలు పెరిగాయి : సుప్రీంకోర్టు

వివరాలు 11లో..

సీతారామ ప్రాజెక్ట్ కాలువ పరవళ్లు



నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి

సీతారామ ప్రాజెక్ట్ కాలువలో నీళ్ళు ఎప్పుడు పారతాయా అని ఎదురు చూసిన రైతుల కోరిక మంగళవారం నెరవేరింది. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రెండు రోజులు క్రితం భద్రాద్రి ...11లో

అమెరికాపై టారిఫ్ వార్

15 శాతం సుంకాలు పెంచిన చైనా | **అదే బాటలో కెనడా**

తమ వద్దా ప్లాన్లు ఉన్నాయన్న మెక్సికో

యూఎస్‌తో ఢీ అంటే ఢీకి మూడు దేశాలు

కుప్పకూలిన ప్రపంచ మార్కెట్లు

ట్రంప్‌ను తప్పుబట్టిన వారెన్ బఫెట్

అమెరికా అసంబద్ధ వాణిజ్య సుంకాలపై చైనా ప్రతికార యుద్ధాన్ని ప్రకటించింది. అదే బాటలో కెనడా, మెక్సికో దేశాలు డోనాల్డ్ ట్రంప్ విధానాలపై ఢీ అంటే ఢీ అన్నట్లుగా దీటుగా బదులిచ్చాయి. కెనడా, మెక్సికో, చైనా దిగుమతులపై తమ ప్లాన్ ప్రకారం మంగళవారం నుంచే సుంకాలను అమలు చేయనున్నట్లు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. కెనడా, మెక్సికో నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై 25 శాతం టారిఫ్‌లు అమల్లోకి వస్తాయని సోమవారం వైట్‌హౌస్‌లో ట్రంప్ తెలిపారు. చైనా దిగుమతులపై ప్రస్తుతమున్న 10 శాతం సుంకాలను 20 శాతానికి చేర్చుతున్నామన్నారు.



న్యూఢిల్లీ : అమెరికాకు దీటుగా చైనా ప్రతికార చర్యలను ప్రారంభించింది. అమెరికా నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై మార్చి 10 నుంచి అదనంగా 10-15 శాతం సుంకాలను విధించనున్నట్టు చైనా ఆర్థిక శాఖ వెల్లడించింది. చికెన్, గోధుమలు, మొక్కజొన్న, పత్తి సహా అన్నింటిపై సుంకాలు పెంచుతున్నట్టు స్పష్టం చేసింది. దీంతో ప్రపంచంలోనే రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల మధ్య వాణిజ్య యుద్ధానికి తెరలేపినట్లయ్యింది. వాషింగ్టన్ నుంచి ఎదురయ్యే వాణిజ్య సుంకాల బెదిరింపును ఎదుర్కోవడానికి తమ వద్ద ప్లాన్ బీ,సీ,డీ ఉన్నాయని మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షీన్‌బామ్ పేర్కొన్నారు. అయితే అమెరికా చర్యలపై కొంత వేచి చూసే ధోరణితో ఉన్నామన్నారు. అమెరికాలోకి అక్రమ వలసలను ఆపాలని మెక్సికోకు, ఫెంటానిల్ డ్రగ్స్ అక్రమ రవాణాను నిలిపివేయాలని చైనాకు ఇచ్చిన గడువు ముగియడంతో సుంకాల పెంపును అమలు చేస్తున్నట్లు ట్రంప్ తెలిపారు. సుంకాలు ఉండకూడదు అనుకుంటే ...10లో

ట్రంప్ నిర్ణయాలు ప్రమాదం

వారెన్ బఫెట్



అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చైనా, కెనడా, మెక్సికో దేశాలపై భారీగా సుంకాలు పెంచి వాణిజ్య యుద్ధానికి దారి తీయడంపై ఆ దేశ బడా కార్పొరేట్ వారెన్ బఫెట్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ట్రంప్ ప్రారంభించిన వాణిజ్య యుద్ధం ప్రమాదకరమైందని హెచ్చరించారు. ట్రంప్ దుందుడుకు చర్యలకు పాల్పడుతున్నారన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో అమెరికా ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలో అత్యంత ఆసక్తికరమైన అంశంగా మారిందన్నారు. కాగా.. తాను దాని గురించి ఇప్పుడే మాట్లాడనన్నారు.

ప్రపంచ మార్కెట్లు బెంబేలు

ప్రణాళిక ప్రకారమే టారిఫ్‌లను అమలు చేస్తున్నట్టు ట్రంప్ ప్రకటించడం.. ప్రతీకారంగా చైనా, కెనడాలు సుంకాలను పెంచడంతో ప్రపంచ మార్కెట్లు కుప్పకూలాయి. ట్రంప్ నిర్ణయాలతో యూఎస్ మార్కెట్లు ఒత్తిడిలోకి జారుకున్నాయి. డౌజోన్స్ ఇండస్ట్రియల్ 649 పాయింట్లు లేదా 1.48 శాతం నష్టపోయింది. ఎస్అండ్‌పీ 500 సూచీ 104 పాయింట్లు లేదా 1.76 శాతం పతనం కాగా.. నాస్‌డాక్ 497 పాయింట్లు లేదా 2.64 శాతం క్షీణించింది. ఈ ప్రభావం ఆసియా, పసిఫిక్, ఆస్ట్రేలియా మార్కెట్లపైనా పడింది. జపాన్ నిక్కీ స్టాక్ ఎక్స్ఛేంజీ నేల చూపులు చూసింది. వరుస అమ్మకాల ఒత్తిడితో బీఎస్ఈ సెన్సెక్స్ 73వేల దిగువకు పడిపోయింది. సెన్సెక్స్ తుదకు 96 పాయింట్ల నష్టంతో 72,989కు దిగజారింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 36.65 పాయింట్ల నష్టంతో 22,082.65 వద్ద ముగిసింది.



హోరాహోరీ

- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఫలితాల్లో ముగ్గురు అభ్యర్థుల మధ్యే పోటీ
- నాలుగు రౌండ్లు పూర్తయ్యేసరికి వారి మధ్య తేడా 5 వేల ఓట్లే
- ముందంజలో బీజేపీ, తరువాతి స్థానాల్లో కాంగ్రెస్, బీఎస్పీ
- ఆ తర్వాత కమలం, హస్తం మధ్యే పోటీ
- మొదటి ప్రాధాన్యతలో ఏ ఒక్కరికీ రాని మ్యాజిక్ ఫిగర్
- రెండో ప్రాధాన్యతపైనే అభ్యర్థుల ఆశలు

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల్లో ముగ్గురు ప్రధాన అభ్యర్థుల నడుమ పోటీ హోరాహోరీగా సాగుతోంది.

తొలి రోజు సోమవారం చెల్లని ఓట్లను తొలగించిన అధికారులు చెల్లే ఓట్ల లెక్కింపును మంగళవారం ఉదయం 10 గంటల నుంచి ప్రారంభించారు. మొత్తం లెక్కించాల్సిన ఓట్లు 2,24,000కాగా.. ఇప్పటివరకు నాలుగు రౌండ్లలో 84వేల ఓట్లు లెక్కించారు. అయితే నాలుగో రౌండ్ పూర్తయ్యే సరికి బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి ముందు వరుసలో ఉండగా.. కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి తర్వాతి స్థానంలో, బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ మూడోస్థానంలో ఉన్నారు. మొత్తం 21 టేబుళ్లలో లెక్కిస్తున్న అధికారులు టేబుల్‌కు వెయ్యి చొప్పున ఒక్కో రౌండ్‌లో 21వేల ఓట్ల లెక్కలు తీస్తున్నారు. ఇందులో ప్రతి రౌండ్‌కూ ముగ్గురి మధ్య కేవలం 5వేల చొప్పున ఓట్ల తేడానే కొనసాగింది. మొత్తం ఓట్లు 2.24 లక్షల ఓట్లు కాగా.. ఒక వ్యక్తికి మ్యాజిక్ ఫిగర్ 1.12 లక్షల ఓట్లు రావాల్సి ఉండగా.. మొదటి ప్రాధాన్యత ఓట్లలో ముగ్గురూ తలపడుతున్నారు.

నాలుగు రౌండ్లు పూర్తయ్యే సరికి..

సోమవారం ఉదయం 10గంటల నుంచి అధికారులు మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు ప్రారంభించారు. తొలిరౌండ్ పూర్తయ్యే సరికి బీజేపీకి 6712, కాంగ్రెస్‌కు 6676, బీఎస్పీకి 5867 ఓట్లు మొదటి ప్రాధాన్యత కింద వచ్చాయి. వీరి దరిదాపుల్లో కూడా మిగతా ఏ అభ్యర్థులు కూడా ఓట్లు సాధించలేకపోయారు. రెండో రౌండ్‌లో బీజేపీకి 7979, కాంగ్రెస్‌కు 6522, బీఎస్పీకి 4927 వచ్చాయి.

మూడో రౌండ్‌లో బీజేపీకి 8619, కాంగ్రెస్‌కు 5614, బీఎస్పీకి 5086 ఓట్లు పోలయ్యాయి. రాత్రి 10గంటల వరకు నాలుగో రౌండ్ పూర్తికాగా.. ఈ రౌండ్‌లో బీజేపీకి 7807, కాంగ్రెస్‌కు 6544, బీఎస్పీకి 5271 ఓట్లు వచ్చాయి. మొత్తంగా నాలుగు రౌండ్లు పూర్తయ్యేసరికి బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డికి 31,117, కాంగ్రెస్ అభ్యర్థి వి.నరేందర్‌రెడ్డికి 25,356, బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణకు 21,151 ఓట్లు వచ్చాయి. మొత్తంగా నాలుగు రౌండ్ల ఫలితాల సరళి పరిశీలిస్తే ముగ్గురు అభ్యర్థుల నడుమ సుమారు 5వేల చొప్పున ఓట్ల తేడా కొనసాగుతోంది. అయితే మ్యాజిక్ ఫిగర్ 1.12లక్షల ఓట్లు సాధించాల్సి ఉండగా.. ఏ ఒక్కరికీ ఆ మొత్తంలో ఓట్లు వచ్చే అవకాశం కనిపించడం లేదు. ఈ ఫలితాల లెక్కింపు బుధవారం అర్ధరాత్రి వరకూ కొనసాగే అవకాశం కనిపిస్తోంది. ఎలిమినేషన్ ప్రక్రియ ప్రారంభమై రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు వచ్చే సరికి ఈ ముగ్గురు అభ్యర్థుల్లో ఎవరికి భవితవ్యం కలిసొస్తుందో మరో రెండురోజులు వేచి చూడాల్సిందే!

ఆ రెండూ చారిత్రాత్మక నిర్ణయాలే

- మెదక్ లోక్‌సభ నియోజకవర్గ సమీక్షలో మహేష్‌కుమార్‌గౌడ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కులగణన సర్వే, ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నదని టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ చెప్పారు. ఇది దేశానికి ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో నిర్వహిం చిన మెదక్ లోక్‌సభ నియోజకవర్గం కాంగ్రెస్ నేతలతో ఆయన సమీక్షించారు. ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, మంత్రులు కొండా సురేఖ, దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, డీసీసీ అధ్యక్షులు, పోటీ చేసిన అభ్యర్థులు, పార్టీ అనుబంధ సంఘాల చైర్మెన్లు పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ 14 నెలల ప్రజాపాలనలో నియోజకవర్గ పరిధిలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

సంస్థాగతంగా పార్టీ నిర్మాణం, కమిటీల ఏర్పాటు, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలపై దిశానిర్దేశం చేశారు. పాత, కొత్త నేతల మధ్య సమన్వయం లోపించకుండా చూడాలన్నారు. ఐక్యతతో ముందుకు సాగాలని హితువు పలికారు. పార్టీ లైన్ దాటితే ఎంతటి వారైనా చర్యలు తప్పవని హెచ్చరించారు. నియోజకవర్గ ఇన్‌చార్జీలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. అందరినీ కలుపుకుపోవాలని సూచించారు. నియో జకవర్గ ఎమ్మెల్యేలు ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండాలని కోరారు. ఆ తర్వాత మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గం సమీక్ష నిర్వహించారు.

సహాయక చర్యల్లో పురోగతి

(మొదటిపేజీ తరువాయి)

చేయకపోవడం వల్లే సొరంగంలో కూలిన మట్టి, రాళ్లను బయటకు పంపలేకపోయారు. ప్రధానంగా జీపీఆర్ ద్వారా మెత్తటి ఆనవాళ్లను (కార్మికులుగా భావించారు) గుర్తించి మొదలుపెట్టిన తవ్వకాలు వృథా అయ్యాయి. సుమారు 10 అడుగుల లోతు మట్టిని తవ్వి రాళ్లను తొలగించినా కార్మికుల ఆనవాళ్లు కనిపించలేదు. దీంతో జీపీఆర్ ప్రయోగం విఫలమైనట్టేనని తెలుస్తోంది. టీబీఎం మిషన్ ముందు, వెనుక ఉన్న మట్టిని తొలగించడానికి కన్వేయర్ బెల్ట్ పూర్తిగా సహకరిస్తుంది. దీని ద్వారా గంటకు 800 టన్నుల మట్టిని బయటకు పంపొచ్చు. ప్రమాదం జరిగిన 11 రోజుల అనంతరం మంగళవారం కన్వేయర్ బెల్ట్‌కు మరమ్మతులు పూర్తవ్వడంతో కార్మికులను వెలికి తీసే పనికి ముందడుగు పడినట్టయ్యింది. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ రెస్క్యూ ఆపరేషన్‌పై టన్నెల్ ఇన్ లెట్ ఆఫీస్ వద్ద మంగళవారం డిజాస్టర్ మేనేజ్‌మెంట్ స్పెషల్



చీఫ్ సెక్రెటరీ అరవింద్ కుమార్, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ సమీక్షా సమావేశం నిర్వహించారు. సొరంగంలో జరుగుతున్న సహాయక చర్యలపై డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫైర్ సర్వీసెస్ డిజిపి నాగిరెడ్డి, టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఆలీ, జిల్లా ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, కల్నల్ పరీక్షిత్ మెహ్రా, ఎన్డీఆర్ఎఫ్ అధికారి ప్రసన్న, హైడ్రా, సింగరేణి మైన్స్ రెస్క్యూ, ఎస్డీఆర్ఎఫ్ అధికారి, ఫైర్ సర్వీసెస్, దక్షిణ మధ్య రైల్వే ప్లాస్మా కట్టర్స్, ర్యాట్ మైనర్స్, ప్రతినిధులు పాల్గొన్నారు.

టన్నెల్ రెస్క్యూ ఆపరేషన్ పురోగతి, ఎదురవుతున్న సవాళ్లు, మైనింగ్, ఫైర్ సర్వీసెస్ బృందాల కృషి, ర్యాట్ మైనింగ్ ప్రత్యేకతలు, ప్లాస్మా కట్టర్స్ వినియోగం వంటి అంశాలపై సమీక్షించారు. రెస్క్యూ చర్యలను వేగవంతం చేయడం, టీమ్‌ల మధ్య సమన్వయం పెంచడం వంటి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కన్వేయర్ బెల్ట్‌ను పునరుద్ధరించిన కారణంగా గంటకు 800 టన్నుల మట్టిని బయటకు తీసుకురాగలమని అధికారులు వెల్లడించారు. గ్రౌండ్ పేనిట్రేటింగ్ రాడార్ ద్వారా గుర్తించిన ప్రదేశాల్లో తవ్వకాలు జరుగుతున్నాయని, కన్వేయర్ బెల్ట్ సిద్ధంగా ఉండటంతో వీలైనంత త్వరగా మట్టిని బయటకు పంపించే ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. రెండు ఎస్కలేటర్లను సిద్ధం చేసినట్టు చెప్పారు. టన్నెల్ బోరింగ్ మిషన్ చివరి భాగాలను గ్యాస్ కట్టర్‌తో తొలగించి లోకో ట్రైన్ ద్వారా బయటకు తీసుకురానున్నారు. నీటిని ఎప్పటికప్పుడూ పంపుల ద్వారా బయటకు పంపిస్తున్నట్టు వివరించారు.

సహాయక చర్యలు వేగవంతం

బాదావత్ సంతోష్, జిల్లా కలెక్టర్

సొరంగం ప్రమాదంలో సహాయక చర్యలను ముమ్మరం చేశాం. మంగళవారం భారీ యంత్రం కన్వేయర్ బెల్ట్‌ను పునరుద్ధరించడంతో గంటకు 800 టన్నుల మట్టిని బయటకు తీసుకురాగలమని అధికారులు వెల్లడించారు. ఢిల్లీ నుంచి నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ ప్రతినిధుల బృందం సహాయంతో టన్నెల్ సహాయక చర్యలు వేగవంతం చేశాం.

జీపీఆర్ గుర్తించిన ప్రదేశాల్లో ఇనుప రాడ్లు

సొరంగంలో ప్రమాదం జరిగి 11రోజులైనా ఎనిమిది మంది కార్మికుల ఆచూకీ కానరాలేదు. మూడ్రోజుల కిందట జీపీఆర్ స్కాన్ ద్వారా కార్మికుల ఆనవాళ్లు లభించాయని నిపుణులు తెలిపారు. మంగళవారం నాటికి స్కాన్ చేసిన ఐదు ప్రదేశాల్లో మట్టిని తవ్వారు. 8 నుంచి 10 అడుగుల లోతు మట్టిని, రాళ్లను తొలగించారు. చివరకు జీపీఆర్ స్కాన్ చేసిన ప్రదేశంలో ఇనుప రాడ్లు ఉన్నాయని నివేదిక వచ్చింది. దీంతో జీపీఆర్ ద్వారా నాలుగు రోజులుగా చేసిన శ్రమ ఫలించ లేదు. ముఖ్యంగా మట్టి పడే సమయంలో కార్మికులు టీబీఎం మిషన్ దగ్గర ఉంటే మిషన్‌లోనికి వెళ్లి సురక్షితంగా ఉన్నారేమోనన్న సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే, టీబీఎం మిషన్ దగ్గర మట్టిని తవ్విన కొద్దీ గుట్ట కూలినట్టు మట్టి, నీరు వస్తున్నాయి. దీంతో రెస్క్యూ టీమ్‌లు చాలా జాగ్రత్తగా సహాయక చర్యలు చేపడుతున్నాయి.

బీజేపీ, టీఎంసీ మైత్రితో ప్రజాస్వామ్య హక్కులపై దాడులు



లఖింపూర్ ఘటనను తలదన్నేలా జాదవ్‌పూర్ ఘటన :
ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు

నవతెలంగాణ- సిటీబ్యూరో

పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో బీజేపీ, టీఎంసీ మైత్రితో ప్రజాస్వామ్య హక్కులపై దాడులు చేస్తున్నారని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.నాగరాజు అన్నారు. కలకత్తాలోని జాదవ్‌పూర్ యూనివర్సిటీలో సమస్యలు పరిష్కరించాలని, విద్యార్థి సంఘానికి ఎన్నికలు నిర్వహించాలని నిరసన తెలిపిన విద్యార్థులు, ఉపాధ్యాయులపైకి విద్యాశాఖ మంత్రి బ్రాత బసు కాన్వాయ్‌ను పోనిచ్చి గాయపరచడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇది లకింపూర్‌లో రైతులపైకి బీజేపీ నేత కారును ఎక్కిచ్చిన ఘటనను తలదన్నేలా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా మంగళవారం హైదరాబాద్ నారాయణ గూడ సెంటర్‌లో నిరసన తెలిపి, బెంగాల్ ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో రైతు ఆందోళన నేపథ్యంలో లఖింపూర్ ఖేరీలో రైతులపైకి కాన్వాయ్ ముందుకు కదిలించి బీజేపీ ఎలాగైతే ప్రాణం తీసిందో.. అదే తరహాలో బెంగాల్ విద్యాశాఖ మంత్రి జాదవ్‌పూర్ యూనివర్సిటీలో విద్యార్థుల పైకి కాన్వాయ్ ముందుకు కదిలించి తీవ్రంగా గాయపరిచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బెంగాల్ టీఎంసీ ప్రభుత్వం కనీసం ప్రజాస్వామ్యం లేకుండా, విద్యార్థి సంఘాల ఎన్నికలు రద్దు చేయాలనే కుట్రతో నిర్లక్ష్యం చేసిందన్నారు. సమస్యలు పరిష్కరించకుండా.. విద్యార్థుల సమస్యపై మాటా ్డానికి ప్రతినిధులను ఎన్నుకునే హక్కులు లేకుండా చేస్తోందన్నారు.

విద్యార్థుల, ఉపాధ్యా యులు కలిసి ఆందోళనలు చేస్తుంటే అణచి వేయడానికి పూనుకుంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసు, పారా మీలటరీ ఉపయో గించి, విద్యార్థులపై కేసులు నమోదు చేసి క్యాంప స్‌లో భయానక పరిస్థితి సృష్టించిందని చెప్పారు. తక్షణమే ఈ ఘటనపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పందించాలని, విద్యాశాఖ మంత్రిని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్య క్రమంలో ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లెనిన్ గువేరా, అశోక్ రెడ్డి, ఉపాధ్యక్షులు రమ్య, నాగేందర్, స్టాలిన్, సహాయ కార్యదర్శులు శ్రీమాన్, జిల్లా కమిటీ సభ్యులు సుష్మా నవీన్, సాగర్, అఖిల్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అటకెక్కిన క్రిస్టియన్ భవన్ నిర్మాణ పనులు

14 నెలలుగా ఏమాత్రం ముందుకు సాగని పనులు
కులగణనలో క్రిస్టియన్ల జనాభా చూపకుండా అన్యాయం :
తెలంగాణ ఫుడ్స్ మాజీ చైర్మెన్ మేడే రాజీవ్ సాగర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ సర్కార్ క్రిస్టియన్ ఆత్మ గౌరవ భవన నిర్మాణ పనులను అటకెక్కించిందని తెలంగాణ ఫుడ్స్ మాజీ చైర్మెన్ మేడే రాజీవ్ సాగర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. క్రిస్టియన్లను కాంగ్రెస్ పార్టీ కేవలం ఓట్లు వేసే యంత్రాలుగా చూస్తున్నారని దుయ్యబట్టారు. మంగళవారం ఉప్పల్ భగాయత్‌లో నిర్మాణంలో ఉన్న క్రిస్టియన్ భవన్‌ను ఆయన క్రిస్టియన్ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రాజీవ్ సాగర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు క్రిస్టియన్ల ఆత్మగౌరవాన్ని నిలబెట్టాలని ఉప్పల్ భగాయత్‌లో 2 ఎకరాల స్థలం కేటాయించి రూ.10 కోట్లు క్రిస్టియన్ ఆత్మగౌరవ భవన నిర్మాణానికి మంజూరు చేసిందని గుర్తుచేశారు. బీఆర్ఎస్ పార్టీకి పేరు వస్తుందనే అక్కసుతో కాంగ్రెస్ సర్కారు నిర్మాణ పనులు ఆపేసిందని విమర్శించారు. వెంటనే నిధులు మంజూరు భవన నిర్మాణం త్వరతగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర మంత్రివర్గంలో మైనార్టీలకు ప్రాతినిధ్యం ఇవ్వకుండా చిన్నచూపు చూసిందన్నారు. ఎన్నికల సమయంలో మైనార్టీలను అన్ని విధాలుగా ఆదుకుంటామని అధికారంలోకి వచ్చాక మోసం చేశారని చెప్పారు. ఎన్నికల సమయంలో మైనార్టీల బడ్జెట్‌ను రూ. 4,000 కోట్లకు పెంచుతామని హామీ ఇచ్చి 2024-25 సంవత్సరానికి రూ. 3,003 కోట్లు మాత్రమే కేటాయించిందని తప్పుపట్టారు. అందులోను ఇప్పటి వరకు కేవలం రూ. 750 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందని తెలిపారు. ఈ ఏడాది బడ్జెట్‌లో మైనార్టీలకు రూ. 4వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ మైనార్టీ యువత, మహిళలకు సబ్సిడీ రుణాలను అందించడానికి సంవత్సరానికి రూ. 1,000 కోట్లు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. అలాగే పాస్టర్లకు నెలకు రూ. 12 వేల గౌరవ వేతనం ఇస్తామని మత పెద్దలను మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ సర్కార్ చేపట్టిన కులగణనలో ఉద్దేశపూర్వకంగానే క్రిస్టియన్ల జనాభా చూపిం చకుండా మోసం చేసిందని విమర్శించారు. క్రిస్టియన్ల జనాభా తెలంగాణలో లేనట్టు అసలు క్రిస్టియన్ శాతాన్నే చూపించలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే రీ సర్వే చేసి క్రిస్టియన్ల జనాభాను ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు.

'గాంధీ' వైద్యులపై మంత్రి సీరియస్

డుమ్మా డాక్టర్లకు నోటీసులివ్వాలని ఆదేశాలు

ఐవీఎఫ్ సేవల్లో జాప్యంపై అసంతృప్తి
డాక్టర్లు, ఆర్ఎంఓలు గైర్హాజరైతే సహించం :
వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ
సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో ఆకస్మిక తనిఖీలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

గాంధీ ఆస్పత్రి డాక్టర్లపై వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సీరియస్ అయ్యారు. ముందస్తు సమాచారం లేకుండా డ్యూటీకి గైర్హాజరైన డాక్టర్లపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో మంత్రి దామోదర రాజనర్సింహ మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. నేరుగా ఔటు పేషెంట్ వార్డుకు వెళ్లి రోగులతో మాట్లాడారు. డాక్టర్ల అటెండెన్స్ షీట్ తెప్పించుకుని పరిశీలించారు. ఓపీలో ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు లేకపోవడంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. డుమ్మా డాక్టర్లకు షోకాజ్ నోటీసులిచ్చి వివరణ తీసుకోవాలని డీఎంఈ, హాస్పిటల్ సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. గాంధీలో ఓపీ, ఐపీ, ఎంసీహెచ్, ఐవీఎఫ్, ఓపీ డయాగ్నస్టిక్ సర్వీసెస్, స్కానింగ్ వార్డులను మంత్రి పరిశీలించారు. ఐవీఎఫ్ సేవల్లో జాప్యంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సంబంధిత డాక్టర్లకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని డీఎంఈని ఆదేశించారు. విధులకు గైర్హాజరైన డాక్టర్లపై చర్యలుంటాయనీ, డాక్టర్లు, ప్రొఫెసర్లు, ఆర్ఎంఓలు డుమ్మా కొడితే ఉపేక్షించేది లేదనీ హెచ్చరించారు. గాంధీలో వైద్య సేవలపై త్వరలో సీరియస్ రివ్యూ చేస్తామని చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆకస్మిక తనిఖీలు కొనసాగుతాయని తెలిపారు. ఎక్కడా రోగులకు ఇబ్బందులు కలుగొద్దన్నారు. వైద్యులు సకాలంలో డ్యూటీకి రావాల్సిందేనన్నారు. వైద్య సేవలకు అంతరాయం కలగకుండా చూస్తామని, అన్ని ఆస్పత్రులపై నిరంతరం నిఘా పెట్టామని చెప్పారు. మౌలిక వసతులు, ఇతర సౌకర్యాలపై ఆరా తీశారు.



మినీ అంగన్‌వాడీల పెండింగ్ జీతాలు చెల్లించాలి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మినీ అంగన్‌వాడీల పెండింగ్ జీతాలు చెల్లించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది అంగన్‌వాడీలు మంగళవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌కు తరలివచ్చారు. సీఐటీయూ అను బంధ సంఘమైన తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బేగంపేట మెట్రో స్టేషన్ నుంచి ర్యాలీగా తరలివచ్చారు. మెట్రో దాటిన తర్వాత వారిని పోలీసులు మధ్యలో అడ్డుకునే ప్రయత్నం చేశారు. దాంతో పోలీసులకు, అంగన్‌వాడీలకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ప్రజావాణికి వెళ్లనీయకుండా అడ్డుకుంటే రోడ్డుపై భైఠాయిస్తామని తెగేసి చెప్పడంతో పోలీసులు అనుమతిచ్చారు. ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసే పీఎంశ్రీ పథకాన్ని రద్దు చేయాలనీ, మొబైల్ సెంటర్లను ఎత్తేయాలనీ, కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నూతన జాతీయ విద్యా విధానం చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయొద్దని డిమాండ్ చేశారు. ప్రతి నెలా ఒకటవ తేదీన వేతనాలు చెల్లించాలనీ, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం, టీచర్లు, హెల్పర్లను రెగ్యులర్ చేయాలనీ, కాంగ్రెస్ ప్రభుత్వం మ్యానిఫెస్టోలో పొందుపర్చిన హామీల ప్రకారం రూ.18వేల వేతనం పెంచడంతో పాటు పీఎఫ్ సౌకర్యం కల్పించాలని ప్లకార్డులు, జెండాలు పట్టుకుని నినాదాలు చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఈ సందర్భంగా వారు ప్రజావాణి నోడల్ అధికారి దివ్య దేవరాజన్‌కు అందజేశారు.

ఇన్‌చార్జీ చిన్నారెడ్డితో పాటు పలువురు అధికారులు మూడు దఫాలుగా అంగన్‌వాడీలతో ప్రజాభవన్‌లో చర్చలు జరిపారు. అనంతరం అధికారులు వారికి నిర్దిష్టమైన హామీలు ఇచ్చారు. మినీ అంగన్‌వాడీ టీచర్లకు 10నెలల పెండింగ్ వేతనాలు చెల్లిస్తామని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల తంతు అయిపోయిన వెంటనే జీవోను జారీ చేస్తామనీ, వారికి హెల్పర్లను నియమించడంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఖాళీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేస్తామని హామీ ఇచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 8న ప్రభుత్వం ప్రకటించే అవ కాశముందని వారికి అధికారులు వివరించారు.

పదవీ విరమణ పొందిన వారికి షరతులు లేకుండా ఆసరా పెన్షన్ వచ్చేలా ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేస్తామనీ, ఉద్యోగంలో కొనసాగుతున్న వారికి ఆసరా పెన్షన్ ఇవ్వడం కోసం ఉన్న అవ కాశాలను ప్రభుత్వం పరిశీలిస్తుందని హామీ ఇచ్చారు. ఇతర డిమాండ్లను ప్రభుత్వంతో చర్చించి పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్య క్రమంలో అంగన్‌వాడీ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షురాలు కె.సునీత, ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మి, కోశాధికారి పి. మంగ, రాష్ట్ర ఆఫీష్ బేరర్లు సమ్మక్క, కోటేశ్వరి, రాష్ట్ర నాయకులు వెంకటమ్మ ఏసు, మణి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా అరెస్టులు

తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌కు తరలివస్తున్న అంగన్‌వాడీలను పోలీసులు రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడికక్కడ అరెస్ట్ చేశారు. నల్లగొండ, గద్వాల వరంగల్, ఖమ్మం, వనపర్తి, గద్వాల తదితర ప్రాంతాలకు చెందిన వారిని ముందస్తుగా నిర్బంధించి స్థానిక పోలీస్‌స్టేషన్లకు తరలించారు. దాంతో వారు పోలీస్ స్టేషన్లలోనే తమ నిరసనను తెలియజేశారు. అంగన్‌వాడీల అక్రమ అరెస్టులను తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ తీవ్రంగా ఖండించింది.

మహిళా సంఘాలకు ఆర్టీసీ అద్దె బస్సులు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

మహిళా సంఘాలకు ఆర్టీసీ అద్దె బస్సుల్ని కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మొదటి విడతలో 150 మండల సమాఖ్యలకు 150 ఆర్టీసీ అద్దె బస్సుల్ని ఇవ్వాలనీ, ఆ తర్వాత మిగిలిన మండల సమాఖ్యలకు 450 ఆర్టీసీ అద్దె బస్సులు ఇవ్వాలని నిర్ణయించారు. ప్రతి నెల ఒక్కో బస్సుకు అద్దె రూపంలో ఆర్టీసీ రూ.77, 220 చెల్లిస్తుందని పేర్కొన్నారు. బస్సుల కొనుగోలు కోసం మహిళా సంఘాలకు ప్రభుత్వం బ్యాంకు గ్యారంటీ ఇస్తుంది. దేశంలో తొలిసారిగా మహిళా సంఘాలకు అద్దె బస్సుల్ని అందిస్తున్నామని ప్రభుత్వం ప్రకటించింది. ఈనెల 8వ తేదీ మహిళా దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్‌లోని పోలీస్ పరేడ్ గ్రౌండ్ వేదికగా 50 బస్సులను ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ కూడా పాల్గొంటారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఒక్కో బస్సు విలువ రూ.36 లక్షలు ఉంటుందనీ, ఒక్కో మండల సమాఖ్యకు ఒక బస్సును కొనుగోలు చేసి ఆర్టీసికి అద్దె ఇస్తారని వివరించారు. తొలివిడతలో ఉమ్మడి మహబూబ్‌నగర్, ఖమ్మం, వరంగల్, కరీంనగర్ జిల్లాల మహిళా సమాఖ్యలకు 150 అద్దె బస్సులను అప్పగించనున్నారు. ఈ బస్సులపై ఇందిరా మహిళా శక్తి ప్రధాన్యతను చాటి చెప్పేలా డిజైన్లు రూపొందించారు.

లంచంతోనే పని

న్యూఢిల్లీ : జీఎస్టీ రిజిస్ట్రేషన్ విషయంలో తనకు ఎదురైన చేదు అనుభవాన్ని ఒక స్టార్టప్ ఫౌండర్ ఆన్‌లైన్ వేదికగా షేర్ చేసుకున్నాడు. ఇది దేశంలో ప్రస్తుతం ఉన్న పరిస్థితికి అద్దం పడుతున్నది. అవినీతి, అసమర్థత అనేవి.. దేశంలోని చిన్న వ్యాపారాలను ఎలా నిర్వీర్యం చేస్తామయో అన్న విషయాన్ని సదరు వ్యక్తి తన పోస్ట్‌లో వివరంగా రాసుకొచ్చాడు. తన జీఎస్టీ దరఖాస్తు 63 రోజులు నిలిచిపోయిందని వివరించాడు. సంబంధిత విభాగం నుంచి తనకు ఎలాంటి అప్‌డేట్‌లు, ప్రతిస్పందనలూ రాలేదని పేర్కొన్నాడు. అయితే, 'రూ.5000 లంచం' తర్వాత.. జీఎస్టీ రిజిస్ట్రేషన్ ప్రక్రియను రాత్రికిరాత్రే వేగవంతం చేసిందని ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశాడు.

'బతకాలంటే లంచాలు కావాల్సిందే'

తన స్టార్టప్ ప్రయాణంలోని ఈ ఒక్క చిన్న ఘటన.. ఈ దేశంలోని వ్యవస్థ పని చేస్తున్న తీరుపై తనకున్న నమ్మకాన్ని పూర్తిగా దెబ్బతీసిందని వివరించాడు. "నేను ఒక అమాయకపు వ్యక్తిలా నా జీఎస్టీ రిజిస్ట్రేషన్ దరఖాస్తును దాఖలు చేశాను. నిర్దిష్ట సమయంలోనే పనవుతుంద నుకున్నాను. అయినా.. ఏమీ జరగలేదు" అని ఆవేదన వ్యక్తం చేశాడు. దీంతో సదరు వ్యక్తి జీఎస్టీ ఆఫీసుకే నేరుగా వెళ్లాలని నిర్ణయించుకున్నాడు. అయితే, అక్కడ ఆయనకు అసలు విషయం బోధపడింది. లంచాన్ని సమర్థిస్తూ కార్యాలయంలోని ఒక అధికారి చెప్పిన మాటలు.. ఆయనను షాక్‌కు గురి చేశాయి. "మేము బతకాలంటే లంచాలు కావాల్సిందే.

మాకు జీతాలు సరిపోవు" అని సదరు అధికారి.. స్టార్టప్ ఫౌండర్‌తో వెల్లడించటం గమనార్హం. దీంతో సదరు స్టార్టప్ ఫౌండర్‌కు మరో మార్గం కనిపించలేదు. అయిష్టంగానూ రూ.5వేలు లంచంగా చెల్లించాడు. ఆ తర్వాతి రోజు జీఎస్టీ రిజిస్ట్రేషన్ అప్రూవ్ కావటం గమనార్హం.

'చైనాతో పోటీ ఈ విధంగానేనా?'

ఈ మొత్తం తతంగం ఆయనను తీవ్ర నిరాశలోకి నెట్టేసింది. భారత్‌ను 'వ్యాపార అనుకూల దేశం'గా మార్చేది ఇలాగేనా? చైనా, వియత్నాంతో పోటీ పడేది ఈ విధంగానేనా? అని ఆందోళన వ్యక్తం చేశాడు. తాను తన బిజినెస్‌ను వియత్నాం లేదా యూఏఈకి మార్చాలనుకుం టున్నానను వివరించాడు.

భారత్‌కు సవాల్‌గా అవినీతి

అవినీతి అనే మకిలి.. భారత్‌కు పెద్ద సవాల్‌గా మారిందని నిపుణులు అంటున్నారు. వ్యాపారవేత్తలుగా మారుదామనుకుంటున్న కొందరు యువ ఔత్సాహికవేత్తల ఆశలను అడియాశలు చేసేలే ఈ జాఢ్యం అనేక ప్రభుత్వ కార్యాలయాల్లో వేళ్లూనుకున్నదని అంటున్నారు. అవినీతి రహిత పాలన, పారదర్శకత అంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాటలు చెప్తున్నా.. పాలసీలు తీసుకొస్తున్నా.. క్షేత్రస్థాయిలోని వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయని వివరిస్తున్నారు.


అక్కడ అలా...ఇక్కడ ఇలా!

ట్రంప్, మోడీ ఆలోచనా ధోరణుల్లో సామీప్యతలు

రెండు దేశాల్లోనూ వివక్ష, మతోన్మాదం, అప్రజాస్వామిక విధానాలు

అమెరికాలో ఇటీవలి కాలంలో 'మేక్ అమెరికా గ్రేట్ అగైన్' (మగా) పేరిట ఓ ఉద్యమం ఊపందుకుంటోంది. ఇది జాతి వివక్షకు, స్త్రీ ద్వేషానికి, మతోన్మాదానికి, అప్రజాస్వామిక ధోరణులకు ఓ వేదికగా మారింది. ఇటీవల అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ కూడా ఇవే ధోరణులను ప్రదర్శిస్తున్నారు. వలసవాదుల విషయంలో కఠిన వైఖరి అవలంబిస్తున్నారు. భారతీయులు సహా దేశంలో ఉన్న మైనారిటీలకు వ్యతిరేకంగా శ్వేత జాతీయులను రెచ్చగొడుతూ రాజకీయ ప్రయోజనం పొందుతున్నారు. ఇక మన దేశంలో ప్రధాని నరేంద్ర మోడీ తరచూ 'మేక్ ఇండియా గ్రేట్ అగైన్' (మిగా) అనే నినాదాన్ని వినిపిస్తున్నారు. మగా ఉద్యమానికి, మిగా నినాదానికి మధ్య కొన్ని సామీప్యతలు కన్పిస్తున్నాయి. మన దేశంలో కూడా మైనారిటీల పట్ల వివక్ష కొనసాగుతోంది. వారిపై హిందూత్వ శక్తులను ఉసిగొలుపుతూ పబ్బం గడుపుకుంటున్నారు. ఇక మతోన్మాద, అప్రజాస్వామిక ధోరణులను గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరమే లేదు.

మైనారిటీలపై ఇరువురు నేతలదీ ఒకే వైఖరి



బానిసలుగా ఆఫ్రికన్-అమెరికన్లు

స్వాతంత్ర్యం వచ్చిన సమయానికి అమెరికాలో 19.3 శాతం మంది ఆఫ్రికన్-అమెరికన్లే ఉన్నారు. వీరిలో ఏడు లక్షల మంది బానిసలుగా జీవనం సాగించారు. ప్రచ్ఛన్న యుద్ధ సమయం నాటికి బానిసల సంఖ్య 40 లక్షలకు చేరింది. ఆ యుద్ధం కారణంగా బానిసత్వం నుండి వారికి విముక్తి లభించింది. అయినా వారికి నష్టపరిహారం అందలేదు. ప్రస్తుతం అమెరికా జనాభాలో ఆఫ్రికన్-అమెరికన్లు 14.16 శాతం మంది ఉన్నారు.

న్యూఢిల్లీ : రెండు వారాల క్రితం త్రివిధ దళాల ఛైర్మన్, వైమానిక దళ జనరల్ సీక్యూ బ్రౌన్‌ను ట్రంప్ పదవి నుండి తొలగించారు. ఆయన త్రివిధ దళాలకు నేతృత్వం వహించిన తొలి ఆఫ్రో అమెరికన్ అధికారి. అమెరికా సైన్యంలో అత్యున్నత స్థాయి అధికారి అయిన బ్రౌన్ చేసిన తప్పేమిటంటే ఆయన సమానత్వాన్ని, వైవిధ్యాన్ని గురించి తరచుగా చెబుతుండడమే. అదే ట్రంప్ ఆగ్రహానికి కారణమైంది. అమెరికా వైమానిక దళానికి బ్రౌన్ నిరుపమాన సేవలు అందించారు. గత వారం మరో ఆఫ్రో-అమెరికన్‌పై కూడా ట్రంప్ కన్నెర్ర చేశారు. అమెరికా డిఫెన్స్ హెల్త్ ఏజెన్సీకి నేతృత్వం వహిస్తున్న లెఫ్టినెంట్ జనరల్ టెలిటా క్రాస్‌లాండ్ పదవిని కూడా ఆయన ఊడబెరికారు. అమెరికాలో పెరుగుతున్న జాతి వివక్షకు ఇవి ఉదాహరణలు మాత్రమే.

దేశంలో కొనసాగుతున్న జాతి వివక్ష గురించి ట్రంప్ పెద్దగా మాట్లాడరు. సమానత్వం, వైవిధ్యం అనే పదాలు ఆయనకు రుచించవు. అమెరికాలో నివసిస్తున్న ఆఫ్రికన్-అమెరికన్ ప్రజలకు జరుగుతున్న చారిత్రక అన్యాయాన్ని కప్పిపుచ్చేందుకు ట్రంప్ ప్రయత్నిస్తుంటారు. మహిళలు, ఇతర మైనారిటీల విషయంలో కూడా అక్కడ వివక్ష కొనసాగుతోంది.

ఏమిటీ 'మగా' ?

అమెరికా ప్రభుత్వంలో సమానత్వాన్ని, వైవిధ్యాన్ని కోరుకుంటున్న అధికారులందరినీ తొలగించడానికి ప్రభుత్వ సమర్థతా శాఖను (డోగ్)ను ట్రంప్ వాడుకుంటున్నారు. డోగ్‌కు ట్రంప్ సన్నిహితుడైన ఎలన్ మస్క్ నేతృత్వం వహిస్తున్న విషయం తెలిసిందే.

వాస్తవానికి మగా ఉద్యమం ట్రంప్ తొలిసారి అమెరికా అధ్యక్షుడైనప్పుడే మొదలైంది. ఈ ఉద్యమం శ్వేత జాతీయులు, పురుషుల ఆధిపత్యాన్ని కోరుకుంటోంది. మైనారిటీలు, వలసవాదుల కారణంగా అమెరికా సమాజంలో తమ ప్రతిపత్తికి ముప్పు వాటిల్లుతోందని మగా మద్దతుదారులు భావిస్తున్నారు. అందుకే వలసవాదులపై కఠిన చర్యలు తీసుకోవాలని, అమెరికాలో ప్రవేశిస్తున్న ముస్లింలను అడ్డుకోవాలని వారు గట్టిగా కోరుతున్నారు. డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వ విధానం కూడా అదే. ముస్లింలు అధికంగా నివసిస్తున్న దేశాల నుండి శరణార్థుల ప్రవేశాన్ని నిషేధించే కార్యనిర్వాహక ఆదేశాలపై ట్రంప్ ఇప్పటికే సంతకం చేశారు.

హిందూత్వ గ్రూపుల సమర్థన

అమెరికాలోని అనేక హిందూత్వ గ్రూపులు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధానాలను సమర్థిస్తున్నాయి. ఇదేమీ ఆశ్చర్యం కలిగించే విషయం కాదు. ఎందుకంటే భారత్‌లోని హిందూత్వ సంస్థలు వలసవాదాన్ని, రిజర్వేషన్లను వ్యతిరేకిస్తుంటాయి. అవి మైనారిటీ... ముఖ్యంగా ముస్లిం వ్యతిరేక విధానాలను సమర్థిస్తున్నాయి. అమెరికాలో ఊపందుకుంటున్న మగా ఉద్యమానికి, భారత్‌లో మోడీ ప్రవచిస్తున్న మిగాకు సామీప్యతలు ఉన్నాయి. దీనికి మద్దతు ఇస్తున్న భారతీయులు అగ్రరాజ్యంలో జరుగుతున్న పరిణామాలను అధ్యయనం చేసి, వివేకవంతమైన నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ట్రంప్ ఏం చేశారు ?

శ్వేత జాతి ఆఫ్రికన్ల పట్ల దక్షిణాఫ్రికా వివక్ష చూపుతోందని ఆరోపిస్తూ ఫిబ్రవరిలో ఆ దేశానికి ట్రంప్ సాయాన్ని నిలిపివేశారు. దేశంలో శ్వేత జాతీయులైన రైతులను పెద్ద ఎత్తున చంపేస్తున్నారని 2018లో అబద్ధాలు వల్లె వేశారు. అమెరికాలో ఆఫ్రికన్-అమెరికన్ ప్రజలు ఎదుర్కొంటున్న వివక్షను బయటపెట్టిన చరిత్ర పైన, పౌర హక్కుల పైన ట్రంప్ ప్రభుత్వం అనేక సాంస్కృతిక యుద్ధాలు సాగించింది. శ్వేత జాతీయులపై వివక్ష జరుగుతోందన్న ఆరోపణలను తిప్పికొట్టేందుకు ట్రంప్ తన ప్రధాన సలహాదారైన స్టీఫెన్ మిల్లర్‌ను పురమాయించారు. జన్మతః లభించే పౌరసత్వ హక్కును నిషేధించాలన్న ట్రంప్ ఆలోచన వెనుక అమెరికాలో ఆఫ్రికన్-అమెరికన్, లాటిన్, ఆసియన్ల జనాభా పెరగకుండా చూడాలన్న లక్ష్యం ఉంది. ట్రంప్ విధానాలు కేవలం ఆఫ్రికన్-అమెరికన్లనే గురి పెట్టలేదు. అవి భారతీయులు సహా మైనారిటీలను లక్ష్యంగా ఎంచుకున్నాయి.

ట్రంప్‌దీ అదే చరిత్ర

వ్యక్తిగతంగా కూడా జాతి వివక్ష ప్రదర్శించిన చరిత్ర డొనాల్డ్ ట్రంప్‌కు ఉంది. 1970వ దశకం ప్రారంభంలో ఆఫ్రికన్ అమెరికన్ అద్దెదారుల పట్ల ఆయన కంపెనీ వివక్ష ప్రదర్శిస్తోందంటూ న్యాయ శాఖ కేసు పెట్టింది. అప్పటి అధ్యక్షుడు బారక్ ఒబామా అసలు అమెరికాలోనే జన్మించలేదంటూ ట్రంప్ ఓ కుట్ర సిద్ధాంతాన్ని లేవదీశారు. అమెరికా తొలి ఆఫ్రికన్-అమెరికన్ అధ్యక్షుడుగా ఒబామా పదవీకాలానికి గండి కొట్టడానికి ట్రంప్ చేసిన ప్రయత్నంగా దీనిని చూడవచ్చు. 2016లో అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచారం సందర్భంగా ట్రంప్ పలు సందర్భాలలో ఒబామాపై ఆరోపణలు సంధించారు. గత సంవత్సరం జరిగిన అధ్యక్ష ఎన్నికల సందర్భంగా చేసిన ప్రచారంలోనూ ఆయన హైతీలపై విషం చిమ్మారు. వారు పిల్లులు, కుక్కలను తింటారంటూ అబద్ధాలు ఆడారు. దేశంలో శ్వేత జాతీయులకు వ్యతిరేకంగా అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయని ఆయన టైమ్ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చారు కూడా.



జీతాలు పెంచాలి

బెంగళూరులో మధ్యాహ్న భోజన కార్మికుల డిమాండ్

బెంగళూరు: మిడ్ డే మీల్ కార్మికుల జీతాలు పెంచాలని బెంగళూరులో అఖిల కర్నాటక అక్షర దాసోహ ఎంప్లాయీస్ అసోసియేషన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో మంగళ వారం ధర్నా నిర్వహించారు. భారీ సంఖ్యలోఈ కార్యక్రమానికి హాజరైన సభ్యులు నినాదాలు చేశారు. అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించేలా సిద్ధరామయ్య సర్కార్ చర్యలు తీసుకోవాలని వక్తలు డిమాండ్ చేశారు.



వంతరాలో పక్షులు, జంతువులతో ప్రధాని

ప్రజాసమస్యలు వదిలి వనవాసమా... : ప్రతిపక్షాలు

జామ్‌నగర్. తన సొంత రాష్ట్రమైన గుజరాత్‌లో ప్రధాని మోడీ బిజీగా గడుపుతున్నారు. జామ్‌నగర్‌లో 'వంతరా' ప్రారంభోత్సవం సందర్భంగా ప్రధాని మోడీ ఒరంగుటాన్‌లతో సమయం గడుపుతున్నారు.పక్షులు, జంతువులతో సేద దీరుతున్నారు. ప్రజాసమస్యలు వదిలి ఈ వనవాసమేంటని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తున్నాయి.

ఇంజినీరింగ్ ఫీజులను పెంచొద్దు

టీఏఎఫ్ఆర్సీ హడావుడిగా విచారణ చేయొద్దు

ఆడిట్ నివేదికలను సునిశితంగా పరిశీలించాలి: ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో రానున్న మూడేండ్ల కాలానికి ప్రయివేటు ఇంజినీరింగ్‌తో పాటు వృత్తి విద్యా కోర్సుల కళాశాలల్లో ఫీజుల పెంపు కోసం తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీజు రెగ్యులేటరీ కమిటీ (టీఏఎఫ్ఆర్సీ) హడావుడిగా విచారణ చేయొద్దని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఇంజినీరింగ్ ఫీజులను పెంచొద్దని కోరింది. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కాలేజీల ఆడిట్ నివేదికలను సునిశితంగా పరిశీలించాలని సూచించారు. గత ఫీజుల కోసం లక్షలాది రూపాయలు పెంచుకొని కనీస సదు పాయాలను కాలేజీలు కల్పించ లేదని విమర్శించారు. నకిలీ ఆడిట్ నివేదికలను సమర్పించి, కోర్సులు కొత్తగా వచ్చాయనీ, తరగతులు పెంచామనీ, జీతాలు, మౌళిక వసతులు పెరిగాయనే పేరుతో, ల్యాబ్, లైబ్రరీ, పుస్తకాల కొనుగోలు, లెక్చరర్స్ జీతాలు ఎక్కువ ఇచ్చినట్టు చూపించి, తర్వాత వారినుంచి తర్వాత తీసుకుం టున్నారని తెలిపారు. ఆయా ఖర్చులు వివరాలు తప్పులు ఇచ్చి కాలేజీలు ఫీజులు పెంచుకోవాలని చూస్తు న్నాయని పేర్కొన్నారు. ఈ వివరాలుపై క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే ఫీజుల పెంపు నిర్ణయం తీసుకోవాలని తెలిపారు. సక్రమంగా ఆడిట్ చేసి, కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించిన తర్వాతే ఫీజుల పెంపు ఆలోచన చేయాలని సూచించారు. గతంలో కూడా హడావుడి విచారణ చేసి, భారీగా ఫీజులను పెంచి, మళ్లీ తగ్గించడంతో కొన్ని కళాశాలలు విద్యార్థులను వేధించాయని గుర్తు చేశారు. విద్యార్థులకు నష్టం చేసే చర్యలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. బి-కేటగిరి ప్రవేశాలను కూడా ఆన్‌లైన్ ద్వారా భర్తీ చేసి అక్రమ పద్ధతిలో డొనేషన్లు తీసుకోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఫీజులను ఏకపక్షంగా పెంచితే ఆందోళనలు చేస్తామని వారు హెచ్చరించారు.

పోలీసుల పైశాచికం

ఇది ముమ్మాటికీ ముస్లిం వ్యతిరేక ఎజెండానే :బృందాకరత్



సీపీఐ(ఎం) డిమాండ్లు ఇవే..

- హత్య ఆరోపణల్లో ఉన్న పోలీసు సిబ్బందిని వెంటనే అరెస్టు చేయాలి.
- సంఘటనకు కారణమైన ఠాణా ఇన్‌చార్జిని వెంటనే సస్పెండ్ చేసి, కఠినంగా శిక్షించాలి.
- బాధిత కుటుంబానికి తక్షణ పరిహారం ఇవ్వాలి.
- చట్టాన్ని రక్షించాల్సిన పోలీసులే.. ఇలాంటి చట్టవిరుద్ధమైన , క్రూరమైన చర్యలు పునరావృతం కాకుండా చూడాలి.

• రాజస్థాన్‌లో ఖాకీ జులుంతో చిన్నారి మృతిపై సీపీఐ(ఎం) దిగ్భ్రాంతి

అల్వార్: బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ముస్లిం వ్యతిరేక ఎజెండాను అమలు చేస్తున్నారన టానికి తాజా ఘటనే నిదర్శనమని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకరత్ అన్నారు. పోలీసుల దాడిలో మరణించిన అల్వార్‌లోని రఘునాథ్‌గఢ్ గ్రామంలోని నెల రోజుల చిన్నారి అలిష్టా కుటుంబాన్ని బృందాకరత్, కిషన్ పారిఖ్ (రాజస్థాన్ కార్యదర్శి), సుమిత్రా చోప్రా (రాజస్థాన్ రాష్ట్ర కమిటీ కార్యదర్శి), రైసా (జిల్లా కార్యదర్శి)లతో కూడిన సీపీఐ(ఎం) ప్రతినిధి బృందం పరామర్శించింది. వారికి సంఘీభావం వ్యక్తం చేస్తూ.. పోలీసు దమనకాండపై త్వరితగతిన నిష్పాక్షిక న్యాయం చేయాలని రాజస్థాన్ సర్కార్‌ను డిమాండ్ చేసింది.

ఏం జరిగింది..?

ఈ నెల 2వ తేదీన ఉదయం 6 గంటలకు పోలీసుల బృందం ఇమ్రాన్ ఇంటికి వచ్చి అమాంతంగా బయటి గోడను బలవంతంగా కూల్చివేసింది. దీంతో తల్లి రజిదా తలుపు తెరవగా మగ పోలీస్ అధికారులు ఆమెపై జులుం ప్రదర్శించారు. సాధారణంగా మహిళలుంటే.. లేడీ పోలీసులను తీసుకురావాలి. కానీ మగ పోలీసులే బలవంతంగా ఆమెపై దాడి చేసి బయటకు లాక్కొచ్చారు. అంతేకాక బూట్లు వేసుకుని పాప అలిష్టా నిద్రిస్తున్న మంచంపైకి పోలీసులు అమాంతంగా దూకారు.

దీంతో మంచంపై నిద్రి స్తున్న అలిష్టాపై వారు పడ టంతో.. ఆ చిన్నారి అక్కడికక్కడే చనిపోయింది. పోలీసులు వారెంట్ లేదా ముందస్తు నోటీసు లేకుండా అమానుషంగా వ్యవహరిం చారని స్థానికులు తెలిపారు. అయితే ఎలాంటి నేర చరిత్ర లేని దినసరి కూలీ ఇమ్రాన్, వారి కుటుంబం పోలీసుల అకృత్యాలకు ఊహించని విషాదాన్ని మూటగట్టుకుంది. ఖాకీ ఆటవిక చర్య పేద , అణగారిన కుటుంబాల దుర్బలత్వాన్ని ఎత్తి చూపుతోందని సీపీఐ(ఎం) బృందం విమర్శించింది.

ఎన్నికల్లో సహకరించిన అందరికీ కృతజ్ఞతలు : టీపీటీఎఫ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి పోటీచేసిన టీపీటీఎఫ్ అభ్యర్థి వై అశోక్ కుమార్‌కు నెలరోజులపాటు సహకరించిన ప్రతిఒక్కరికీ తెలంగాణ ప్రొగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) రాష్ట్ర కమిటీ కృతజ్ఞతలు తెలిపింది.

ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రచార అంశాలను ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రచురించి, ప్రసారం చేసిన మీడియా మిత్రులకు ధన్యవాదాలు తెలిపారు. మద్దతు తెలిపిన ఎమ్మెల్సీలు కోదండరామ్, అలుగుబెల్లి నర్సిరెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మెన్ రియాజ్, టివివి అంబటి నాగయ్యకు కృతజ్ఞతలు ప్రకటించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రతిరోజూ ఇంటిం టి ప్రచారంలో పాల్గొన్న పౌర, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. అశోక్‌కుమార్‌కు మద్దతిచ్చిన టీఎస్‌యూటీఎఫ్‌తోపాటు ఇతర ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల నాయకులు, కార్యకర్తలు ధన్యవాదాలు తెలిపారు.

రాజీనామా చేయించండి : కేటీఆర్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీకి సిగ్గుంటే ఫిరాయించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలచే రాజీనామా చేయించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని ఉద్దేశిస్తూ ఎక్స్‌లో ఆయన ట్వీట్ చేశారు. ఫిరాయించిన వారు తాజాగా ప్రజల ఆదేశాన్ని కోరుకోవాల్సిందేనని తెలిపారు. లేకపోతే రాహుల్ గాంధీ ఫిరాయింపుల నిరోధానికి రాజ్యాంగాన్ని సవరించాలని చెప్పడం మానుకోవాలని డిమాండ్ చేశారు.

'లడ్కీ బహెన్' అమలుకు నిధుల కొరత

మహారాష్ట్రలో ఆపసోపాలు పడుతున్న ఎన్డీఏ ప్రభుత్వం • లబ్దిదారుల జాబితాలో కోతలు

నమ్మక ద్రోహం అంటున్న మహిళలు

ముంబయి : లడ్కీ బహెన్ పథకం అమలులో మహారాష్ట్ర ప్రభుత్వం ఆపసోపాలు పడుతోంది. శాసనసభ ఎన్నికల్లో ఎన్డీఏ ఘన విజయం సాధించడానికి ఈ సంక్షేమ పథకం ఎంతగానో ఉపకరించింది. అయితే ఇప్పుడు ఆర్థిక ఇబ్బందుల కారణంగా దానిని అమలు చేయడం కష్టతరం కావడంతో లబ్దిదారుల సంఖ్యను ప్రభుత్వం కుదిస్తోంది. దీనిపై మహిళా లోకం ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. తమ ఖాతాలో సొమ్ము ఎప్పుడు జమ అవుతుందంటూ మహిళలు బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇచ్చిన హామీని ప్రభుత్వం ఏర్పడిన రెండు నెలలకే తుంగలో తొక్కిందని, ఇది నమ్మకద్రోహం కాక మరేమిటని వారు నిలదీస్తున్నారు.

లడ్కీ బహెన్ పథకం కింద ఆర్థిక సాయం పొందాలంటే కుటుంబ వార్షిక ఆదాయం రెండున్నర లక్షల రూపాయలకు మించకూడదు. ఈ పథకం కింద నెల నెలా అందుతున్న ఆర్థిక సాయంతో పేదలు కుటుంబ అవసరాలను కొంత మేర తీర్చుకునే వారు. అయితే లబ్దిదారుల జాబితాను కుదించడంతో చాలా మంది అర్హులకు సైతం ఆర్థిక సాయం అందడం లేదు. ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని బీజేపీ, శివసేన, ఎన్సీపీ సంకీర్ణ ప్రభుత్వం గత ఆగస్టులో ఈ నగదు బదిలీ పథకాన్ని ప్రారంభించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఈ పథకం కోసం రూ.35,000 కోట్ల రూపాయల బడ్జెటరీ కేటాయింపులు జరిపింది. కుటుంబ వార్షిక ఆదాయం రూ.2.5 లక్షల లోపు ఉండి, ఏ ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకం ద్వారా ప్రయోజనం పొందని 18-65 సంవత్సరాల మధ్య వయస్కులైన మహిళలకు ఈ పథకం కింద నెలకు రూ.1,500 ఆర్థిక సాయాన్ని అందజేస్తారు. లబ్దిదారులు ప్రభుత్వ శాశ్వత ఉద్యోగులు అయి ఉండకూడదు. వారికి నాలుగు చక్రాల వాహనమూ ఉండరాదు.

గత నవంబరులో మహారాష్ట్రలో శాసనసభ ఎన్నికలు జరిగిన విషయం తెలిసిందే. ఎన్నికల్లో రాజకీయ ప్రయోజనం పొందాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం అర్హతల్ని పక్కన పెట్టి ఈ పథకం కింద దరఖాస్తు చేసుకున్న ప్రతి మహిళ ఖాతాలో నగదు జమ చేసింది. మళ్లీ అధికారంలోకి వస్తే లబ్దిదారులకు అందిస్తున్న మొత్తాన్ని రూ.1,500 నుండి రూ.2,100కు పెంచుతామని ఏక్‌నాథ్ షిండే ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చారు. గత అక్టోబర్ వరకూ మహిళల బ్యాంక్ ఖాతాల్లో ఠంచనుగా సొమ్ము జమ అయింది. అప్పటి వరకూ 2.46 కోట్ల మంది మహిళల బ్యాంక్ ఖాతాల్లో ఆరు వేల రూపాయల చొప్పున జమ చేశారు.


ఎన్నికలు ముగిసిన తర్వాత ప్రభుత్వం కళ్ల ముందు ఏడాదికి రూ.43,380 కోట్ల ఆర్థిక భారం కన్పించింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన రూ.2,100 హామీ సంగతి దేవుడెరుగు...గతంలో ఇచ్చిన రూ.1,500 కోసం కండ్లు కాయలు కాచేలా ఎదురు చూడాల్సి వస్తోందని పలువురు లబ్దిదారులు వాపోయారు. ఇప్పటికే జమ చేసిన సొమ్మును అర్హులు కాని వారి నుండి వాపసు తీసుకుంటారంటూ వస్తున్న వార్తలు వారిలో మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. అదీకాక మహారాష్ట్ర ఆర్థిక పరిస్థితులను ఈ పథకం తల్లకిందులు చేసింది. ఇతర సంక్షేమ పథకాల లబ్దిదారులు కూడా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. రాష్ట్ర మహిళ, శిశు సంక్షేమ శాఖ జనవరిలో లడ్కీ బహెన్ లబ్దిదారుల జాబితాను జల్లెడ పట్టింది. లబ్దిదారుల సంఖ్యను 2.46 కోట్ల నుంచి 2.41 కోట్లకు తగ్గించింది. అంటే ఐదు లక్షల మంది మహిళలను అనర్హులుగా గుర్తించిందన్న మాట.



అనేక ప్రాంతాలకు చెందిన లబ్దిదారులకు ఇప్పటికీ జనవరి సొమ్మే అందలేదు. అనర్హుల నుంచి సొమ్మును రికవరీ చేసే ఉద్దేశమేమీ లేదని మహిళ, శిశు సంక్షేమ శాఖ మంత్రి అదితి తత్కరే భరోసా ఇస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక మంత్రిత్వ శాఖ కింద ఒక ప్రత్యేక పద్దును సృష్టించింది. డబ్బు వాపసు ఇవ్వాలని అనుకునే వారు అందులో జమ చేయవచ్చునని చెప్పింది.

సంపాదకీయం

'పరీక్షా' కాలం



సాధారణంగా మార్చి అనగానే మనకు గుర్తొచ్చేది వేసవికాలం. విద్యార్థులకు మాత్రం 'పరీక్షా' కాలం. నేటి నుంచి ఇంటర్ వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. షెడ్యూల్ ప్రకారం ఈనెల ఇరవైఐదు వరకు కొనసాగుతాయి. ఈ పరీక్షలు నడుస్తుండగానే ఇరవై ఒకటి నుంచి ఎస్సెస్సీ ఎగ్జామ్స్ స్టార్ట్ అవుతాయి. ఇవి ఏప్రిల్ నాలుగుతో ముగుస్తాయి. పరీక్షలనగానే విద్యార్థులను సహజంగానే ఒక భయం వెంటా డుతుంది. అనవసరపు ఆందోళన శారీరక, భావోద్వేగ ప్రతికూలతలకు దారితీస్తుంది. ముఖ్యంగా తల్లితండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలపై అతిగా ఆశలు పెట్టుకోవడం, సహచరుల ఫలితాలను చూసి ఆత్మన్యూనతకు గురికావడం సాధారణం. ప్రతికూల ఒత్తిడి పెరిగిన విద్యార్థుల్లో ఏకాగ్రత సడలడం, టెన్షన్ పెరగడం, అనుకున్న స్థాయిలో రాణించకపోవడం జరిగేదే. అంతమాత్రాన జీవితమంతా ఏదో అయిపోయిందనే భ్రమలో వారిని ముంచకూడదు. దీంతో పరీక్షలు సరిగా రాయనివారు, ఫెయిల్ అవుతామేమోనన్న ఆందోళనలో ఉన్నవారు మరింత కుంగుబాటుకు లోనవుతారు. అలాంటి పరిస్థితి రాకుండా చూడాలి.

> ఇటీవల వికారాబాద్‌లో జరిగిన ఓ ఘటన టీచర్ల బాధ్యతారహిత్యాన్ని బహిర్గతపరిచింది. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో జరిగిన టెన్త్‌క్లాస్ ఫేర్‌వెల్ పార్టీలో పెద్దయ్యాక ఏమవుదామనుకుంటున్నావు? అని ఓ బాలికను టీచర్ ప్రశ్నించగా వెటర్నరీ డాక్టర్‌ను అవుతానని బదు లిచ్చింది. 'నీ ముఖానికి డాక్టర్‌వు అవుతావా? మెడికల్ షాపు పెట్టుకుని బతుకు' అని చిన్నతనంగా మాట్లాడటంతో బాలిక స్కూల్ బిల్డింగ్‌పై నుంచి దూకగా కాలు విరిగింది.

నేడు విద్యార్థులు చిన్నచిన్న కారణాలకే దారుణమైన నిర్ణయాలు తీసుకుంటున్నారు. పరీక్షలు తప్పుతామేమోనని, లేదంటే ఫెయిల య్యామని క్షణికావేశానికి లోనై బలవన్మరణాలకు పాల్పడు తున్నారు. ఎన్నో ఆశలతో కనిపెంచిన తల్లిదండ్రులకు కడుపుకోతను మిగులుస్తున్నారు. గతేడాది ఇంటర్ ఫెయిలయ్యామని ఎనిమిది మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. హాస్టల్ బాత్రూం గదిలో ఉరేసుకుని, రైలుపట్టాలపై పడి, గడ్డి మందుతాగి, సూసైడ్ నోట్‌రాసి ఇలా అర్ధాంతరంగా తనువులు చాలించారు. ఇది అత్యంత బాధాకరం. ఈ చావులన్నింటికీ మూలాన్ని పరిశీలిస్తే మానసిక ఒత్తిడి ఒకటైతే, తల్లిదండ్రులు ఏమంటారోనన్న భయం, యాజమాన్యాల వేధింపులు మరోటి. పోయిన సం వత్సరం అనుశ్రీ అనే విద్యార్థి ఇంగ్లీష్ రావడం లేదని సూసైడ్ చేసుకుని తల్లిదండ్రులకు తీరనివేదన మిగిల్చింది. ఇంగ్లీష్ అనేదే జీవితమా? అది లేకుంటే బతకలేమా? తెలుగులో చదువుకున్న వారికి ఉద్యోగాలు రావా, లేవా? మిమ్మల్ని పెంచిపెద్ద చేసిన తల్లిదండ్రులకు ఎందుకీ శోకం? ఒక్కసారైనా వారి స్థానంలో ఉండి ఆలోచించారా? శివ కుమార్ అనే విద్యార్థి కూడా 'క్షమించండి నాన్న. మీరు నాకోసం ఎన్నో చేశారు. కానీ నేను పరీక్షకు హాజరు కాలేకపోయాను' అని సూసైడ్‌నోట్ రాసి కెనాల్‌లో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎందుకీ అఘాయిత్యం? కారణాలేవైనా ఉండొచ్చు. పరీక్షకు హాజరు కాకపోవడం చనిపోయేంత పెద్దతప్పా? సప్లిమెంటరీ రాసుకోవచ్చు, లేదంటే మరో ఏడాది అను కున్న ఫలితాలు సాధించవచ్చు. రెండు పదులు కూడా నిండని వయసు, అప్పుడే జీవితం అయిపోదు కదా.

లక్ష్యసాధనలో కొందరు తొందరగా, మరికొందరు ఆలస్యంగా చేరుకుంటారు. అంతమాత్రనా తమ జీవితమే వ్యర్థమనే స్థాయికి రావడం, ఆలా ఆలోచించడం, కొత్తదారుల్ని అన్వేషించకపోవడమే. 'ఏది తనంతట తన దరికి రాదు, శోధించి సాధించాలి' అంటారు శ్రీశ్రీ. మనిషి జీవితంలో ముఖ్యమైన కాలాన్ని సద్వినియోగం చేసుకోవడంతో పాటు సరైనమార్గాన్ని ఎంచుకోవడం కీలకం. చక్కని ప్రణాళికతో పాటు ఒత్తిడికి అధిగమించడం ప్రధానం. మరో అంశం విద్యార్థులను ప్రోత్సహించడం. ఇది ఉపాధ్యాయ, అధ్యాపకుల కర్తవ్యం. ఎందుకంటే, ఇటీవల వికారాబాద్‌లో జరిగిన ఓ ఘటన టీచర్ల బాధ్యతారహిత్యాన్ని బహిర్గతపరిచింది. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో జరిగిన టెన్త్‌క్లాస్ ఫేర్‌వెల్ పార్టీలో పెద్దయ్యాక ఏమవుదామనుకుంటున్నావు? అని ఓ బాలికను టీచర్ ప్రశ్నించగా వెటర్నరీ డాక్టర్‌ను అవుతానని బదు లిచ్చింది. 'నీ ముఖానికి డాక్టర్‌వు అవుతావా? మెడికల్ షాపు పెట్టుకుని బతుకు' అని చిన్నతనంగా మాట్లాడటంతో బాలిక స్కూల్ బిల్డింగ్‌పై నుంచి దూకగా కాలు విరిగింది. దీనికి బాధ్యతెవరిది? సమాజాన్ని ప్రభావితం చేసే వృత్తిలో ఉండి ఇలా అవమానించడం సహేతుకం అనిపించుకోదు.

ఇంకో విషయం విద్యాసంస్థల యాజమాన్యం. పోటీ ర్యాంకులతో తమకే అడ్మిషన్లు ఎక్కువగా రావాలని ఆ భారమంతా విద్యార్థుల మీద వేయడం. విద్యార్థి చురుకుదనంగా ఉండాలంటే ఒక్క చదువే కాదు, ఆటాపా టలతో పాటు ఉల్లాసంగా,ఉత్సాహంగా పెరిగే వాతావరణం కూడా అవసరం. విద్యార్థులను ర్యాంకులు తెచ్చే యంత్రాలుగా చూస్తే వారికి కూడా లైఫ్ అంటే చదువులు, ర్యాంకులు అనే భావన కలుగుతుంది. వీరి ఎదుగుదలలో తల్లిదండ్రులది ముఖ్యపాత్ర. తమ పిల్లలు ఉన్నతమైన చదువులు చదివి పెద్ద ఉద్యోగంలో స్థిరపడాలని కలలు కంటారు. ఫలితాలు తారుమారైతే మాత్రం సహించరు. ఇది వారి పిల్లల్ని దూరం చేసుకోవడమే. ఏం జరిగినా ఫర్వాలేదనే భరోసానివ్వాలి. పరీక్షలనేవి ముగింపు కాదు, అలాగని ప్రారంభమూ కాదు. ఎన్నో అవకాశాలు వస్తుంటాయి, పోతుంటాయి. బాగా రాసినా, రాయకపోయినా ఉండాల్సింది ఆత్మవిశ్వాసం. ఇదిఉంటే చాలు ఈరోజు ఓడినా రేపు గెలుస్తామన్న ఆశ నిన్ను నిరంతరం శ్రమించేలా, తపించేలా చేస్తుంది. నేటి విద్యార్థి లోకానికి మనం ఇవ్వాల్సిందిదే.

ఉక్రెయిన్‌కు అమెరికా మిలిటరీ సాయం నిలిపివేత!



ఎం కోటేశ్వరరావు
8331013288

అమెరికా అధినేత డోనాల్డ్ ట్రంప్-ఉక్రెయిన్ అధ్యక్షుడు ఫ్లదిమిర్ జెలెన్‌స్కీ మధ్య ఫిబ్రవరి 28 శుక్రవారం వైట్‌హౌస్‌లోని అధ్యక్షుడి కార్యాలయం ఓవల్ హౌస్‌లో పది నిమిషాల పాటు సాగిన తీవ్ర వాగ్వివాదం యావత్ ప్రపంచాన్ని కుదిపేసింది. రెండవసారి అధికారానికి వచ్చిన వందరోజులు కూడా గడవక ముందే అనేక వివాదాస్పద నిర్ణయాలు, తనకు లొంగని దేశాల వస్తు దిగుమతులపై సుంకాలు విధింపు ప్రకటనలు తెలిసిందే. పదవిని స్వీకరించిన 24 గంటల్లోనే ఉక్రెయిన్ సంక్షోభాన్ని పరిష్కరిస్తానని ప్రకటించాడు. సుంకాల సమస్య వెంటనే అందరికీ కనిపించే ప్రభావం చూపలేదు గానీ 'జోశ్యం చెప్పేబల్లి కుడితి తొట్టిలో పడినట్లు' పరిష్కరిస్తానన్న పెద్ద మనిషి తానే ఒక పెద్ద వివాదంలో ఇరుక్కుపోవటం నిజంగా అనూహ్య పరిణామమే. ఆ ఉక్రోషంతో ఉక్రెయిన్‌కు తాత్కాలికంగా మిలిటరీ సాయాన్ని నిలిపి వేస్తున్నట్లు సోమవారంనాడు ప్రకటించాడు. ఇది వంద కోట్ల డాలర్ల వరకు ఉంటుందని, జెలెన్‌స్కీ ఒప్పందానికి వచ్చేంత వరకు కొనసాగుతుందని అధికారులు వెల్లడించారు. అంతకు ముందు ఆదివారం నాడు లండన్‌లో సమావేశం జరిపిన ఐరోపా పెద్దలు నాలుగు అంశాల శాంతి ప్రతిపాదన గురించి చర్చించారు. తర్వాత బ్రిటన్, ఫ్రాన్సు నేతలు నెల రోజుల కాల్పుల విరమణకు రష్యా ముందు ఒక ప్రతిపాదన పెట్టారు. మొత్తం మీద జెలెన్‌స్కీ బుర్రలో ఏముందో సిఐఏ పసిగట్టలేకపోయిందా? అమెరికా బలవంతంగా ఖనిజాల ఒప్పందాలను రుద్దాలనుకుందా?అహంకారంతో తానే ఊబిలో దిగిందా? అసలేం జరిగింది ?

ఓవల్ ఆఫీసులో అధ్యక్షుడు ట్రంప్, ఉపాధ్యక్షుడు జెడి వాన్స్, జెలెన్‌స్కీ ఆసీనులయ్యారు." శాంతికి దారి మరియు సంపద్వంతం కావటానికి మార్గం బహుశా దౌత్యంలో పాల్గొనటం ద్వారా సాధ్యం కావచ్చు, దాన్నే అధ్యక్షుడు ట్రంప్ చేస్తున్నారు" అని జెడి వాన్స్ అన్నాడు. దాంతో జెలెన్‌స్కీ అందుకొని " ఎలాంటి దౌత్యం, జెడీ మీరు దేని గురించి మాట్లాడుతున్నారు, దాని భావమేమిటి " అన్నాడు. దీంతో మాటా మాటా పెరిగింది. మంచీ మర్యాద లేకుండా అమెరికా మీడియా ముందు వివాదాన్ని సృష్టిస్తున్నారని వాన్స్ అన్నాడు. మిలిటరీతో సమస్యలను ఎదుర్కొంటున్నారని కూడా అన్నాడు. 'యుద్ధ సమయంలో ప్రతి ఒక్కరికీ సమస్యలుంటాయి, మీకంటే చాలా ఉంది, ఇప్పుడు మీకు అవగతం కాదు, కానీ భవిష్యత్‌లో తెలుస్తుందని' జెలెన్‌స్కీ అనటంతో ట్రంప్‌కు మండిపోయింది. 'మాకేం జరుగుతుందో నువ్వు మాకు చెప్పవద్దంటూ' రంకెలు వేశాడు. 'జూదం ఆడటానికి నీ దగ్గర తురుపు ముక్కలేమీ లేవని, లక్షలాది మంది ప్రాణాలతో చెలగాటమాడుతున్నావని' అన్నాడు. 'ఇలాంటి సందర్భాల్లో మంచి కోటు వేసుకొని రావాలని తెలీదా, అసలు కోటు ఉందా?' అని అమెరికన్లు అవమానించారు. అమెరికన్ విలేకరి జెలెన్‌స్కీని కోటు గురించి అడగ్గానే జెడి వాన్స్ నవ్వాడు. యుద్ధం ముగియగానే నేను ధరిస్తాను, బహుశా అది మీరు వేసుకున్నటువంటిది లేదా అంతకంటే మెరుగైంది వేసుకుంటాను అని జెలెన్‌స్కీ సమాధానమిచ్చాడు. వాగ్వాదం తరువాత చివరికి జెలెన్‌స్కీ లేచి వెళ్లిపోయాడు. ముగ్గురిలో పెద్దవాడు ట్రంప్. జెలెన్‌స్కీ-జెడివాన్స్ మధ్య గొడవ ప్రారంభం కాగానే ఉపశమింపచేయాల్సింది పోయి తానే తగాదాకు ఉపక్రమించటం గమనించాల్సిన అంశం. ఉక్రెయిన్ విఫలమైందంటే దాని అర్థం పుతిన్ విజయం సాధించినట్లు కాదు, అది ఐరోపాకు, అమెరికాకూ వైఫల్యమే అని తర్వాత జెలెన్‌స్కీ అన్నాడు. మొత్తమ్మీద అమెరికన్లు అతి తెలివి ప్రదర్శించినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. రచ్చకు కొద్ది గంటల ముందే ఎక్కువగా మాట్లాడవద్దని అమెరికా జెలెన్‌స్కీకి స్పష్టం చేసిందా? అంటే అవుననే వెల్లడైంది. బహుశా అదే జెలెన్‌స్కీని ప్రేరేపించి ఉన్నట్లు కనిపిస్తోంది. ఓవల్ ఆఫీసుకు రాగానే దక్షిణ కరోలినా రాష్ట్ర రిపబ్లికన్ పార్టీ సెనెటర్ లిండ్సే గ్రాహమ్ జెలెన్‌స్కీతో మాట్లాడుతూ రక్షణ ఒప్పందాల గురించి వాదోపవాదాలకు దిగవద్దని హెచ్చరించినట్లు న్యూయార్క్‌టైమ్స్ పత్రిక పేర్కొన్నది. గ్రాహమ్ స్వయంగా ఆ పత్రికతో ఈ విషయాన్ని చెప్పాడు.

జోర్డాన్ రాజు అబ్దుల్లా ఇటీవల అమెరికా పర్యటన జరిపి ట్రంపుతో భేటీ అయ్యాడు.ఇద్దరూ కలసి పత్రికా గోష్టి నిర్వహించారు. గాజాలోని పాలస్తీనియన్లకు జోర్డాన్‌లో నివాసం కల్పించేందుకు రాజు అబ్దుల్లా అంగీకరించాడంటూ డోనాల్డ్ ట్రంప్ ప్రకటించేశాడు. అక్కడే అది అవాస్తవం అంటే పరువు పోతుందని అనుకున్నాడేమో తమాయించుకొని ట్రంప్ పరువు కాపాడేందుకు అబ్దుల్లా మౌనంగా ఉన్నాడు. తర్వాత అలాంటిదేమీలేదని, తమకు అంగీకారం కాదని కూడా ప్రకటించాడు. అలాగే జెలెన్‌స్కీని ఇరికించాలన్న దుష్టాలోచనతో ట్రంప్ అదే మాదిరి పత్రికాగోష్టి ఏర్పాటు చేశాడు. అయితే అనుకున్నదొకటి, అయ్యింది ఒకటి. జెలెన్‌స్కీ ప్రశ్నించకపోతే తాను ఇబ్బందుల్లో పడతాడు. తమ దేశ రక్షణ హామీ సంగతి ఏమిటని ప్రశ్నిస్తాడని అమెరికన్లు ఊహించలేకపోయారు. దౌత్య మర్యాదలు, సంస్కారాన్ని పక్కనపెట్టి అవమానించటంతో జెలెన్‌స్కీ ఖనిజాల ఒప్పందంపై సంతకాలు చేయకుండానే లేచి వెళ్లిపోయాడు. శాంతి ఒప్పందానికి అంగీకరిస్తేనే తిరిగి రా అని ట్రంప్ ప్రకటిస్తే, మీరు పిలిస్తేనే వస్తా, భద్రతకు హామీనిస్తే ఖనిజాల ఒప్పంద పత్రం మీద సంతకం చేస్తానంటూ బంతిని జెలెన్‌స్కీ అవతలివైపు నెట్టాడు. సోమవారం నాడు లండన్‌లో కెనడాతో సహా పద్దెనిమిది ఐరోపా దేశాల నేతలు సమావేశమై పరిస్థితిని సమీక్షించి 'పాము చావకుండా కర్ర విరగకుండా' అన్నట్లు అమెరికాకు మరింత ఆగ్రహం కలగకుండా, నట్టేట వదిలేదని ఉక్రెయిన్‌కు ఊరట పలుకుతూ ఒక ప్రకటన చేశారు. అవ్వా, బువ్వా రెండూ కావాలంటే కుదరదు అన్నట్లుగా పరిస్థితి ఉంది, ఏం జరగనుందన్నది యావత్ ప్రపంచంలో తలెత్తిన ఆసక్తి. ఎందుకిలా జరిగింది, పరిణామాలు, పర్యవసానాలేమిటి?

ఉక్రెయిన్ శాంతికి హామీ ఇచ్చేందుకు సుముఖంగా ఉన్న కూటమి నాలుగు అంశాలతో ప్రతిపాదన రూపొందించినట్లు బ్రిటన్ ప్రధాని కెయిర్ స్టార్మర్ లండన్ సమావేశం తర్వాత ప్రకటించాడు. ఈ క్రమంలో అమెరికా భాగస్వామి కావాలని కోరుతున్నట్లు, ఈ మేరకు ప్రయత్నాలను ముమ్మరం చేస్తామని కూడా చెప్పాడు."ఈ రోజు మేము చరిత్ర కూడలిలో ఉన్నాము.దీర్ఘకాలం తర్వాత ఐరోపా ఐక్యత ఇంత ఉన్నత స్థాయిలో ఉండటం చూడలేదు "అన్నాడు. నిజమైన శాంతి, హామీతో కూడిన భద్రతకు అమెరికా సహకారం కోసం ఐరోపాలో మేమంతా ఒక ప్రాతిపదికను కనుగొనేందుకు పని చేస్తున్నామని జెలెన్‌స్కీ చెప్పాడు. నాలుగు అంశాలు ఏవంటే, ఉక్రెయిన్‌కు సహాయం కొనసాగింపు-రష్యా మీద ఆర్థిక ఒత్తిడి పెంపు, శాంతి ఒప్పందం కుదిరితే అది ఉక్రెయిన్ భద్రత, సార్వభౌమత్వాన్ని కాపాడేదిగా ఉండేట్లు చూడాలి-శాంతి చర్చల్లో ఉక్రెయిన్‌కు భాగస్వామ్యం విధిగా ఉండాలి. శాంతి ఒప్పందం కుదిరితే అది భవిష్యత్‌లో ఏదైనా దురాక్రమణను ఎదుర్కొనే విధంగా రక్షణ సామర్థ్యాలను పెంచాలి. ఉక్రెయిన్ ఒప్పందాన్ని బలపరిచేందుకు, తరువాత శాంతికి హామీగా ఉండేందుకు కలసి వచ్చే వారితో ఒక కూటమిని అభివృద్ధి చేయాలి. స్తంభింప చేసిన రష్యా ఆస్తుల నుంచి వచ్చే వడ్డీ మొత్తం నుంచి 2.4 బిలియన్ డాలర్లను ఉక్రెయిన్ మిలిటరీ అవసరాల కోసం ఇవ్వాలని, ఇది గాక తాము మరో రెండు బిలియన్ డాలర్ల మొత్తాన్ని ఐదువేల గగనతల రక్షణ క్షిపణుల కొనుగోలు రుణం ఇవ్వాలని నిర్ణయించినట్లు బ్రిటన్ ప్రధాని చెప్పాడు. గతం నుంచి తాము పాఠాలు నేర్చుకున్నామని, రష్యా సులభంగా ఉల్లంఘించేందుకు అవకాశమిచ్చే బలహీన ఒప్పందాన్ని తాము అంగీకరించబోమన్నాడు. ప్రతిపాదిత ఐరోపా కూటమిలో ఏయే దేశాలు ఉన్నదీ చెప్పలేదు. ఒప్పందం కుదరాలన్న ట్రంప్‌తో ఏకీభవిస్తున్నామని, దాన్ని అందరం కలసి చేయాలన్నాడు. గత శుక్రవారం జరిగిందాన్ని చూడాలని ఎవరూ కోరుకోలేదని, అమెరికా నమ్మదగిన దేశం కాదంటే తాను అంగీకరించనని కెయిర్ చెప్పాడు. ఐరోపాను తిరిగి సాయుధం కావించటం తక్షణ అవసరమని ఐరోపా కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాండెర్ లియాన్ చెప్పగా, ఉక్రెయిన్ ఎంతకాలం ప్రతిఘటిస్తే అంతకాలం మద్దతు ఇవ్వాలని భావించినట్లు నాటో ప్రధాన కార్యదర్శి మార్క్ రూటే చెప్పాడు. సముద్ర, గగనతల దాడులు, మౌలిక సదుపాయాల ధ్వంస దాడులు నెల రోజులు ఆపాలని బ్రిటన్, ఫ్రాన్సు ప్రతిపాదించాయి. అయితే భూతల దాడుల విరమణ అంశం లేదు.



> గాజాలో శాంతి ఒప్పందాన్ని ఏ క్షణంలోనైనా ఉల్లంఘించేందుకు చూస్తున్న ఇజ్రాయిల్‌కు అన్ని రకాలుగా ట్రంప్ మద్దతు తెలుపుతున్నాడు. మధ్య ప్రాచ్యం, పశ్చిమాసియాలో తిష్టవేయటం అమెరికా లక్ష్యం. దానికి పావుగా ఇజ్రాయిల్ ఉంది. ఐరోపాలో పరిస్థితి వేరు. మిత్ర వైరుధ్యం ఉన్నప్పటికీ యావత్ ఐరోపా అమెరికా ప్రభావంలో ఉంది, కొత్తగా అమెరికా కాలూనాల్సిన అవసరం లేదు. నాటో విస్తరణ పేరుతో రష్యా ముంగిట ఆయుధాలతో తిష్టవేయాలని చూసిన అమెరికాకు అనూహ్యంగా ఎదురుదెబ్బ తగిలింది. ఎన్ని ఆయుధాలు, ఎంత డబ్బు అందించినా పుతిన్ సేనలపై ఉక్రెయిన్ గెలిచే అవకాశాలు లేవని స్పష్టమైంది. రష్యా కమ్యూనిస్టు లేదా వామపక్ష శక్తుల పాలనలో లేదు. కమ్యూనిస్టుల పరిభాషలో చెప్పాలంటే అది ఒక బూర్జువా దేశం. అందువలన చైనాకు వ్యతిరేకంగా దాన్ని దగ్గరకు తీసుకోవాలని, చైనాతో ప్రచ్ఛన్న యుద్ధం కొనసాగించాలన్నది అమెరికన్ల తాజా ఎత్తుగడగా కనిపిస్తున్నది.

ఈ పూర్వరంగంలో పరిణామాలు, పర్యవసానాల గురించి రకరకాల చర్చలు మొదలయ్యాయి. జెలెన్‌స్కీ దిగివచ్చేంత వరకు మిలిటరీ సాయాన్ని నిలిపివేసినట్లు ప్రకటించిన పూర్వరంగంలో ఐరోపా ఆ మేరకు భర్తీ చేస్తుందా ? పరిమితంగానే అయినప్పటికీ ట్రంప్ వైఖరిని నిరసిస్తూ అమెరికాలో కొన్ని చోట్ల ప్రదర్శనలు జరిగాయి.అధికార రిపబ్లికన్, ప్రతిపక్ష డెమోక్రటిక్ పార్టీలోనూ భిన్నాభిప్రాయాలు వెల్లడయ్యాయి. ట్రంప్ గద్దె దిగేంత వరకు అమెరికా మిలిటరీ నౌకలకు ఒక్క లీటరు కూడా విక్రయించేది లేదని నార్వే చమురు కంపెనీ హాల్ట్‌బాక్ బంకర్స్ యజమాని ప్రకటించాడు. 2024లో ఈ కంపెనీ మూడు మిలియన్ లీటర్లు విక్రయించింది.అయితే అమెరికాతో తమ సంబంధాలకు ఎలాంటి ఇబ్బంది లేదని నార్వే ప్రభుత్వం ప్రకటించింది. లండన్‌లో సమావేశమైన దేశాలు ఉక్రెయిన్‌కు మద్దతు ఇవ్వాలని సంకల్పం చెప్పుకున్నప్పటికీ అమెరికాతో ఘర్షణకు సిద్ధంగా లేవు. కొందరి విశ్లేషణ ప్రకారం అమెరికా-ఐరోపా మధ్య విభేదం పెరిగిందని, ట్రంప్ వైఖరి యూరోపియన్లను చైనా వైపు మొగ్గుచూపేందుకు దోహదం చేసేదిగా ఉందని గాభరాపడుతున్నారు. కమ్యూనిస్టు సోవియట్ యూనియన్‌కు వ్యతిరేకంగా అమెరికాతో చేతులు కలిపిన ఐరోపా ఇప్పుడు అంతకంటే బలమైన కమ్యూనిస్టు చైనాతో చేతులు కలుపుతుందా ! గాజాలో శాంతి ఒప్పందాన్ని ఏ క్షణంలోనైనా ఉల్లంఘించేందుకు చూస్తున్న ఇజ్రాయిల్‌కు అన్ని రకాలుగా ట్రంప్ మద్దతు తెలుపుతున్నాడు. మధ్య ప్రాచ్యం, పశ్చిమాసియాలో తిష్టవేయటం అమెరికా లక్ష్యం. దానికి పావుగా ఇజ్రాయిల్ ఉంది. ఐరోపాలో పరిస్థితి వేరు. మిత్ర వైరుధ్యం ఉన్నప్పటికీ యావత్ ఐరోపా అమెరికా ప్రభావంలో ఉంది, కొత్తగా అమెరికా కాలూనాల్సిన అవసరం లేదు. నాటో విస్తరణ పేరుతో రష్యా ముంగిట ఆయుధాలతో తిష్టవేయాలని చూసిన అమెరికాకు అనూహ్యంగా ఎదురుదెబ్బ తగిలింది. ఎన్ని ఆయుధాలు, ఎంత డబ్బు అందించినా పుతిన్ సేనలపై ఉక్రెయిన్ గెలిచే అవకాశాలు లేవని స్పష్టమైంది. రష్యా కమ్యూనిస్టు లేదా వామపక్ష శక్తుల పాలనలో లేదు. కమ్యూనిస్టుల పరిభాషలో చెప్పాలంటే అది ఒక బూర్జువా దేశం. అందువలన చైనాకు వ్యతిరేకంగా దాన్ని దగ్గరకు తీసుకోవాలని, చైనాతో ప్రచ్ఛన్న యుద్ధం కొనసాగించాలన్నది అమెరికన్ల తాజా ఎత్తుగడగా కనిపిస్తున్నది. అమెరికా, ఐరోపాల నుంచి ముప్పు ఉంది గనుకనే రష్యా ఒక ప్రత్యర్థిగా ఉంది. అది తొలిగితే వాటితో చేతులు కలపటానికి ఎలాంటి అభ్యంతరమూ ఉండదు. గతంలో జి7 కూటమిని విస్తరించి జి8గా మార్చేందుకు అవకాశమిచ్చినపుడు చేరిన సంగతి, 2006 సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో కూటమి సమావేశాలను కూడా నిర్వహించిన సంగతి తెలిసిందే. తిరిగి అంతలోనే కుట్రల కారణంగా రష్యా ఆ కూటమికి ప్రత్యర్థిగా మారింది. చేతులు కలపాలంటే తేలాల్సిన లెక్కలు చాలా ఉన్నందున, చైనాకు వ్యతిరేకంగా వెంటనే మారుతుందని చెప్పలేము. అయితే ప్రతిదేశం తన ప్రయోజనాలకు పెద్ద పీట వేస్తున్నపుడు అనూహ్య పరిణామాలు జరిగితే, ఏం జరుగుతుందో ఎలా చెప్పగలం! ■

పాలనలో పారదర్శకతను జవాబుతారితనాన్ని పెంపొందించడంతోపాటు ప్రజలకు ప్రశ్నించేతత్వాన్ని నేర్పింది సమాచార హక్కు చట్టం. వ్యవస్థను గాడిలో పెట్టేందుకు మార్గదర్శిగా నిలిచింది. గ్రామపంచాయతీ మొదలుకొని పార్లమెంట్ వరకు ఒక్క దరఖాస్తుతో కావలసిన సమాచారం పొందే హక్కును కల్పించింది. కానీ అమలు చేయాల్సిన అధికార యంత్రాంగం ఒకపక్క చట్టాన్ని చుట్టబండలు చేయడానికి ప్రయత్నిస్తుంటే మరోపక్క ప్రజా సమాచార అధికారులకు మొట్టికాయ వేసి సమాచారం ఇప్పించాల్సిన తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్ గత రెండేండ్లుగా సమాచార కమిషనర్లను నియమించడం లేదు. దీంతో సామాన్యుడికి సమాచారం అందడం గగనంగా మారింది.రాష్ట్రంలో సమాచార హక్కు చట్టం 15(1) ప్రకారం సమాచార కమిషన్ 2017 సెప్టెంబర్ 13న ఏర్పడింది. ప్రధాన కమిషనర్‌గా రాజా సదారం కమి షనర్‌గా బుద్ధ మురళిని నియమించారు. 2020 ఆగస్టులో రాజ సదారం పదవి విరమణ పొందడంతో ప్రధాన కమిషనర్‌గా మురళిని నియ మించారు. ఆ తర్వాత 2022

సమాచార కమిషనర్ల నియామకమేది?

సెప్టెంబర్‌లో కట్టా శేఖర్ రెడ్డి, గుగులోత్ శంకర్ నాయక్, సయ్యద్ ఖలీలుల్లా, నారాయణరెడ్డి మహమ్మద్ అమీర్ కమిషనర్లుగా నియమింపబడ్డారు. 2023 ఫిబ్రవరి 24 నాటికి అందరూ పదవి విరమణ పొం దడంతో సమాచార కమిషన్ ఖాళీ అయింది. ఆ తర్వాత గత ప్రభుత్వం 2023 జూలైలో నోటిఫికేషన్ జారీ చేయగా దాదాపుగా 350 దరఖాస్తులు వచ్చాయి.ఎన్నికలు రావడంతో ఆ ప్రక్రియ అంతటితో ఆగిపోయింది. నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఇంతవరకు సమాచార కమిషనర్ల నియామకం గురించి పట్టించుకోవడం లేదు. దీంతో సమాచార కమిషన్లు అప్పిలు ఫిర్యాదులు కొండల్లా పెరిగిపోతున్నాయి. సమాచార కమిషన్ ఖాళీ అయిన తర్వాత ప్రస్తుతం కమిషన్‌లో 10930 అప్పీళ్లు 5635 ఫిర్యాదులు విచారణ కోసం ఎదురుచూస్తున్నాయి.

సమాచారం తెలుసుకోవడం పౌరుల హక్కు. సమాచార హక్కు చట్టం సెక్షన్ 6 కింద దరఖాస్తు చేస్తే సెక్షన్ 7(1) ప్రకారం 30 రోజుల్లో సమాచారం ఇవ్వాలి. కానీ రాష్ట్రంలో సింహభాగం ప్రభుత్వ కార్యాలయాల్లో మొదటి అప్పీల్ చేసిన స్పందన ఉండడం లేదు. అలాగే సమాచార హక్కు చట్టంలోని సెక్షన్4(1) బి అన్నది చట్టానికి గుండెకాయ వంటిది. ఇందులో పదిహేడు అంశాలుంటాయి. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలోని అధికారుల వివరాలు, వారి విధులు నిర్వర్తించాల్సిన బాధ్యతలు, ఆ కార్యాలయానికి వస్తున్న నిధులు వాటి ఖర్చు వివరాలు వీటిని అన్నిటి సంబంధిత ప్రభుత్వ యంత్రాంగమే ప్రజలకు స్వచ్ఛందంగా ఈ పదిహేడు అంశాల ద్వారా తెలియజేయాలి. రాష్ట్రంలో దాఖలవుతున్న సహ దరఖాస్తుల్లో 60 శాతం ఈ సెక్షన్ పరిధిలో సమాచారం కోరుతూ వస్తున్నవే. కానీ జిల్లా మండల స్థాయిలలో ప్రజా సమాచార అధికారులు 4(1) బి ని సరిగా అమలు చేయడం లేదు. ప్రతి ఏడాది పదిహేడు అంశాలను అప్‌డేట్ చేయడం లేదు. కొన్ని జిల్లాల్లో సమీకృత కలెక్టర్ భవన సముదాయంలోని వివిధ ప్రభుత్వ యంత్రాంగాలు వారి కార్యాలయం ముందు కనీసం స.హ.బోర్డులు కూడా ఏర్పాటు చేయడం లేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. సహ చట్టంపై జిల్లాస్థాయిలో మూడు నెలలకు ఒకసారి సమీక్ష చేయాల్సిన అధికారులు అటువైపు దృష్టి సారించడం లేదు. ఉత్తర్వు నంబర్1185 ప్రకారం జిల్లా స్థాయిలో సమాచార హక్కు చట్టం పక్కాగా అమలుపరచడం కోసం అధికారులు సహోద్యమకారులతో జిల్లా కమిటీలు ఏర్పాటుచేయాలి. కానీ రాష్ట్రంలో ఎక్కడ కూడా జిల్లా కమిటీలు ఇంతవరకు ఏర్పడలేదు. సమాచార కమిషనర్ల నియామకం జరిగి అప్పీళ్లు, ఫిర్యాదులు విచారణకు వచ్చినప్పుడే ప్రజా సమాచార అధికారులు సకాలంలో సమాచారం అందిం చగలుగుతారు. అలాగే జిల్లా స్థాయిలో సమాచార హక్కు చట్టంపై అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ సామాన్యులకు సమాచారం ఇచ్చేలా చూసినప్పుడే సమాచార హక్కు చట్టం మనుగడ సాధ్యం.


- అంకం నరేష్, 6301650324

మూఢ నమ్మకాల్లో మునకలేస్తున్నాం

-సత్య

జనవరి 13నుంచి ఫిబ్రవరి 26 వరకు ప్రయాగ్‌రాజ్ (అలహాబాద్)లో మహా కుంభమేళా, ఫిబ్రవరి 28న జాతీయ సైన్సు దినోత్సవం జరిగింది. మీడియా దేనికి ఎంత ప్రచారమిచ్చింది? కుంభమేళాకు ఇచ్చిన ప్రచారంలో వెయ్యో వంతైనా శాస్త్ర విజ్ఞానం, మూఢవిశ్వాసాలు సంబంధిత లాభనష్టాల గురించి పాఠకులు, వీక్షకులకు చెప్పిందా? కుంభమేళా స్నానాలకు- ప్రవచనాలకు ఎక్కడలేని ప్రాధాన్యత ఇచ్చారు. ప్రభుత్వం చెబుతున్న దాని ప్రకారం 66 కోట్ల మంది గంగ, యమున, అంతర్వాహిని అని చెబుతున్న సరస్వతి నది త్రివేణీ సంగమంలో మునకలేసి స్నానాలు చేశారు.

అమెరికా చాట్ జిపిటి, చైనా డీప్ సీక్‌లో మునిగి తేలుతుంటే మనం గంగలో మునక లేస్తున్నాం. మన వారు డీప్ సీక్ రూపొందించలేక పోవటానికి మన దేశాన్ని విదేశీ పాలకులు ఆక్రమించుకోవటమేనంటూ ఆరెస్సెస్ పత్రిక ఆర్గనైజర్‌లో మతకోణాన్ని జోడించి విశ్లేషణ చేశారు. వేదాల్లోనే అన్నీ ఉన్నాయష అని లొట్టలేసుకుంటూ చెబుతారు. గత పదేండ్లుగా పురాణాల్లో చెప్పిన పుక్కిటి కబుర్లను వల్లె వేస్తున్నారు. మన దేశంలో ఎప్పుడో అవయవ మార్పిడి జరిగిందనటానికి వినాయకుడికి ఏనుగు తొండం అమర్చటమనీ, కృత్రిమ గర్భం ద్వారా జన్మించిన పిల్లలకు ఉదాహరణ కౌరవులనీ, ఎంత మంది ఎక్కినా ఒకరికి చోటుండే పుష్పక విమానాలను రూపొందించారని కాకమ్మ కబుర్లు చెబుతు న్నారు తప్ప వేదాల్లో ఉన్నవాటిని వెలికి తీసింది లేదు. శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలని మన రాజ్యాంగం నిర్దేశించగా దానికి విరుద్ధంగా సిలబస్ నుంచి డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతాన్ని తొలగించారు. మనుషులు బ్రహ్మ ముఖం, కాళ్ల చేతులు, ఇతర భాగాల నుంచి పుట్టారని టీచర్లు చెప్పాలన్నమాట. ఎలాంటి వారి చేతుల్లో చిక్కుకున్నాం! రాజ్యాంగాన్ని దెబ్బ తీయటం అంటే ఇదే. ఇలాంటి పాలకులు సైన్సు గురించి జనానికి ఎందుకు బోధిస్తారు? పరిశోధనలకు నిధులు ఎందుకు కేటాయిస్తారు?



నేషనల్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ రిసర్చ్ ఫౌండేషన్ ఏర్పాటు చేయాలని 2005లో నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు జాతీయ సైన్సు సలహా మండలి సిఫార్సు చేసింది. 2008లో ఆమోదం తెలిపారు. ఆ మేరకు ఒక చట్టాన్ని చేశారు. తరువాత మోడీ సర్కార్ అనుసంధాన్ నేషనల్ రిసర్చ్ ఫౌండేషన్ (ఎన్.ఆర్.ఎఫ్) పేరుతో 2023లో ఒక చట్టాన్ని తెచ్చింది. అంతకు ముందు ఎన్ని కబుర్లు చెప్పినా ఇక చూడండి అంటూ 2023 నుంచి 2028 కాలంలో 50 వేల కోట్ల రూపాయలతో పరిశోధనలు చేపడతామని చెప్పారు. ఈ మొత్తాన్ని సమీకరించేందుకు ప్రయివేటు, ప్రభుత్వరంగ సంస్థలను ప్రోత్సహిస్తామన్నారు. డెబ్బయి శాతం నిధులు ప్రయివేటు రంగం నుంచి సేకరిస్తామన్నారు. దీనికి ప్రధాన మంత్రే అధ్యక్షత వహిస్తారు. త్వరలో దేశాన్ని అమెరికా, చైనాల సరసన నిలబెడతామంటున్నారు. మహానుభావులు ఊరికే కబుర్లు చెప్పకూడదు కదా! ఆ స్థాయికి చేరటానికి ఒక మార్గం పరిశోధనా రంగానికి పెద్ద మొత్తంలో కేటాయించాలి. ప్రపంచంలో ఈ కేటాయింపు జిడిపిలో సగటున రెండు శాతం ఉంది. మన దేశంలో 2009-10లో గరిష్టంగా 0.82 శాతం ఉండగా అది మోడీ అధికారానికి వచ్చేనాటికి 0.7 శాతానికి తర్వాత 2024-25 ఆర్థిక సర్వే పేర్కొన్నదాని ప్రకారం 0.64 శాతానికి దిగజారింది. ఎన్.ఆర్.ఎఫ్ ద్వారా ఐదేళ్లలో ఏడాదికి పదివేల కోట్ల రూపాయలు కేటాయించాల్సి ఉండగా 2023-24లో రూ.2,000 కోట్లు కేటాయించి తరువాత దాన్ని కేవలం రూ.258.6 కోట్లకు సవరించారు. వీరు దేశాన్ని ఉద్ధరిస్తారు, యువ పరిశోధకులను ప్రోత్సహిస్తారని ఆశించి భజన చేయాలి.

చైనాను త్వరలో అధిగమిస్తామని, ప్రపంచ వస్తు ఉత్పత్తిదారుగా మారతామని కొంత మంది చెబుతుంటారు. మంచిదే, కానీ ఆచరణ ఏమిటన్నది ప్రశ్న.1990 దశకంలో భారత్-చైనా రెండూ కూడా పరిశోధనలకు జీడీపీలో కేటాయించిన మొత్తం 0.7 శాతమే. కానీ నేడు చైనా 2024లో 2.68 శాతం ఖర్చు చేసింది. 2025-26 మన కేంద్ర బడ్జెట్ డాలర్లలో 584 బిలియన్లు కాగా 2024లో చైనా ఒక్క పరిశోధనకు ఖర్చు చేసిన మొత్తమే 496 బిలియన్ డాలర్లు. అర్థం అవుతోందా! కేంద్ర ప్రభుత్వం 2024 నవంబరు 29న పార్లమెంటులో వెల్లడించిన సమాచారం ప్రకారం పదేండ్లలో మన పరిశోధన ఖర్చు జీడీపీలో 0.6-0.7 శాతం మధ్య ఉండగా ఇజ్రాయిల్ 5.4, అమెరికా 3.5 శాతాల చొప్పున ఖర్చు చేస్తున్నాయి. 'మా తాతలు నేతులు తాగారు. కావాలంటే మా మూతులు వాసన చూడండి' అన్నట్లు కబుర్లు చెబితే దేశం ముందుకు పోదు. అన్నీ నెహ్రూయే చేశారు అని చెప్పే పెద్దలు పరిశోధనకు నిధులు పెంచకుండా ఎవరు అడ్డుకున్నారు?

పోనీ మన దేశం పరిశోధనలకు దూరంగా ఉందా అంటే లేదు. గోమూత్రంలో బంగారం ఎంతుంది, పేడలో ఏముంది? అంటూ శోధిస్తున్నారు. సంఘపరివార్ భావజాలానికి అనుగుణంగా ప్రోత్సహిస్తున్నారు. ఉదాహరణకు జన్యు పరిశోధనలు చేసి దేశంలో ఉన్న జనాభాలో 'శుద్ధమైన జాతి' ఏదో తేల్చేందుకు 2022లో కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వశాఖ నిధులు ఇస్తున్నదనే వార్తలొచ్చాయి. ఇది ప్రమాదకరమని, విరమించాలని జన్యుశాస్త్ర నిపుణులు, చరిత్రకారులు, సామాజిక శాస్త్రవేత్తలు 120 మంది నాడు కేంద్రానికి లేఖ రాశారు. జన్యు చరిత్రను తెలుసుకోవటం అనే కారణాన్ని ప్రభుత్వం చెప్పింది. వివిధ ప్రజా సమూహాల నుంచి గతంలో డిఎన్ఏలను సేకరించి చేసిన విశ్లేషణ ప్రకారం అనేకవాటి సమ్మిళితం అని తేలింది. ఫలానా జన్యువులు ఉన్నవారు పరిశుద్ధులు అంటే మిగతావారిని అవమానించే తీర్పు తప్ప సైన్సు కాదు.

ఇలాంటి గురువుల శిష్యులు చేస్తున్నదేమిటి? సంఘపరివార్ ఏర్పాటు చేసిన అనేక సంస్థల్లో ఆరోగ్యభారతి ఒకటి. అది గర్భ విజ్ఞాన సంస్కార్ పేరుతో ఒక ప్రాజెక్టు నడుపుతున్నది. ఆజాను బాహులు, మంచి రంగు, రూపుతో ఉండే పిల్లలను పుట్టిస్తామని అబద్ధాలు చెప్పుకుంది. గుజరాత్‌లో మొదలెట్టి దేశమంతటా దీన్ని విస్తరించేందుకు తలపెట్టారు. అనేక చోట్ల ఈ మేరకు సభలు, సమావేశాలు కూడా నిర్వహిస్తుంటారు. జర్మన్ హిట్లర్ ఆర్య జాతి ఉత్తమమైనదని చెప్పినట్లుగానే ఉత్తమ హిందూజాతిని, హిందూ దేశభక్తులను రూపొందించేందుకు ఈ ప్రయత్నాలని జనాలను నమ్మిస్తున్నారు. జర్మన్ కాని సైన్సు పుస్తకాలను 1933లో నాజీలు తగులబెట్టారు. వాటిలో నాజీల భావజాలానికి వ్యతిరేకంగా ఉన్నవాటితో పాటు యూదు రచయితలు రాసినవి ఉన్నాయి.

మనదేశంలో అలాంటి ఉదంతాలు చోటు చేసుకుంటున్నాయి. ఇటీవల హైదరాబాద్‌లో బుక్‌ఫెయిర్‌లో రచయితపై దాడికి పాల్పడ్డారు. నెల్లూరులో, తిరుపతి పుస్తక మహోత్సవంలో కాషాయ మూకలు దాడులకు పాల్పడ్డాయి. అలాగే విశాలాంధ్ర స్టాల్ మీద దాడి చేశారు. చాలా సంవత్సరాల క్రితం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలో ఉన్న సుందరయ్య విజ్ఞాన కేంద్రం మీద దాడి చేశారు. చరిత్రలో యంత్ర విధ్వంసకుల గురించి చదివాం. కొన్నింటిని నాశనం చేస్తే తరువాత వేలాది యంత్రాలు వచ్చాయి, వస్తాయి. అలాగే పుస్తకాలను అడ్డుకుంటే భావజాల వ్యాప్తి ఆగుతుందా? పురాతన తక్షశిల విద్యాకేంద్రాన్ని ధ్వంసం చేసినంత మాత్రాన మన దేశంలో భావజాల వ్యాప్తి ఆగిందా! అరచేతిని అడ్డుపెట్టి సూర్యకాంతిని ఆపాలని చూసే బాపతు గురించి వేరే చెప్పాలా? ఇలాంటి వారు అజ్ఞానాన్ని తప్ప విజ్ఞాన శాస్త్రాలను ప్రోత్సహిస్తారా? పరిశోధన, అభివృద్ధికి నిధులు కేటాయిస్తారా? దేశాన్ని మధ్యయుగాల నాటికి తప్ప ముందుకు తీసుకుపోతారా ? ■

నవతెలంగాణ
ఖమ్మం
బుధవారం | మార్చి 05, 2025 | www.navatelangana.com | 5

ఐద్వా నాయకురాలు చావా కమలమ్మ మృతి

- నివాళ్లర్పించిన సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని



నవతెలంగాణ-నేలకొండపల్లి

మండలంలోని మోటాపురం గ్రామానికి చెందిన ఐద్వా, సీపీఐ(ఎం) సీనియర్ నాయకురాలు చావా కమలమ్మ(95) సోమవారం రాత్రి మరణించారు. ఆమె గత కొద్ది రోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆమెకు నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆమె మరణ వార్త విన్న సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, ఐద్వా రాష్ట్ర నాయకురాలు బుగ్గవీటి సరళ, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు, పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్‌లు కమలమ్మ భౌతికకాయాన్ని సందర్శించి ఎర్రజెండా కప్పి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చావా కమలమ్మ మహిళలు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు కృషి చేశారని కొనియాడారు. గ్రామంలో పార్టీని అగ్రభాగాన నిలపడంలో ఆమె చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. కమలమ్మ ఆకస్మిక మరణం పార్టీ అభివృద్ధికి తీరని లోటన్నారు. నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న మహిళ, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించడమే కమలమ్మకు ఇచ్చే ఘనమైన నివాళి అన్నారు. ఆమె భౌతికకాయాన్ని సందర్శించిన వారిలో ఐద్వా జిల్లా కార్యదర్శి బండి పద్మ, పార్టీ మధిర డివిజన్ కార్యదర్శి మేడిపల్లి గోపాలరావు, జిల్లా నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు, కూసుమంచి మండల కార్యదర్శి తోటకూరి రాజశేఖర్, నాయకులు ఏటుకూరి రామారావు, రచ్చ నర్సింహారావు, ఏలూరి రంగారావు, రాసాల కనకయ్య, బెల్లం లక్ష్మి, ఇంటూరి అశోక్, గుగులోతు వీరునాయక్, పార్టీ గ్రామ శాఖ కార్యదర్శి ఏలూరి రామారావు, తాళ్లూరి శ్రీనివాసరావు, గుగులోతు రామచంద్రు, గ్రామ శాఖ సభ్యులు, సానుభూతిపరులు, గ్రామస్తులు ఉన్నారు.

10 నుంచి ప్రజా సమస్యలపై గ్రామాల్లో సర్వేలు

- సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు షేక్ బషీరుద్దీన్



నవతెలంగాణ-తిరుమలాయపాలెం

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం సిపిఎం ఆధ్వర్యంలో పదో తారీకు నుంచి గ్రామ గ్రామాన ఇంటింటికి సర్వేలు చేయనున్నట్టు ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుల షేక్ బషీరుద్దీన్ అన్నారు. స్థానిక గజ్జల వెంకటయ్య భవనంలో పార్టీ మండల కార్యదర్శి వర్గ సభ్యులు అంగిరేకుల నరసయ్య అధ్యక్షతన జరిగిన పార్టీ మండల కమిటీ సమావేశంలో షేక్ బషీరుద్దీన్ మాట్లాడుతూ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 10వ తారీఖు నుంచి గ్రామ గ్రామాన ఇంటింటికి వెళ్లి సమస్యలపై సర్వే చేయనున్నట్లు తెలిపారు. సంక్షేమ పథకాల అమలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపైన పార్టీ ఆధ్వర్యంలో ఈ సర్వే చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సర్వేలో సిపిఎం కార్యకర్తలు నాయకులు సానుభూతిపరులు అందరూ పాల్గొనాలని కోరారు. సర్వే అనంతరం గ్రామాల్లో మండల కేంద్రాల్లో భారీ ధర్నాల నిర్వహించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, నాయకులు అంగరేకుల నరసయ్య, నాగేశ్వరరావు పద్మనాభల సుధాకర్, వశపంగు వీరన్న, రవి, నాగేశ్వరరావు, మట్ట సుధాకర్, బాలు, పప్పుల ప్రసాద్ పాల్గొన్నారు.

వైద్యులు, సిబ్బంది విధులకు సకాలంలో హాజరు కావాలి

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



నవతెలంగాణ- ఖమ్మం

ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల ప్రజలలో విశ్వాసం కల్పించాలని, ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల వైద్య శాఖ సేవా దృక్పథంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని మంగళవారం జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రధాన ఆస్పత్రిలోని క్యాజువాలిటీ, వెయిటింగ్ హాల్, ల్యాబ్, డయాగ్నొస్టిక్ సెంటర్, ఎంపిహెచ్ డబ్ల్యు ట్రైనింగ్ సెంటర్, ఎంసిహెచ్, ఓపి, ఇన్ పేషెంట్ వార్డు, అవుట్ పేషేంట్ వార్డు, గుండె సంబంధిత సెంటర్, కళ్ల చికిత్స కేంద్రం, గర్భిణీ స్త్రీల వార్డ్, మైత్రి ట్రాన్స్ క్లినిక్, మందులు, సరుకులు నిల్వ చేసే స్టోర్ రూమ్ లను కలెక్టర్ పరిశీలించారు. సిబ్బంది వివరాలు, మందులు, ప్రజలకు అందిస్తున్న సేవల గురించి ఆరా తీశారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ అందుబాటులో ఉంటూ, మెరుగైన వైద్య సేవలు అందించాలని, మందుల నిల్వలు సరిపడా ఉండే విధంగా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, ఆసుపత్రిలో రోగులకు అందుబాటులో ఉండాలని తెలుపుతూ, ఆసుపత్రిలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ అధికారులతో కలిసి ఆసుపత్రి మొత్తం తిరిగి నూతనంగా నిర్మిస్తున్న భవనాలను పరిశీలించారు. కావలసిన వసతి ఏర్పాట్లపై, పార్కింగ్, టాయిలెట్స్ నిర్మాణాల కోసం అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. దివ్యాంగులచే నిర్వహిస్తున్న పెయిడ్ పార్కింగ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్.కిరణ్ కుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్ బి.కిరణ్, ఆర్ఎంఓ డాక్టర్ రాంబాబు,వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

రైతు పక్షపాత ప్రభుత్వం కాంగ్రెస్

జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు దుర్గా ప్రసాద్

నవతెలంగాణ- ఖమ్మం

సీతారామ ప్రాజెక్ట్ పూర్తిచేసి కాంగ్రెస్ రైతు పక్షపాత ప్రభుత్వమని నిరూపించుకుందని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ స్పష్టం చేశారు. మంగళవారం ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం (సంజీవరెడ్డి భవనం)లో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావులు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ప్రజలకు, రైతులకు, అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలు అందించడమే కాక అభివృద్ధి చేయటం కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని అన్నారు. సీతారామ ప్రాజెక్టు నుండి గోదావరి జలాలను రాజీవ్ కెనాల్ ద్వారా వైరా రిజర్వాయర్‌కు నీటిని విడుదల చేయడం జరిగిందని, దీంతో సాగర్ ఆయకట్టు పరిధిలో రైతులు కళ్లల్లో ఆనందం వెల్లి విరుస్తుందని అన్నారు. సమావేశంలో టిపిసిసి సభ్యులు, జిల్లా ఓబిసి సెల్ అధ్యక్షులు పుచ్చకాయల వీరభద్రం, జిల్లా కిసాన్, ఎస్సీ సెల్, మైనారిటీ సెల్ అధ్యక్షులు మొక్కా శేఖర్‌గౌడ్, బొడ్డు బొందయ్య, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, జిల్లా కాంగ్రెస్ నాయకులు షేక్ రషీద్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు జెర్రిపోతుల అంజనీ కుమార్, జిల్లా ఓబిసి సెల్ ఉపాధ్యక్షులు గజ్జి సూర్యనారాయణ, బోయిన వేణు, పాలేరు నియోజకవర్గ సేవాదళ్ అధ్యక్షులు బచ్చలికూరి నాగరాజు, గుడిపూడి వేంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎగుమతులకు ప్రభుత్వం చొరవ చూపాలి

నిల్వ, ఎగుమతులు లేకనే తగ్గిన మిర్చి ధర

- తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం సదస్సులో శాస్త్రవేత్త శరత్ బాబు
- ఐక్య పోరాటాలకు సిద్ధం కండి
- అఖిలపక్ష రైతు సంఘాల నేతలు

నవతెలంగాణ-ఖమ్మం

వ్యవసాయోత్పత్తుల ఎగుమతులు ముఖ్యంగా మిర్చి ఎగుమతికి ప్రభుత్వం చొరవ చూపడం లేదని ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త బలేజిపల్లి శరత్ బాబు తెలిపారు. గతేడాది పండించిన మిర్చి పెద్ద మొత్తంలో నిల్వ ఉండడం ప్రపంచ వ్యాప్తంగా మిర్చి దిగుమతి చేసుకునే దేశాలలో వివిధ రకాల సంక్షోభాలు ఏర్పడడం కారణంగానే మిర్చి ధర గణనీయంగా పడిపోయిందని ఆయన విశ్లేషించారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా మహాసభను పురస్కరించుకుని మంగళవారం 'మిర్చి -ధర పతనం పరిష్కార మార్గం' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. మంగళవారం ఖమ్మంలోని జిల్లా పరిషత్ మీటింగ్ హాల్లో జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్ అధ్యక్షతన జరిగిన సదస్సులో శరత్ బాబు మాట్లాడుతూ భారతదేశంలో పండించిన వివిధ రకాల మిర్చిని -పలు దేశాలు దిగుమతి చేసుకునేవి, ఈ ఏడాది దిగుమతుల విషయంలో ఆయా దేశాల స్థానిక పరిస్థితులు అన్నింటికి మించి అమెరికాలో ట్రంప్ తీసుకుంటున్న చర్యలు కారణమవుతున్నాయన్నారు. భారతదేశ ప్రధాని ట్రంప్‌తో సమావేశమైనప్పుడు -ఎగుమతుల విషయంపై చొరవ చూపాల్సిందని శరత్ బాబు అభిప్రాయపడ్డారు. భారతదేశం దిగుమతి సుంకాన్ని పెంచిందన్న కారణంతో కొన్ని దేశాలకు ఎగుమతులు నిలిచిపోయాయని ఆయన తెలిపారు. భారతదేశంలో పండించే కొన్ని మిర్చి రకాలకు ప్రపంచ వ్యాప్తంగా డిమాండ్ ఉందన్నారు. ఈ ఏడాది తామరపురుగు, ఇతరత్రా కారణాలతో దిగుబడి గణనీయంగా తగ్గిందన్నారు. వ్యవసాయోత్పత్తులకు గిట్టుబాటు ధరలు, వ్యవసాయ రంగ పరిరక్షణ బలమైన రైతాంగ ఉద్యమాలు సమిష్టి కార్యాచరణ అవసరమని శరత్‌బాబు అభిప్రాయపడ్డారు. రైతులే ఎగుమతి చేసుకుంటే దళారీ వ్యవస్థతో ఇబ్బంది ఉండదన్నారు. ఎఫ్పీవోలుగా ఏర్పడి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. మార్కెట్లను నిరంతరం అధ్యయనం చేయాలని రైతులకు, రైతు సంఘాల నేతలకు సూచించారు. దేశంలో వ్యవసాయ రంగ పరిశోధనలు అనుకున్న స్థాయిలో రైతులకు ఉపయోగపడడం లేదని, దిగుబడులు, నాణ్యత పెంచే విషయంలో సరైన సూచనలు అందడం లేదన్నారు. వ్యవసాయానికి సంబంధించిన చట్టాలను సరైన రీతిలో గౌరవించడం లేదని శరతాబాబు తెలిపారు. జీవ వైవిధ్య పంటలపై మరిన్ని పరిశోధనలు సాగాలని, ఆ పరిశోధనలు -రైతాంగానికి ఉపయోగపడేలా ఉండాలన్నారు. మిర్చి పంటకు భవిష్యత్తు ఉందని ఎగుమతి అవకాశాలు తప్పక లభిస్తాయని స్పష్టం చేశారు. వ్యవసాయోత్పత్తులకు మద్దతు ధర నిర్ణయం విషయంలో మరింత పురోగతి రావాలని కేంద్ర మంత్రి మిర్చి ధర రూ. 11781 కొనుగోలు చేస్తామని చెప్పడం హాస్యాస్పదమన్నారు.

రైతుల వ్యధను అర్థం చేసుకోవాలి

ఐక్య పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం

ఐక్య పోరాటాలతోనే వ్యవసాయ రంగ సమస్యలు పరిష్కారం అవుతాయని రైతు సంఘాల నేతలు అభిప్రాయపడ్డారు. మోడీ సర్కార్ వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేస్తూ వస్తున్నదని, రైతుల గురించి పట్టించుకునే స్థితిలో లేదన్నారు. దేశంలోనే మిర్చి ఉత్పత్తిలో తెలంగాణ రెండవ స్థానంలో ఉందని, ఈ ఏడాది మిర్చి సాగు చేసిన రైతులకు పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని తెలిపారు. ప్రభుత్వం మిర్చి బోర్డు ఏర్పాటు చేయాలని, నాఫెడ్ ద్వారా క్వింటా రూ. 25వేలు చొప్పున మిర్చిని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. సదస్సులో మార్కెఫెడ్ ద్వారా మొక్కజొన్నలు కొనుగోలు చేయాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ సదస్సులో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొండపర్తి గోవిందరావు వేదికపైకి అతిథులను ఆహ్వానించగా రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు బాగం హేమంతరావు, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, ఎంఎల్సీ తాతా మధు, సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు నల్లమల వెంకటేశ్వరరావు, అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు గుర్రం అచ్చయ్య, మాజీ శాసన సభ్యురాలు బానోత్ చంద్రావతి, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి సురేష్ తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం బోనస్ డబ్బులు రాలే..!

ఎదురు చూస్తున్న రైతులు

నవతెలంగాణ-కల్లూరు

రాష్ట్ర ప్రభుత్వం సన్న ధాన్యం పండించే రైతులకు కింటాకు 500 చొప్పున బోనస్ ఇస్తున్నామని చెప్పినా ఇంకా సగం మందికి బోనస్ వచ్చిన దాఖలాలు లేవు. బోనస్ ఇదిగో వస్తుంది అదిగో వస్తుందని ఆశగా బ్యాంకుల చుట్టూ తిరుగుతూ బోనస్ డబ్బులు పడలేదంటే నిరాశగా రైతులు వెనుదిరుగుతున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతన్నలకు వెన్నుదన్నుగా నిలబడుతుందని, వారి అవసరాలను గుర్తించి వారికి సహాయం అందిస్తుందని వేదికలపైన మంత్రులు, కాంగ్రెస్ నాయకులు చెబుతూ వస్తున్నారు. ఆర్భాటంగా కొంతమంది రైతులకి ధాన్యం డబ్బులతో పాటు బోనస్ డబ్బులు కూడా ఖాతాలో పడటంతో రుణమాఫీ కాకపోయినా బోనస్ అన్న వచ్చిందనీ రైతులు సంబరపడిపోయారు. ముందుగా పంట చేతికి వచ్చిన వారికి ఈ బోనస్ డబ్బులు వచ్చి ఆలస్యంగా పంట చేతికి వచ్చిన వారికి బోనస్ డబ్బులు పడకపోవడంతో ఇది కూడా రుణమాఫీ లాగానే ఆరంభ శూరత్వమేనా అని రైతులు విమర్శిస్తున్నారు.

సత్తుపల్లి వ్యవసాయ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల రైతులకు బోనస్ డబ్బులు 25.75 కోట్ల రూపాయలు రైతుల ఖాతాలో పడాల్సి ఉంది. 24,375 మంది రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకున్నారు. మొత్తం 15 లక్షలా 32 వేలా 248 కింటాల ధాన్యం అమ్మారు. వీరికి మొత్తం బోనస్ రూపంలో 76 కోట్లా 61 లక్షల 25 వేలా 600 రూపాయలు రైతులకు చెల్లించాల్సి ఉండగా ఈ నెల ఏడో తేదీ వరకు 50 కోట్లా 86 లక్షలా 16 వేల 400 రూపాయలు చెల్లించారు. ఇంకా 25 కోట్లా 75 లక్షలా 9 వేలా 200 రూపాయలు బ్యాంకు ఖాతాల్లో పడాల్సి ఉంది. మండలాల వారీగా పడాల్సిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

తల్లాడ మండలానికి 10 కోట్ల 09 లక్షల 81వేల 200 రూపాయలు రైతుల ఖాతాలో పడాల్సి ఉంది. కల్లూరు మండలానికి 4 కోట్లా 36 లక్షలా 58 వేలా 400 రూపాయలు రైతుల ఖాతాలో పడాల్సి ఉంది. పెనుబల్లి మండలానికి నాలుగు కోట్లా 97 లక్షలా 89 వేలా 400 రూపాయలు రైతు ఖాతాలో పడాల్సి ఉంది. వేంసూరు మండలానికి 5 కోట్లా 60 లక్షలా 10వేల 800 రైతు ఖాతాల్లో జమ కావాల్సి ఉంది. సత్తుపల్లి మండలానికి 70 లక్షలా 69 వేలా 400 రూపాయలు రైతుల ఖాతాల్లో జమ చేయాల్సి ఉంది. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వ స్పందించి తమకు రావలసిన బోనస్ డబ్బులను బ్యాంకు ఖాతాలో జమ చేయాలని మండలాల రైతులు కోరుతున్నారు.



ధాన్యం అమ్మిన రైతులందరికీ బోనస్ డబ్బులు ఇవ్వాలి

- తెలంగాణ రైతు సంఘం మండల కార్యదర్శి అంజయ్య

రాష్ట్ర ప్రభుత్వం సన్నాధాన్యానికి కింటాకు 500 రూపాయలు బోనస్ ఇస్తామని ప్రకటించి కొంతమంది రైతులకే బోనస్ ఇచ్చి మిగిలిన రైతులకు చెల్లించడం లేదు. ప్రభుత్వం వెంటనే నిలిచిపోయిన బోనస్ డబ్బులను రైతు ఖాతాల్లో జమ చేయాలి.

రేపు జాబ్ మేళా

- జిల్లా ఉపాధి అధికారి ఎన్ మాధవి

నవతెలంగాణ- ఖమ్మం

జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించుటకు ఈ నెల 6న గురువారం ఉదయం 10 గంటలకు మోడల్ కెరీర్ సెంటర్ (ప్రభుత్వ ఐటిఐ, టేకులపల్లి) ఖమ్మంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎన్.మాధవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని వైఎస్‌కె. ఇన్ఫో టెక్ ప్రైవేటు లిమిటెడ్‌లో అసెంబ్లింగ్ ఆపరేటర్, టెక్నికల్ టీమ్ సపోర్ట్, క్వాలిటీ చెకర్స్ ఖాళీల కొరకు ఎస్ఎస్‌సి, ఐటిఐ, ఏదేని డిగ్రీ పాస్, ఫెయిల్ అర్హత గల వారు దరఖాస్తు చేసుకోవాలని, ఎంపికైన వారికి వేతనం 16 వేలు ఉంటుందని అన్నారు. అలాగే హైదరాబాద్‌లోని జి.జే. సొల్యూషన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ ఖాళీల కొరకు ఏదేని డిగ్రీ అర్హత కలవారు దరఖాస్తు చేసుకోవాలని, వేతనం 13 వేలు ఉంటుందని అన్నారు. మొత్తం 500 ఉద్యోగ ఖాళీల భర్తీకి గాను జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు, 18 నుండి 30 సంవత్సరాల వయస్సు గల యువతీ, యువకులు అర్హులని, తమ విద్యార్హతల సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలతో జాబ్ మేళాకు హాజరు కావాలని పేర్కొన్నారు.

బైక్ మెకానిక్‌కు ఆర్థికసాయం

నవతెలంగాణ-ఖమ్మం

ఖమ్మం నగరానికి చెందిన ఖమ్మం కార్పొరేషన్ టూవీలర్ మెకానిక్ సోదరుడు మాలేటు విజయ్ గత 10 సంవత్సరాలుగా మెకానిక్ వృత్తిలో కొనసాగుతున్నాడు గత నెల రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో చేయి ఇరిగింది. డాక్టర్లు సూచనలు మేరకు సుమారు 40 రోజులు విశ్రాంతి అని చెప్పడం జరిగిందని, తనకు యూనియన్ తరపున ఆర్థిక సాయం అందించగలరని కోరడంతో ఖమ్మం కార్పొరేషన్ టూ వీలర్ మెకానిక్ యూనియన్ అధ్యక్షుడు వంగాల కొండలరావు ఆధ్వర్యంలో 10 వేల రూపాయలు చెక్కును విజయ్‌కు అందజేశారు. కార్యక్రమంలో తట్టుకోనూరి బ్రహ్మాచారి, లింగన్న బోయిన మురళి, బుల్లెట్ అన్వర్, బల్లి నాగేశ్వరరావు, గడ్డం నరేష్, ఎల్లయ్య, శరత్ పాల్గొన్నారు.

ప్రాణాలంటే అంత నిర్లక్ష్యమా..!

- అవగాహనలేక మనం మాట్లాడలేక పోయాం: ఫలితం అనుభవిస్తున్నాం
- మీ పోరాటంలో న్యాయముంది: ప్రభుత్వం కూడా అనుకూలంగా ఉంది
- పెద్దల మాటను గౌరవించి దీక్షలు విరమించండి: న్యాయం జరుగుతుంది
- సైలో బాధితులతో సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి దయానంద్
- మంత్రులు, సీఎండీని దీక్షా శిబిరం వద్దకు తీసుకొచ్చి చెప్పించండి
- ఎమ్మెల్యేను కోరిన సైలో బంకరు బాధిత ప్రజలు
- కోడ్ ముగిశాక కలెక్టర్, మంత్రులతో చర్చిస్తాను: ఎమ్మెల్యే

నవతెలంగాణ-సత్తుపల్లి

సైలో బంకరు కాలుష్యం వెదజల్లుతుందని పెట్టేముందు వాళ్లకు తెలియదా.. ప్రాణాలంటే అంత నిర్లక్ష్యమా.. అప్పట్లో మనకు అవగాహనలేక మాట్లాడలేక పోయాం.. ఈ విషయంలో మన లోపం ఉంది.. దాని ఫలితాన్ని ఇప్పుడు ప్రత్యక్షంగా అనుభవిస్తున్నామని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ సైలో బంకరు బాధితులతో అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే రాగమయి దయానంద్ సత్తుపల్లి మండలం కిష్టారంలోని సైలో బాధితుల దీక్ష శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే బాధిత ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. సైలో బంకరు తీసెయ్యాలని మీరు చేస్తున్న పోరాటంలో నూరుశాతం న్యాయముందన్నారు. ప్రభుత్వం కూడా మీ సమస్య పట్ల సానుకూలంగా ఉందన్నారు. మనం కూడా చిన్నచిన్న విషయాల్లో పట్టు విడుపులు ఉండాలన్నారు. అప్పట్లో సింగరేణి అధికారులు 10 ఇళ్ల ఇస్తామంటూ ముందుకు వచ్చిన సందర్భంలో మనం వాళ్లని పంపించి వేశామన్నారు. అవి మొదలైతే మిగతావాటి సంగతి ఏంటనే విషయాన్ని వాళ్లకు చెప్పి దెబ్బలాడే అవకాశం ఉండేదన్నారు. వాళ్ల ముందుకు వచ్చినప్పుడు మనం కూడా ఒక అడుగు ముందుకేసి ఉంటే సమస్యకు పరిష్కారమనేది దానంతట అదే దొరుకు తుందన్నారు.

పెద్దల మాటను గౌరవించి దీక్షలు విరమించండి: మీకు న్యాయం జరుగుతుంది

పెద్దలు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పిన విధంగా దీక్షలు విరమిస్తే మీ సమస్య పరిష్కారం అయ్యేంత వరకు వాళ్ల సింగరేణిని వదిలి పెట్టరన్నారు. అలాగే మంత్రులు భట్టి, పొంగులేటి కూడా మీ సమస్య పట్ల సానుకూలతగా ఉన్నారన్నారు. నేను కూడా మీ సమస్య పరిష్కారానికి పోరాటం చేస్తానన్నారు. ఈ నేపథ్యంలో నేను కలెక్టర్‌ను కూడా మీ దగ్గరకు తీసుకురావడం కూడా జరిగిందన్నారు. దీక్షలను కొనసాగించాలా..? వద్దా..? అనే దానిపై మీరంతా చర్చించుకొని ఒక నిర్ణయానికి రావాలన్నారు. అసలే ఎండలు ముదురుతున్న నేపథ్యంలో మీ ఆరోగ్యాలు కూడా దెబ్బతినే అవకాశాలు ఉంటాయని ఒక డాక్టరుగా సలహా ఇస్తున్నానని ఎమ్మెల్యే రాగమయి దయానంద్ సైలో బాధితులకు సూచించారు.

దీక్ష శిబిరానికి మంత్రులు, సింగరేణి సీఎండీ తీసుకొచ్చి హామీ ఇప్పించండి: సైలో బాధితులు

మీరు ఇచ్చిన హామీకి మేమంతా సంతృప్తికరంగా ఉన్నామని, అయితే మీపై నమ్మకంలేక కాదని, మంత్రులు, సింగరేణి సీఎండీని కూడా ఇక్కడికి రప్పించి వాళ్లతో కూడా చెప్పిస్తే అందరి భరోసాతో సుమారుగా 350 కుటుంబాలు సంతోషంగా ఉంటాయని సైలో బాధితులు ఎమ్మెల్యేను సున్నితంగా కోరారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే రాగమయి దయానంద్ కోడ్ అయిపోగానే మంత్రుల వెసులుబాటును చూసుకొని మీ దీక్ష శిబిరం వద్దకు తీసుకొచ్చే ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. మేమంతా చర్చించి అవసరమైతే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యకు పరిష్కారం చూపుతామన్నారు.

23వ రోజుకు చేరిన సైలో బాధితుల దీక్షలు

సైలో బంకరును తీసెయ్యాలని చేపట్టిన రిలే దీక్షల కార్యక్రమం మంగళవారం నాటికి 23వ రోజుకు చేరింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే రాగమయి దయానంద్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు ఉడతనేని అప్పారావు, మొహమ్మద్ కమల్‌పాషా, నరుకుళ్ల రవి, దీక్షల కమిటీ బాధ్యులు మారోజు శ్రీను, పాలకుర్తి నాగేశ్వరరావు, మారోజు నాగేశ్వరరావు, కడారి మదీన, పాలకుర్తి ప్రభాకర్, పాలకుర్తి ప్రభుదాసు, వాడపల్లి కోటేశ్వరరావు, మారోజు అశోక్‌కుమార్, కిష్టపాటి కోటిరెడ్డి, వాడపల్లి అరుణ, కొత్తా లక్ష్మి కొత్తా సాంబయ్య, వాడపల్లి అరుణ, రామాల నాగమణి, కొండా నాగరత్నం, వాడపల్లి నాగమణి, మారోజు నాగరాజు, పాలకుర్తి ప్రవీణ్, నరేంద్ర, ఏసమ్మ, కమలమ్మ, నిర్మల పాల్గొన్నారు.



సాగర్ జలాలతో చెరువులు నింపి

పంటలను కాపాడాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతినేని సుదర్శన్

నవతెలంగాణ-మధిర

సాగర్ జలాలతో చెరువులు నింపి, పంటలను కాపాడాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) మధిర నియోజకవర్గ సమావేశం మంగళవారం దివ్వెల వీరయ్య అధ్యక్షతన పట్టణంలో జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పంట పొలాలు నీళ్లందక ఎండిపోతున్నాయని, చివరి భూముల వరకు సాగర్ జలాలు అందించాలని కోరారు. సాగర్ జలాలతో చెరువులన్నీ నింపాలని, రైతాంగాన్ని ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలో ధాన్యం మొక్కజొన్న, మిర్చి, పండ్ల తోటల రైతులు సాగర్ జలాల కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. మిర్చికి గిట్టుబాటు ధరను క్వింటాళ్లకు రూ.25వేల చొప్పున అందించాలని, మిర్చి బోర్డు ఏర్పాటు చేయాలని, మిర్చిని ఆహార పంటల జాబితాలో చేర్చాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను విజ్ఞప్తి చేశారు.



పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను కచ్చితంగా అమలు చేయాలని రైతులందరికీ రుణమాఫీ చేయాలని, అర్హులైన పేదలందరికీ ఇళ్లు ఇవ్వాలని, కొత్త పెన్షన్లు విడుదల చేయాలని పెన్షన్లను 4వేలకు పెంచాలని, వికలాంగులకు రూ.6వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో స్థానిక సమస్యలపైన ప్రభుత్వం ఇచ్చిన హామీల పైన పెద్ద ఎత్తున ఆందోళనలో నిర్వహించనున్నట్లు తెలియజేశారు. ఈ సమావేశంలో పార్టీ డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు, పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బండి పద్మ, శీలం నరసింహారావు, దొండపాటి నాగేశ్వరరావు, మందా సైదులు, బట్టు పురుషోత్తం, కిలారు సురేషు, రచబంటి రాము, పడికంటి మురళి, మద్దాల ప్రభాకర్ పార్టీ డివిజన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వేసవి దృష్ట్యా అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు తీసుకోవాలి

- అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ

నవతెలంగాణ-వైరా

వైరా మండలంలో క్షేత్రస్థాయిలో ఉపాధి హామీ కూలీల పని ప్రదేశాలను మంగళవారం అదనపు కలెక్టర్ శ్రీజ తనిఖీ చేశారు. వేసవిలో వడ గాల్పుల పట్ల అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ శ్రీజ ఉపాధి హామీ కార్మికులకు సూచించారు. వైరా మండలం స్నానాల లక్ష్మీపురంలో ఉపాధి హామీ కూలీలను కలిసి మాట్లాడారు. జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులలో అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో జాగ్రత్తగా ఉండాలని సూచనలు చేశారు. ఈ సందర్భంగా శ్రీజ మాట్లాడుతూ ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ఉపాధి హామీ పని వేళలో మార్పులు చేయాలని అధికారులకు సూచించారు. ఉపాధి హామీ పని ప్రదేశాల వద్ద అవసరమైన ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో పెట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైరా ఎపిఓ అనురాధ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.





అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జయప్రదం చేయండి

- ఐద్వా ఖమ్మం జిల్లా అధ్యక్షురాలు మేరుగు రమణ

నవతెలంగాణ-వైరాటౌన్

మార్చి 8న జరిగే అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఐద్వా ఖమ్మం జిల్లా అధ్యక్షురాలు మేరుగు రమణ అన్నారు. మంగళవారం స్థానిక బోడేపూడి భవనం నందు ఐద్వా వైరా పట్టణ కమిటీ సమావేశం మచ్చా మణి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మేరుగు రమణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేయాలని అన్నారు. ప్రతి గ్రామానికి బస్సులు వేయాలని, ప్రతి మహిళకు నెలకు 2500 ఇవ్వాలని, ఇందిరమ్మ ఇంటి పథకం అమలు చేయాలని, రైతు రుణమాఫీ, రైతు బంధు పూర్తిస్థాయిలో అమలు చేయాలని, కేంద్ర ప్రభుత్వం చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ బిల్లును అమలు చేయాలని అన్నారు. తదితర డిమాండ్ల సాధన కోసం, మహిళల హక్కుల కోసం కోసం ప్రతి మహిళ పోరాడాలని, పోరాటం ద్వారానే హక్కులు సాధించవచ్చాని అన్నారు. ఈ సమావేశంలో ఐద్వా జిల్లా కమిటీ సభ్యురాలు గుడిమెట్ల రజిత, వైరా పట్టణ కార్యదర్శి తోట కృష్ణవేణి, పట్టణ కమిటీ సభ్యులు కంసాని మల్లికాంబ, బత్తుల ప్రమీల, భూక్యా విజయ, చావా కళావతి, గుమ్మా సాయిలక్ష్మి, తోట పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉపకేంద్రంలో లైన్‌మెన్ డే ఉత్సవాలు

నవతెలంగాణ-కల్లూరు

విద్యుత్ శాఖలో లైన్ మెన్ డే ఉత్సవాలను విద్యుత్ శాఖ అధికారి వెంకట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్లో లైన్ మే డే సందర్భంగా కేకు కట్ మిఠాయిలు పంపిణీ చేశారు. అదేవిధంగా కల్లూరు ఉపకేంద్రంలో పనిచేస్తున్న సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్, ఎల్ రవి, లైన్ ఇన్‌స్పెక్టర్‌లు బత్తుల సత్యనారాయణ, ఉస్మాన్ బేగ్, గ్రామీణ లైన్ మెన్ శ్రీను, జూనియర్ లైన్‌మెన్‌లు, మురళి, రమేష్, రవి, జాన్, సబ్ స్టేషన్ ఆపరేటర్లను, బిల్లు కలెక్టర్లను, స్పాట్ బిల్లర్లు కిరణ్, రాజారావులను, ఆన్ మెన్ వర్కర్లను, ఈ సందర్భంగా విద్యుత్ శాఖ అధికారి వెంకట్, సబ్ ఇంజనీర్ పి.గురునాథం శాలువాలతో సత్కరించారు.

సమ్మర్ యాక్షన్ ప్లాన్‌పై మున్సిపల్ కమిషనర్ రివ్యూ

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్



మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఖమ్మం నగరపాలక సంస్థ కార్యాలయం నందు సమ్మర్ యాక్షన్ ప్లాన్‌కు రివ్యూ మీటింగ్ ఏర్పాటు చేశారు. గత సంవత్సరం ఏ ప్రాంతంలో నీటి కొరత ఏర్పడిందో సమ్మర్ యాక్షన్ ప్లాన్స్ ఇవ్వమని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. వాటర్ ట్యాంకర్ల కొరత లేకుండా సరిపడా వాటర్ ట్యాంకర్ ను సిద్ధంగా ఉంచమని ఇంజనీరింగ్ అధికారులు సూచనలు ఇచ్చారు. కుక్కలు, పక్షులకు ఎండాకాలంలో నీటి కుండలను డివిజన్ పరంగా ఏర్పాటు చేయాలని, మొక్కలు ఎక్కడ ఎండకుండా కాపాడడానికి సరిపడా నీటి సప్లై చేసేలా యాక్షన్ ప్లాన్ రెడీ చేసుకోవాలని హార్టికల్చర్ ఆఫీసర్‌కి ఆదేశాలు ఇచ్చారు.

అక్రమ ఇసుక ట్రాక్టర్‌కు 5వేలు జరిమానా

నవతెలంగాణ-బోనకల్



ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా మండల పరిధిలోని వైరా నది నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌కు రూ.5 వేల జరిమానా విధించినట్లు తహసీల్దార్ అనిశెట్టి పొన్నం చందర్ మంగళవారం తెలిపారు. మండల పరిధిలోని కలకోట సమీపంలోనే వైరా నది నుంచి అక్రమంగా కలకోట గ్రామానికి చెందిన త్రివేణు అనే వ్యక్తి మంగళవారం తన ట్రాక్టర్ ద్వారా ఇసుక తరలిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు సంఘటన స్థలానికి వెళ్లగా కలకోట గ్రామానికి చెందిన టీఎస్ 04 యుడి 2396 ట్రాక్టర్ అక్రమంగా ఇసుక తరలిస్తూ పట్టుబడినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్నందుకుగాను ఆ ట్రాక్టర్ కు రూ.5000 జరిమానా విధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ అభివృద్ధి పనులకు మాత్రమే స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి కూపన్లు తీసుకొని మాత్రమే మండల పరిధిలో నుంచి ఇసుక తరలించాలని సూచించారు.



పాలేరు పాతకాలువకు వారబందీ లేదు

- తహసీల్దార్, ఇరిగేషన్ డీఈ

నవతెలంగాణ -కూసుమంచి

మండలంలోని పాలేరు రిజర్వాయర్‌కు వున్న పాత కాలువ ద్వారా నీటి విడుదల వారబంది లేదని తహసీల్దార్ కరుణ శ్రీ ప్రకటించారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో రైతు సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్, ఇరిగేషన్ డీఈని కలిశారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ.. పాలేరు జలాశయం పరిధిలోని పాత కాలువ ద్వారా నీటిని వారబందీ లేకుండా యాసంగి పంటలకు నీరు నిరంతరంగా ఇవ్వాలని కోరారు. పాత కాలువకు 15 రోజుల క్రితం వారబంధిని ప్రకటించడం మూలంగా పొలాలకు నీరు అందకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్న పరిస్థితిని తెలంగాణ రైతు సంఘం మండల నాయకులు గమనించి జిల్లా నాయకత్వంతో కలిసి పంటలను పరిశీలించారు. ఈ విషయమై అధికారులకు కలిసి మెమోరండాన్ని ఇచ్చారు. పాలేరు పాత కాలువ ద్వారా ఫస్ట్ జోన్ కాబట్టి ఎట్టి పరిస్థితుల్లో వారబంది ఇవ్వొద్దని అధికారులపై తీవ్ర ఒత్తిడి చేయడంతో గతంలో ఇలా వారబందీ ప్రకటించడం వేల ఎకరాలలో పంటలు పూర్తిగా ఎండిపోవడం, కోట్ల రూపాయల్లో రైతులు నష్టపోవడం మరొకసారి జరగకూడదని అధికారులకు, మంత్రికి పదేపదే విజ్ఞప్తి చేయటంతో, తహసీల్దార్ సోమవారం నీరు విడుదల చేయటం జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. పాలేరు పాత కాలువ పరిధిలోని పంటలు ఎండకుండా నీటిని సరఫరా చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు తోటకూర రాజశేఖర్, బిక్కసాని గంగాధర్, మండల నాయకులు చీర్ల రాధాకృష్ణ, వెన్ను ఉపేందర్, తెల్ల మేకల మాధవరావు, ఒక్కంతుల ప్రతాప్, పాల్గొన్నారు.

మొక్కజొన్న పంటను ధ్వంసం చేసిన దుండగులు

పోలీసులకు ఫిర్యాదు చేసిన రైతు

నవతెలంగాణ-తల్లాడ

మండల పరిధిలోని బస్వాపురం గ్రామంలో మొక్కజొన్న పంటను దుండగులు ధ్వంసం చేసి నష్టపరిచారని, వారిపై తగు చర్య తీసుకోవాలని, బాధితుడు షేక్ సాయిబాబా మంగళవారం తల్లాడ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బాధితుని కథనం ప్రకారం రెండు ఎకరాలు కౌలుకు తీసుకుని మొక్కజొన్న సాగు చేశాను. పంట చేతికి వచ్చే సమయంలో దుండగులు మొక్కజొన్న మొక్కలను ధ్వంసం చేసి సుమారు లక్ష రూపాయల వరకు తనను నష్టపరిచారని వాపోయాడు. వారం రోజుల క్రితం ఇద్దరు వ్యక్తులు తన మొక్కజొన్నలో సుమారు 10 కేజీల కంకులు దొంగిలించి తీసుకుని వెళుతుండగా పట్టుకొని, గ్రామంలో తెలియజేశానని ఆ కక్ష మనసులో పెట్టుకొని వారే పంటను ధ్వంసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దుండగులపై చర్య తీసుకుని, తనకు న్యాయం చేయాలంటూ ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు.



- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- మార్కెట్‌లో జరుగుతున్న కొనుగోళ్ల జాప్యం పై ఆగ్రహం
- మిర్చిని గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలని అధికారులకు ఆదేశాలు
- ఖమ్మం మిర్చి యార్డును ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

మిర్చి కొనుగోళ్లలో రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్/ఖమ్మం

నాణ్యమైన మిర్చికి ధర తగ్గించి, కొనుగోలు విషయమై రైతులను ట్రేడర్లు మోసం చేస్తే ఏమాత్రం ఉపేక్షించకుండా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ హెచ్చరించారు. నాణ్యత మేరకు మిర్చికి ధర రావడం లేదని ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో మిర్చి మార్కెట్‌ను మంగళవారం జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మిర్చి యార్డును కలియతిరిగి కొనుగోళ్లను పరిశీలించారు. గిట్టుబాటు ధరకే మిర్చి కొనుగోలు చేయాలని వ్యాపారులకు కలెక్టర్ సూచించారు. తేమశాతం కోసం మిరపకాయలు పట్టుకుని నాణ్యతను పరిశీలించిన కలెక్టర్, సరుకు బాగానే ఉన్నా తక్కువ ధర చెల్లిస్తున్నందుకు ఆగ్రహం వ్యక్తం చేశారు. నాణ్యతను వ్యాపారులు ఎలా నిర్ధారిస్తారని అధికారులను ప్రశ్నించారు. మార్కెట్‌కు వచ్చిన కలెక్టర్‌తో మిర్చి రైతులు, మిర్చి ధరలు గణనీయంగా తగ్గిస్తున్నారని ఆవేదనను వ్యక్తం చేశారు. జెండా పాటకు వేలం వ్యత్యాసంతో వ్యాపారులు మిర్చి కొనుగోళ్లు చేస్తున్నారు. దీంతో చాలా నష్టాలు వస్తున్నాయని రైతులు తెలిపారు. రైతులతో మాట్లాడిన కలెక్టర్ వారికి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మిర్చి కొనుగోళ్లలో జాప్యం చేయకూడదని, అన్నదాతలకు వెంటనే చెల్లింపులు చేయాలని వ్యాపారులకు అన్నారు. మిర్చి పంట కొనుగోళ్లు సాగుతున్న తీరుపై, జెండా పాటకు, రైతుకు దక్కే ధరకు పొంతన లేదని, రైతులకు అన్యాయం జరిగితే సహించేది లేదంటూ అధికారులను హెచ్చరించారు. నాణ్యత పేరుతో రైతులను ఖరీదుదారులు నష్ట పరిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. వారి లైసెన్స్‌లను కూడా రద్దు చేస్తామని హెచ్చరించారు. జిల్లా మార్కెటింగ్ అధికారి ఎం.ఏ. అలీమ్, మార్కెట్ కార్యదర్శి ప్రవీణ్ కుమార్, అధికారులు, తదితరులు కలెక్టర్ వెంట పాల్గొన్నారు.

ఏఐ ద్వారా విద్యార్థులకు సులభతరంగా విద్యా బోధన

సర్కారు బడిలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (కృత్రిమ మేధ)ను వినియోగిస్తూ విద్యార్థులకు సులభతరంగా విద్యా బోధన చేసేందుకు చర్యలు చేపట్టామని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. మంగళవారం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఖమ్మం 53వ డివిజన్ ఎన్ఎస్‌పి కాలనీలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన ఏఐ విద్యా బోధనను పరిశీలించి, ఏఐ విద్యా బోధనకు అవలంబిస్తున్న పద్ధతులను తెలుసుకున్న కలెక్టర్ ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ)ను వినియోగిస్తూ విద్యార్థులను ఆకట్టుకునేలా సులభ రీతిలో బోధన ప్రారంభించాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రయోగాత్మకంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలో ప్రాథమిక పాఠశాల విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పెంచేందుకు ఏఐ సహాయంతో నూతన బోధన పద్ధతులను ప్రవేశపెట్టిందని, మన ఖమ్మం జిల్లాలో 7 ప్రభుత్వ పాఠశాలల్లో ముందస్తుగా పైలెట్ ప్రాజెక్టు కింద ఏఐ విద్యా బోధనను ప్రారంభిస్తున్నామని, ఖమ్మం అర్బన్ ప్రాంతంలో నాలుగు పాఠశాలలు, నేలకొండపల్లి మండలం సింగిరెడ్డి పాలెంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, సత్తుపల్లి మండలంలోని సిద్ధారం, ఎన్టీఆర్ నగర్ లలో ప్రాథమిక పాఠశాలలో ఈ బోధన ఏర్పాటు చేశామని అన్నారు. ఏఐ కోర్సు ప్రతి విద్యార్థికి ప్రత్యేకంగా ఉంటుందని, విద్యార్థి సామర్థ్యాన్ని అంచనా వేస్తూ దానికి అనుగుణంగా బోధన జరిగేలా ఏఐ కోర్సులు రూపొందించడం జరిగిందని అన్నారు.

అనంతరం జిల్లా కలెక్టర్ పాఠశాలల్లో ఏఐ పాఠాలు నేర్చుకుంటున్న చిన్నారులతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ మానిటరింగ్ అధికారి కె.రవి కుమార్, ఎంఈఓ శైలజా లక్ష్మి, జీహెచ్ఎం తులసి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బుర్రి వెంకన్న ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



దేశాన్ని ఆర్థికంగా దెబ్బ తీస్తున్న మోడీ విధానాలు

ఖమ్మం డివిజన్ కమిటీ సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

నవతెలంగాణ-ఖమ్మం

నూతన ఆర్థిక విధానాలు ఫలితంగానే నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకాయని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం ఖమ్మం సుందరయ్య భవన్ లో పార్టీ ఖమ్మం డివిజన్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచ బ్యాంకు సంస్కరణలను వేగవంతంగా మోడీ ప్రభుత్వం అమలు చేస్తుందని, ఈ నూతన సంస్కరణలు ఫలితంగా ప్రజలపై ఆర్థిక భారాలు పెరుగుతాయని, పెట్రోల్, డీజిల్, గ్యాస్, ఇతర వస్తువుల ధరలు విపరీతంగా బీజేపీ పాలనలో పెరిగాయని విమర్శించారు. భారత దేశంలో మూడవ సారి బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, ఇక ప్రజా సమస్యలు పరిష్కారం చెయ్యకుండా నిత్యం మతాల మధ్య చిచ్చు పెట్టే పనిలో ఉండటం వల్ల, మతోన్మాదం పెరిగి దేశం అంతా అల్లకల్లోలం కావడం ఖాయమని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్ఎస్ఎస్ సిద్ధాంతం ప్రకారం మతాలు మధ్య రాజకీయ చిచ్చు పెట్టి దేశంలో అశాంతి ఉండే విధంగా ఆర్ఎస్ఎస్ ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ ఈ రెండు కవలు పిల్లలు అని, ఆర్ఎస్ఎస్ ఆదేశాలు మేరకు మైనార్టీలపై దాడులు చేస్తున్నారని చెప్పారు. బీజేపీ దేశంలో మూడవ సారి అధికారంలోకి వచ్చిన తర్వాత మతోన్మాదం విపరీతంగా పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఒక పక్క నూతన ఆర్థిక విధానాలతో దేశంలో సంక్షోభం ఏర్పడిందని, మరోవైపు ప్రజలు ఉద్యమాల్లోకి రాకుండా మతాన్ని ముందుకు తెచ్చి దేశ ప్రజలతో బీజేపీ నేతలు ఆటలు ఆడుతున్నారని ధ్వజమెత్తారు.



రాబోయే కాలంలో మోడీ అనుసరిస్తున్న ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా జరగబోయే ప్రజా ఆందోళనలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఖమ్మం నగరంలో ఉన్న ప్రజా సమస్యలపై రాబోయే కాలంలో పార్టీ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్, ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్, నాయకులు ఎంఏ జబ్బార్, ఎస్ నవీన్ రెడ్డి, దొంగల తిరుపతిరావు, ఎస్కే మీరా సాహెబ్, బోడపట్ల సుదర్శన్, పి.నాగసులోచన, వజేనేపల్లి శ్రీనువాసురావు, ఎస్కే నాగులు మీరా తదితరులు పాల్గొన్నారు.

బీవీకే ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం



- మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించడమే ధ్యేయం
- బీవీకే ట్రస్ట్ జనరల్ మేనేజర్ వై.శ్రీనివాసరావు, ఇన్‌స్ట్రక్టర్ పి.ప్రమీల

నవతెలంగాణ-ఖమ్మం

ఖమ్మం మంచికంటి మీటింగ్ హాల్‌లోని మంగళవారం బోడేపూడి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత కుట్టు మిషన్ శిక్షణ తీసుకుంటున్న మహిళలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సదస్సు నిర్వహించారు. ముందుగా ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా బీవీకే ట్రస్ట్ జనరల్ మేనేజర్ వై.శ్రీనివాసరావు, ఇన్స్ట్రక్టర్ పి.ప్రమీల మాట్లాడుతూ నేడు మహిళలు ఉపాధి లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని, వారికి ఆసరాగా మా బివికె ట్రస్ట్ నుండి ఉచిత టైలరింగ్, ఇతర శిక్షణలు ఇప్పించి మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించడమే ధ్యేయమని అన్నారు. అదే విధంగా మహిళలు ఎదుర్కుంటున్న ఆర్థిక, రాజకీయ, సామాజిక సమస్యలపై గళం ఎత్తి నినదించాలని, ప్రతి సమస్యపై ప్రతిఘటన అవసరం ఉందని అన్నారు. తొలుత మహిళలకు ఆటలు పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ అధ్యాపకులు గోవిందరావు,

పి.రఘాన్సీకుమారి, జి.శ్రీదేవి, విజయలక్ష్మి, సామినేని నాగేశ్వరరావు, శ్రావణి, మణి, అంజని, షాహిద, రజని, కవిత, శిరీష, వెంకట్రావు, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.





కాసాని సంస్మరణ సభను జయప్రదం చేయండి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు కనకయ్య

నవతెలంగాణ-సుజాతనగర్

ఈ నెల 9న సీపీఐ(ఎం) రాష్ట్ర నేత కాసాని ఐలయ్య సంస్మరణ సభను జయప్రదం చేయాలని పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాసాని సంస్మరణ సభకు జిల్లావ్యాప్తంగా సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామ గ్రామాన జనరల్ బాడీ సమావేశాలు ఏర్పాటు చేసి మార్చి 9 సుజాతనగర్ సభకు వేలాదిగా ప్రజలను సమీకరించి సభ నిర్వహించనున్నట్లు తెలియజేశారు. కాసాని పోరాటం స్మృతులను ఆయన స్ఫూర్తిని నేటి తరానికి అందించడానికి కాసానిస్ఫూర్తితో భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం అవ్వడానికి ఈ సభను ఉపయోగించనున్నట్లు ఆయన తెలియజేశారు. కాసానితో పాటు ఉద్యమంలో పనిచేసిన నాయకులను, ఇతర రాజకీయ పార్టీల నాయకులను కూడా ఆహ్వానించి ఘనంగా కాసాని ఐలయ్యకు నివాళులు అర్పించనున్నట్లు తెలియజేశారు. సంస్మరణ సభ సందర్భంగా కాసాని ఐలయ్య లక్ష్మి దంపతుల విగ్రహావిష్కరణ కార్యక్రమం ఉంటుందని తెలియజేశారు.

ఈ సభకు పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, బి.వెంకట్, రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, ఇతర రాష్ట్ర నాయకత్వం, ఉమ్మడి ఖమ్మం జిల్లా నాయకత్వం, పార్టీ శ్రేణులు ఈ సభలో పాల్గొననున్నట్లు తెలియజేశారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లిక్కి బాలరాజు, జిల్లా కమిటీ సభ్యులు కున్సోత్ ధర్మ, మండల కార్యదర్శి వీర్ల రమేష్, మండల కార్యదర్శి వర్గ సభ్యులు కాట్రాల తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాల ద్వారా
పెట్రోల్ బంకుల నిర్వహణ

- మారుమూల గ్రామాలలో ప్రతి ఇంటికీ తాగునీరు అందాలి
- పెండింగ్ ధరణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి
- కలెక్టర్ జితేష్ వి.పాటిల్



నవతెలంగాణ-పాల్వంచ

స్వయం సహాయక సంఘాల ద్వారా పెట్రోల్ బంకుల నిర్వహణకు అవకాశం కల్పిస్తున్నట్టు కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తెలిపారు. మంగళవారం ఐడీఓసీ కార్యాలయం నుండి జిల్లాలోని ఆర్డీవోలు, జడ్పీ సీఈవో, తహసీల్దార్లు, నీటిపారుదల శాఖ అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీఓలు ఏటీఎంలతో స్వయం సహాయక బృందాల ద్వారా పెట్రోల్ బంకు నిర్వహణ, యూడీఐడీ సదరం, పెండింగ్ ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు, వేసవి ముందస్తు జాగ్రత్తలు, పెండింగ్ ధరణి దరఖాస్తుల పరిశీలన, తాగునీటి సమస్యలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ... మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలని, వారికి ఆర్థిక భరోసా కల్పించేందుకు బ్యాంకు ద్వారా రుణాలు ఇచ్చి ప్రభుత్వం ప్రోత్సాహం ఇస్తుందన్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో మహిళలు పెట్రోల్ బంకులు ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తుందన్నారు. ఈ పెట్రోల్ బంక్ స్థాపన కోసం జిల్లాలో రహదారి పక్కన 10 కుంటల ప్రభుత్వ స్థలాన్ని గుర్తించవలసిందిగా అధికారులను ఆదేశించారు. సదరం శిబిరాలలో వైకల్య నిర్ధారణ కోసం వచ్చేవారికి అన్ని సదుపాయాలు అందుబాటులో ఉంచాలని కలెక్టర్ అధికారులు ఆదేశించారు. సదరం సర్టిఫికెట్ల కోసం ఇకనుండి యూడీఐడీ పోర్టల్ ద్వారానే దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. సదరం సర్టిఫికెట్లను స్మార్ట్ కార్డు రూపంలో పోస్టల్ శాఖ ద్వారా ఇంటికి పంపిస్తారని ఆయన తెలిపారు. రానున్న వేసవి కాలంలో ఎండల తీవ్రత, వడగాలను అధికంగా నమోదు అయ్యే అవకాశం ఉన్నందున తాగునీటి ఎద్దడి రాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మారుమూల గ్రామాల్లోని ప్రతి ఇంటికీ తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని, నీటి సరఫరాలో తలెత్తే సమస్యలను త్వరితగతిన పరిష్కరించి అంతరాయం లేకుండా నీటి సరఫరా అందించాలన్నారు. గ్రామంలోని ప్రతి ఇంటి ఆవరణలో ఇంకుడు గుంతలు నిర్మించేలా ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. శిథిలావస్థలో ఉన్న పాఠశాలలను గుర్తించి నివేదికలను త్వరితగతిన అందించాలని అధికారులను ఆదేశించారు. శిథిలావస్థలో ఉన్న తరగతి గదులను కూల్చి వేసవి సెలవులు నాటికి పనులు ప్రారంభించి సెలవులు అనంతరం పాఠశాలల ప్రారంభం నాటికి నూతన భవనాలను నిర్మిస్తామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని ఆశ్రమ పాఠశాలలో సీడ్ బ్యాంక్‌లను నిర్వహించాలని, విద్యార్థులకు విత్తనాల సేకరణ పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఇప్ప, కరక్కాయ ముష్టి, సుబాబులు ఏ పాఠశాలలో అధికంగా విత్తనాలను సేకరిస్తారో వారికి ప్రోత్సాహక బహుమతులు ఉంటాయని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ధరణి మాడ్యూల్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో పరిశీలించి పెండింగ్‌లో లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ డీ.వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు, కలెక్టర్ విద్యా చందన, జిల్లా వైద్య శాఖ అధికారి భాస్కర్ నాయక్, ఆర్ఎంఓ రమేష్, మిషన్ భగీరథ ఈఈలు నళిని, తిరుమలేష్, డీఎల్‌పీఓ భద్రాచలం సుధీర్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ షర్ఫుద్దీన్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



జర్నలిస్ట్ కుమార్‌కు పితృవియోగం

- పరామర్శించిన సీపీఐ(ఎం) నేతలు

నవతెలంగాణ-కొత్తగూడెం

కొత్తగూడెం సీనియర్ జర్నలిస్టు కందే కుమార్ తండ్రి కందె నరసయ్య (70) మృతి చెందారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న నరసయ్య మంగళవారం ఉదయం మృతి చెందారు. విషయం తెలుసుకున్న సీపీఐ(ఎం) నేతలు మున్సిపల్ పరిధిలోని ఏ-పవర్ హౌస్ బస్తీలో గల వారి ఇంటికి వెళ్లారు. నరసయ్య భౌతికకాయాన్ని సందర్శించి, పూల మాలవేసి నివాళులు అర్పించారు. కుమార్ కుటుంబ సభ్యులను ఓదార్చారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజె. రమేష్, జిల్లా కమిటీ సభ్యులు లిక్కి బాలరాజు, భూక్యా రమేష్, నందిపాటి రమేష్, సిఐటియు నాయకులు కత్తి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం)లో పలు కుటుంబాలు చేరిక

నవతెలంగాణ-చర్ల



సీపీఐ(ఎం) పార్టీ నిత్య పోరాటాలకు ఆకర్షితురులై మండలానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన పలు కుటుంబాలు పార్టీలో చేరాయి. మంగళవారం పార్టీ కార్యాలయంలో మండల కార్యదర్శి మచ్చా రామారావు ఆధ్వర్యంలో జరిగిన చేరికలలో లింగాపురానికి చెందిన పాముల సాంబశివరావు, పాత చర్లకు బత్తుల రమాదేవి, సాయి నగర్‌కు చెందిన బీర లక్ష్మి, విల్ల సమ్మక్క తదితరులు ఉన్నారు. మండలంలో భవిష్యత్తులో ప్రజా పోరాటాల్లో అన్ని రకాల ప్రజలు భాగస్వాములై ప్రజా సమస్యలపై పోరాటం చేసి సాధించుకోవాలని కష్టజీవుల కోసం అహర్నిశలు పోరాటం చేసే పార్టీ అని కార్యదర్శి అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు కారం నరేష్, పామరు బాలాజీ, పొడుపు గంటి సమ్మక్క, దొడ్డి హరినాగవర్మ, ఊడుగుల సారోన్ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- కలెక్టర్ జితేష్ వి.పాటిల్

నవతెలంగాణ-మణుగూరు



ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మణుగూరు ప్రభుత్వాసుపత్రిని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆసుపత్రిలో కలియ తిరుగుతూ జనరల్ వార్డు, ఇన్ పేషెంట్ వార్డ్, ల్యాబ్, స్కానింగ్, డయాలసిస్ యూనిట్‌లను పరిశీలించి రోగులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రోగులతో మాట్లాడుతూ వైద్యం సరిగ్గా అందుతున్నాయా, మందులు ఇస్తున్నారా, వైద్యులు అందుబాటులో ఉంటున్నారా, ఎన్ని రోజుల నుండి ఆసుపత్రిలో ఉంటున్నారు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... ప్రభుత్వ ఆసుపత్రికి పేదవారు వస్తారని, వారికి మెరుగైన సేవలు అందించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని సదుపాయాలు కల్పిస్తున్నారని, వీటిని ప్రజలు ఉపయోగించుకునేలా చూడాలన్నారు. ప్రయివేట్ ఆస్పత్రికి వెళ్లి ఆర్థికంగా నష్టపోకుండా అవగాహన కల్పించాలని అన్నారు. ఆసుపత్రిలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన గైనకాలజిస్ట్ డాక్టర్ అజంతాతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ ప్రసవాల సంఖ్య పెరిగేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గర్భిణీలు తీసుకోవలసిన జాగ్రత్తలు, పోషక ఆహార గురించి అవగాహన కల్పించాలన్నారు. ఆసుపత్రిలో రానున్న వర్షాకాలంలో స్లాబ్ లీకేజ్ లేకుండా చేయవలసిన మరమత్తుల వివరాలను నివేదికలు సమర్పించాలని ఆసుపత్రి సూపర్డెంట్‌ను ఆదేశించారు. ఆస్పత్రిలో బ్లడ్ స్టోరేజ్‌ని అందుబాటులోకి తేవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆసుపత్రి సిబ్బందితో ఆస్పత్రికి కావలసిన వసతులు, ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలపై సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రక్త పరీక్ష కేంద్రం, స్కానింగ్ కేంద్రంలో కావలసిన యంత్ర పరికరాల కోసం నివేదికలు సమర్పించాలని, వాటిని త్వరలోనే మంజూరు చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఆస్పత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు సకాలంలో వేతనం రావడం లేదని వినతి పత్రం అందజేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో చలివేంద్రం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట తహసీల్దార్ రాఘవరెడ్డి, మున్సిపల్ కమిషనర్ టి.ప్రసాద్, ఆసుపత్రి సూపర్డెంట్ సునీల్, ఆర్ఎంఓ గౌరీ ప్రసాద్, డ్యూటీ డాక్టర్లు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల వేతనాలు విడుదల చేయాలి

- సీఐటీయూ కన్వీనర్ ఎంబీ నర్సారెడ్డి

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



గ్రామపంచాయతీ కార్మికులకు మూడు నెలల వేతనాలను వెంటనే విడుదల చేయాలని పంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని సీఐటీయూ భద్రాచలం పట్టణ కన్వీనర్ ఎంబి నర్సారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం పంచాయతీ కార్యాలయం ఆవరణలో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో నర్సారెడ్డి మాట్లాడారు. ఈ నెల 1వ తేదీ నుండి ఏడో తేదీ వరకు జరుగుతున్న కరపత్ర క్యాంపియన్‌లో భాగంగా పంచాయతీ కార్మికులకు కరపత్రాల పంపిణీ చేస్తున్నామని తెలిపారు. గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలను ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సవరించి నూతన జీవోలు ఉన్నప్పటికీ 12 నుంచి 18 సంవత్సరాలు గడుస్తున్నా ఇంతవరకు కనీస వేతనాలను సవరిస్తూ జీవో విడుదల చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకుల నిర్లక్ష్య కారణంగా కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ యూనియన్ నాయకులు కార్మికులు శ్రీనివాస్, సాయి, చెన్నకేశవులు, అనసూయ, సుశీల, రజినీకాంత్, గురవమ్మ వెంకటమ్మ, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పరవళ్ళు తొక్కుతున్న సీతారామ ప్రాజెక్ట్ కాలువ

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి



సీతారామ ప్రాజెక్ట్ కాలువలో నీళ్ళు ఎప్పుడు పారతాయి అని ఎదురు చూసిన రైతులు కోరిక మంగళవారం నెరవేరింది. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గత రెండు రోజులు క్రితం పంప్ హౌజ్ ప్రారంభించడంతో సీతారామ ప్రాజెక్ట్ కాలువలో నీళ్ళు ఏరులై పారుతున్నాయి. నూతన మండలం అయిన అన్నపురెడ్డిపల్లి మండలానికి మంగళవారం ఉదయం 6 గంటల సమయంలో రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పంట పొలాలు నీళ్ళు లేకపోవడంతో పంటలు ఎండిపోతున్న సమయంలో ఒక్కసారే నీళ్ళు రావడంతో గ్రామాల్లో వున్న ప్రజలు సీతారామ కాలువను చూడటానికి వందల సంఖ్యలో చేరుకున్నారు. రాజపురం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సీతారామ ప్రాజెక్ట్ కాలువలో గోదావరి జలాలుకు ఉదయం పసుపు, కుంకుమ చల్లి కొబ్బరికాయలు కొట్టారు. సాయంత్రం సమయంలో బీఆర్ఎస్ నాయకులు కేసీఆర్ చిత్రపటం కెనాల్‌లో పెట్టి పాలాభిషేకం చేశారు. మరికొంత మంది రైతులు రాజకీయాలతో సంబంధం లేకుండా రైతు కోసం కష్టపడిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అని సీతారామ ప్రాజెక్ట్ పనులు ప్రారంభించి గోదావరి నీళ్ళు పొలాలకు అందించిన ఘనుడు కేసీఆర్ అని ఇరువురికి జై కొట్టారు.



విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా ప్రతిష్టమైన ఏర్పాట్లు చేయాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బయ్య అభిమన్యు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

ఇంటర్మీడియట్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలవకుండా అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అభిమన్యు డిమాండ్ చేశారు. భద్రాచలం పట్టణంలో ఎస్ఎఫ్ఐ ముఖ్య కార్యకర్తల సమావేశం మంగళవారం నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. ఎండలు విపరీతంగా ఉండడంతో విద్యార్థులు పరీక్ష హాల్లో అసౌకర్యానికి గురవుతారని, అందుకు విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు, తాగడానికి మంచినీరు ప్రతి గదిలో ఏర్పాటు చేయాలని, నిబంధనల పేరుతో విద్యార్థులను ఇబ్బందుల గురిచేయ వద్దని, అలాగే వారికి మరుగుదొడ్లు కూడా శుభ్రంగా ఉంచే విధంగా చూడాలని, విధుల నిర్వహిస్తున్న సిబ్బందికి సైతం అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు వెళ్లే సందర్భంలో అన్ని రకాల వాహనదారులు కూడా సహాయ, సహకారాలు అందించాలని, ఆర్టీసీ బస్సులు సైతం విద్యార్థుల పరీక్షల సమయానికి అనుగుణంగా నడపాలన్నారు. ప్రయివేటు యాజమాన్యాలను కూడా విద్యార్థులను పరీక్షలకు దూరం చేసే పద్ధతులకు భిన్నంగా వివరించాలని, హాల్ టికెట్లను అందరికీ అందించాలన్నారు. విద్యార్థులు ఉన్నత భవిష్యత్తుకు బాటలు వేసుకునే విధంగా ఈ పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని ఎస్ఎఫ్ఐ కోరుకుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు నాగకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు రవీంద్ర, సాయి, కిరణ్, సుమన్, చందు తదితరులు పాల్గొన్నారు.

ప్రేరణతో కూడిన చదువు ఉన్నత విద్యకు మార్గదర్శకం

- ఏటీడబ్ల్యుఓ చంద్రమోహన్
- లక్ష్యంతో కూడిన చదువు ఉపాధికి సోపానం : తహశీల్దార్
- తల్లిదండ్రుల ఆశలు నెరవేర్చేలా చదవాలి : సీఐ



నవతెలంగాణ-అశ్వారావుపేట

విద్యార్థి దశలో ప్రేరణతో కూడిన చదువు భవిష్యత్తులో ఉన్నత విద్యకు మార్గదర్శకంగా ఉంటుందని, అందుకోసమే పదవ తరగతి విద్యార్థులే కాక ఎనిమి, తొమ్మిది తరగతులు చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులు భవిష్యత్తులో ఏ రంగంలో స్థిరపడాలని అనుకుంటున్నారో, ఇప్పటి నుండే కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించే ఉద్దేశంతో విద్యా ఉద్యోగ సమాచారంతో కూడిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడంతో పాటు ఆయా రంగాల నిపుణులు చే ప్రేరణా తరగతులు నిర్వహిస్తున్నామని ఏటీడబ్ల్యుఓ (సహాయ గిరిజన సంక్షేమ అధికారి) చంద్రమోహన్ సూచించారు. ఐటీడీఏ పీఓ రాహుల్ ఆదేశానుసారం గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న బాలబాలికలు పదవ తరగతి ఉత్తీర్ణత అనంతరం తదుపరి ఏ ఏ కోర్సులతో ఎటువంటి ప్రయోజనం ఉంటుంది, ఏ ఉద్యోగానికి ఏ సబ్జెక్ట్ ఎంచు కోవాలో విద్యార్థులకు వివరించేందుకు, 10వ తరగతి వంద శాతం ఉత్తీర్ణత సాధించడానికి పీఓ ఆదేశానుసారం 8,9,10 పదో తరగతి విద్యార్థులకు జిల్లా వ్యాప్తంగా ఉన్న కెరీర్ గైడెన్స్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం మండలంలోని సున్నంబట్టి ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఏజీహెచ్ఎస్ కావడిగుండ్ల, అనంతారం, అశ్వారావుపేట, ఏహెచ్ఎస్ అశ్వారావుపేట, సున్నంబట్టి, పెద్దవాగు ప్రాజెక్ట్ మొత్తం 6 పాఠశాలలకు చెందిన మొత్తం 465 మంది విద్యార్థినీ, విద్యార్థులకు ప్రేరణ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అధికారిగా హాజరైన చంద్రమోహన్ మాట్లాడారు. భవిష్యత్తులో మీరు ఏమి కాదల్చుకున్నారు ఇప్పటినుంచే ప్రణాళికల రూపొందించుకొని ముందుకు పోవాలని అన్నారు.

లక్ష్యంతో కూడిన చదువే ఉపాధికి సోపానం :

తహశీల్దార్ క్రిష్ణ ప్రసాద్

ప్రతీ విద్యార్థి ఏదో ఒక లక్ష్యం చదవాలని, అప్పుడే ఏదో ఒక ఉపాధికి సోపానంగా మారుతుందని తహశీల్దార్ క్రిష్ణ ప్రసాద్ పదో తరగతి విద్యార్థులకు సూచించారు. ప్రభుత్వం నేడు వసతి గృహాల్లో అనేక వసతులు, సౌకర్యాలు కల్పించి విద్యకు ప్రాధాన్యత కల్పిస్తుందని తెలిపారు. చదువు ఉంటే ఏదో ఒక వృత్తిలో నైపుణ్యం సాధించవచ్చని తెలిపారు.

బట్టీ చదువులతో శూన్య ప్రయోజనం : సీఐ కరుణాకర్



బట్టీ చదువులు కన్నా విశ్లేషణాత్మక చదువులతోనే ఉత్తమ ఫలితాలు పొందవచ్చని సీఐ కరుణాకర్ అన్నారు. ఒక విషయాన్ని అనేక విధాలుగా విశ్లేషించాలని, బిట్‌లు కోసం చదవడం వల్ల జ్ఞానం పెరగదని పాఠ్యాంశాన్ని పూర్తిగా చదివితే జవాబులు వివరంగా రాస్తారని అన్నారు. తల్లిదండ్రులు ఆశయాలకు అనుగుణంగా చదవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో తహశీల్దార్ క్రిష్ణ ప్రసాద్, సీఐ కరుణాకర్, డీఈఈ బాపనయ్య, ఏఈఈ బీవీఎస్ ప్రసాద్, యూబీ మేనేజర్ రాజేష్ కుమార్, ఎంఏవో శివరాం ప్రసాద్, డాక్టర్ రాందాస్, ప్రధానోపాధ్యాయులు సుశీల, సరోజిని, వి.రాంబాబు, భావ్ సింగ్ ,హెచ్.రాంబాబు, అరుణలు పాల్గొన్నారు.



కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

- కార్మిక శాఖ కార్యాలయం ఎదుట సీఐటీయూ ధర్నా

నవతెలంగాణ-ఇల్లందు

73 రకాల షెడ్యూల్ కార్మికులకు కనీస వేతన డ్రాఫ్టును రాష్ట్ర ప్రభుత్వం సవరణ చేసి రూ.26 వేలు అమలు చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం కార్మిక శాఖ సహాయ అధికారి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ శాస్త్రికి వినతి పత్రాన్ని సమర్పించారు. షెడ్యూలు కార్మికుల సర్వేలు రాష్ట్ర వ్యాపితంగా చేస్తున్నట్లు అందులో భాగంగా బిల్డింగు వర్కర్స్, సోలార్ పవర్ ప్లాంట్, సింగరేణి కాంట్రాక్టర్ కార్మికులు, రైస్ దాల్ ఆయిల్ మిల్ కార్మికులు, ఇటుక బట్టలు, ఫౌండ్రి, ఆటో, షోరూం, షాప్ ఎంప్లాయిస్, ఇండస్ట్రియల్ వర్కర్లు, అసంఘటిత రంగ కార్మికులలో సర్వేలు చేసేసర్వేలో వచ్చిన సమస్యలపై ఏఎల్‌ఓకు వినతి పత్రంరూపంలో అందించారు. అనంతరం జరిగిన సభలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అబ్దుల్ నబి, మండల కన్వీనర్ తాళ్లూరి కృష్ణలు పాల్గొని మాట్లాడుతూ... ప్రజా పాలన అందిస్తామని కార్మికులకు మెరుగైన వేతనాలు పెంపుదల చేస్తామని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా కనీస వేతన సవరణ చేసి జీఓ విడుదల చేయాలని కోరారు. లేనిచో ఈ సమస్య పై దశలవారి ఆందోళనా పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమాలలో కామ నాగరాజు, మహమూద్, కటకం రాజయ్య, భద్రు, వెంకన్న, లక్ష్మణ్ పాసి, రాము, ఎన్.శ్రీనివాస్, ప్రేమ్ చంద్, రాజు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కృషి, పట్టుదలతో ఏదైనా సాధించవచ్చు

- ప్రొఫెసర్ కె.లక్ష్మారెడ్డి

నవతెలంగాణ-పాల్వంచ



కృషి పట్టుదలతో ఏదైనా సాధించవచ్చు అని నిట్ వరంగల్ ప్రొఫెసర్ కె.లక్ష్మారెడ్డి అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) పాల్వంచలో తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ జన విజ్ఞాన వేదిక భద్రాద్రి కొత్తగూడెం డిస్ట్రిక్ట్ ఆధ్వర్యంలో సెమినార్ మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన లక్ష్మారెడ్డి మాట్లాడుతూ...కృషి, పట్టుదల, నిబద్ధత, కఠోరశ్రమ, అకుంఠిత దీక్ష ఉంటే ఎంచుకున్న రంగంలో విజయం సాధించవచ్చునని, కొందరు అతి సామాన్య కుటుంబం నుంచి వస్తారు కానీ వాళ్ల కృషి వారిని అందరికన్నా ఉన్నతంగా నిలబెడుతుందని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.పద్మ మాట్లాడుతూ.. నేటి ఈ టెక్నాలజీ యుగంలో కూడా కొన్ని గ్రామాలలో చేతబడి, బాణామతి వంటి మూఢనమ్మకాలతో అమాయకులైనటువంటి వారి ప్రాణాలు తీస్తున్నారని, చదువుకున్న ప్రతి విద్యార్థి తమ గ్రామాల్లో ఇటువంటి మూఢనమ్మకాలపైన ప్రజలను జాగృతం చేయాలని తెలియజేశారు. మరొక వక్త రాజ్యలక్ష్మి ఎస్సీ ఉమెన్స్ కాలేజ్ లెక్చరర్ మాట్లాడుతూ... డార్విన్ జీవ పరిమాణ సిద్ధాంతం గురించి మానవుని ఉద్భవం గురించి జీవపరిమాన క్రమం గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక వైస్ ప్రెసిడెంట్ ఆర్.వెంకటేశ్వర్ రావు, కస్తూరి కళాశాల వైస్ ప్రిన్సిపల్ జె.మాధవి, విజయ ప్రసాద్, డాక్టర్ టి.అరుణ కుమారి, డి.రమేష్, డాక్టర్ కొండలరావు, డాక్టర్ స్వరూప రాణి, పారెల్లి శ్రీనివాస్, పొట్ల పువ్వు శ్రీనివాసరావు, కోటగిరి రాంబాబు, దీపిక, విమల, కావ్య, హారిక, ధర్మారావు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్తగూడెం జనవిజ్ఞాన వేదిక గడచిన మూడు దశాబ్దాల కాలం నుండి మూఢ నమ్మకాలపై అనేక పోరాటాలు సాగిస్తుందని వరంగల్ ఎన్ఐటీ ప్రొఫెసర్ లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక గొల్లగూడెంలోని కిడ్స్ పార్క్ టాలెంట్ స్కూల్ నందు జరిగిన జనవిజ్ఞాన వేదిక ఆవిర్భావ దినోత్సవ సభ జరిగింది. జెవివి జెండాను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. జనవిజ్ఞాన వేదిక 1988 ఫిబ్రవరి 28వ తేదీన అవిర్భవించిందని తెలిపారు. తొలుత కిడ్స్ పార్క్ స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఆయన తిలకించారు. ముగ్గురు విద్యార్థులకు బహుమతులు బహూకరించారు. ఆ విద్యార్థులు ఏర్పాటు చేసిన ఫుడ్ ఫెస్టివల్‌లో పాల్గొని పరిశీలించి, అభినందించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షులు రామిశెట్టి వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించగా ప్రత్యేక ఆహ్వానితురాలు జెవివి రాష్ట్ర నాయకులు అడపాల కస్తూరి, డాక్టర్ ఉపేంద్ర, జిల్లా ప్రత్యేక ఆహ్వానితులు నాగేశ్వరరావు, సింగరేణి ఉమెన్స్ కాలేజీ లెక్చరర్ డాక్టర్ రాజ్యలక్ష్మి, ఎం.మోహనరావు, తిరుపాల్, జిఎంవి. ప్రసాదరావు, సుధాకరరావు, వెస్లి, డిఆర్.ప్రసాదరావు, మౌనిప్రియ తదితరులు పాల్గొన్నారు.

తరాలు మారినా మారనిది స్నేహమొక్కటే

- 1990-91 మిత్ర బృందం

నవతెలంగాణ-చర్ల



స్నేహం ఎంతో మధురమైనది. స్నేహానికి ధనిక, బీద, లింగ వయోభేదం ఉండదని 1990-91 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు అన్నారు. ఎన్ని తరాలు మారినా మారనిది స్నేహం ఒక్కటే. అందుకే 1990-91వ సంవత్సరంలో 10వ తరగతి చదివిన మిత్ర బృందం స్నేహమేరా జీవితం...స్నేహమేరా శాశ్వతం అంటూ బాల్య మిత్రుడికి అండగా నిలిచారు. వివరాల్లోనికి వెళ్తే మండలంలోని మారుమూల గిరిజన ఆదివాసీ గ్రామమైన ఉంజుపల్లికి చెందిన ఇర్ప ముత్తయ్యకు చెందిన పూరిల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల జనవరి నెలలో పూర్తిగా కాలి బూడిదయయింది. దీనికి తోడు రెండు నెలల క్రితం మూలిగే నక్క మీద తాటిపండు పడ్డ చందంగా ఒక యాక్సిడెంట్‌లో కాలు విరిగింది. దాంతో అతడు పూర్తిగా మంచానికే పరిమితమయ్యాడు. రేక్కాడితే గాని డొక్కాడని ఆ నిరుపేద దీన స్థితిని చూసి చలించిన మిత్రబృందం మేమున్నామంటూ ముందుకు వచ్చారు. బాల్య మిత్రుడికి తక్షణ సాయంగా రూ.25 వేలతో ఇంటి నిర్మాణానికి కావాల్సిన సిమెంటు రేకులు, సిమెంటు, సిమెంటు స్తంభాలు అందించి అండగా నిలిచారు. ఆపదలో ఉన్న మిత్రుడికి అండగా నిలిచిన ఆ మిత్ర బృందానికి గ్రామస్తులు, పలువురు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బత్తుల వెంకటేశ్వర్లు, పున్నం రామకృష్ణ, ఎడారి సత్యనారాయణ, హర్షవర్ధన్, వందే త్రిమూర్తులు, గుంటుపల్లి రవి, కొంగూరి వెంకటేశ్వర్లు, దొమల రాజేశ్వరి, సమంతకమణి, తడికల రాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు

నవతెలంగాణ-కొత్తగూడెం



సింగరేణి ప్రధాన కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కార్పొరేట్ ఏరియా పరిధిలోని అన్ని డిపార్ట్మెంట్ల నందు పనిచేసే మహిళా అధికారులకు, ఉద్యోగులకు, అప్రెంటిస్ ఉద్యోగులకు, మహిళా కాంట్రాక్ట్ కార్మికులకు మంగళవారం ఆటల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సింగరేణి జీఎం(పర్సనల్) వెల్ఫేర్, ఐఆర్ అండ్ పిఎం, ఉమెన్స్ సెల్ కన్వీనర్ కవితా నాయుడు పోటీలను ప్రారంభించారు. మహిళా ఉద్యోగులకు బాంబ్ ఇన్ సిటీ, పాసింగ్ బాల్, మ్యూజికల్ చైర్ వంటి పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉమెన్స్ డే ఆర్గనైజర్స్ పి.కిరణ్మయి, బి.సుమలత, డి.శారద, కె.రమ, ఏ.విజయ కుమారి, జిబి. అరుణ కుమారి, కె.శైలజ, ఎన్.గౌతమి, బి.మౌనిక, ఏ.అరుణకుమారి, అక్సర్ జన్నత్ నిషా, కార్పొరేట్ ఏరియా మహిళా అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మందలపల్లి వాటర్ ప్లాంట్‌పై చర్యలు తీసుకోండి

నవతెలంగాణ-దమ్మపేట



మండల పరిధిలోని మందలపల్లిలో గల వాటర్ ప్లాంట్‌పై చర్యలు తీసుకోవాలని ప్రకాష్‌నగర్ కాలనీ వాసి షేక్ అజాం పంచాయతీ కార్యదర్శికి మంగళవారం ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాలు ఇలా ఉన్నాయి. ప్రకాష్‌నగర్ కాలనీలో గల మసీదుకు ముస్లింలు ఉపవాసం విడిచే సమయంలో తాగుటకు గాను మందలపల్లిలోని అల్లిపల్లిరోడ్‌లోని సాయిబాబ ఆలయం పక్కన గల వాటర్‌ప్లాంట్ నుండి సోమవారం కూలింగ్ క్యాన్ తీసుకువచ్చారు. అయితే అట్టి వాటర్ క్యాన్ విషపూరితమైన పురుగుమందు వాసన రావడంతో ముస్లిం సోదరులు ఆ నీటిని పారబోశారు. దమ్మపేటలోని సుజలాం వాటర్‌ప్లాంట్ నుండి మరో క్యాన్ తీసుకువచ్చి ఉపవాస దీక్షను పూర్తి చేశారు. అనంతరం మందలపల్లి వాటర్ ప్లాంట్ వద్దకు వెళ్ళి జరిగిన విషయాన్ని ప్లాంట్ నిర్వాహకులకు చెప్పగా వాసనకే చస్తారా.. అయినా చావలేదుగా అంటూ నిర్లక్ష్యపు సమాధానం చెప్పారు. ప్లాంట్‌లో కనీసపు శుభ్రతను పాటించక పోవడమే కాకుండా పొలాలకు కొట్టే విషపూరిత పురుగు మందుకొట్టే పవర్‌స్ప్రేలు రిపేర్‌లు చేస్తూ వాటిని ట్రయల్ రన్ చేస్తూ ఎవరైనా వాటర్ క్యాన్‌ల కోసం వస్తే అవే చేతులతో వాటర్ క్యాన్‌లను నింపి ఇస్తున్నారని అన్నారు. కనీసం చేతులు కడుక్కోవడం కాని, క్యాన్‌లు శుభ్రం చేయడం కాని చేయడం లేదని కావున తీవ్ర ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న మందలపల్లి వాటర్ ప్లాంట్‌పై చర్యలు చేపట్టి ప్లాంట్‌ను నిలిపి వేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.



అగ్ని బాధితులకు అంగన్వాడీలు చేయూత

- చర్ల సర్కిల్ నుండి రూ.16000 అందజేత

నవతెలంగాణ-చర్ల

మండల పరిధిలోని ఉంజుపల్లి అంగన్ వాడీ హెల్పర్ ఇర్ప బుల్లెమ్మ పూరిల్లు విద్యుద్ఘాతంతో అగ్నికి ఆహుతి కాగా ఆ అగ్ని బాధితులకు అంగన్వాడీలు చేయూత అందించారు. జనవరి 27న విద్యుద్ఘాతంతో అంగన్‌వాడీ హెల్పర్ నివాసం పూర్తిగా కాలిపోవడంతో ఆమెను ఆదుకునేందుకు చర్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు చర్ల సర్కిల్ నుండి మంగళవారం రూ.16000 అందజేసి ఆమెకు చేయూతగా నిలిచారు. కట్టు బట్టలతో నిరాశ్రయులైన వీరి కుటుంబానికి ఆసరాగా అంగన్ వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ చర్ల ప్రాజెక్టు కమిటీ తరుపునుండి ఈ సహకారం అందించారు.

విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాయాలి

- కలెక్టర్ జితేష్ వి.పాటిల్

నవతెలంగాణ-పాల్వంచ



నేటి నుండి ప్రారంభం కానున్న ఇంటర్ పబ్లిక్ పరీక్షలను ప్రశాంతమైన వాతావరణంలో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాల వద్దకు సకాలంలో చేరుకోవాలని సూచించారు. జిల్లాలో ఇంటర్ మొదటి సంవత్సరంలో 9255, రెండవ సంవత్సరంలో 10003 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు. జిల్లాలో మొత్తం 36 పరీక్ష కేంద్రాలలో పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని, ఈ సంవత్సరం కొత్తగా ఎస్ఆర్ డిగ్రీ కళాశాల కొత్తగూడెంలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు గాను చీఫ్ సూపర్డెంట్ అధికారులు 36, అడిషనల్ చీఫ్ సూపర్డెంట్లు 13, డిపార్ట్మెంట్ అధికారులు 36 మంది, సిట్టింగ్ స్క్వాడ్ బందాలు మూడు, కస్టోడియన్ అధికారులు ఐదుగురు, ఇన్విజిలేటర్లు 550, 2 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు వైద్య సహాయం అందించడానికి గాను 72 మంది ఏఎన్ఎంలను నియమించినట్లు కలెక్టర్ తెలిపారు.

శ్రమ దోపిడీయే కార్పొరేట్ ఆర్థిక విధానాల లక్ష్యం

అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవ సదస్సులో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పద్మశ్రీ

నవతెలంగాణ-కొత్తగూడెం





మనువాదం, కార్పొరేట్ ఆర్థిక విధానాల లక్ష్యం శ్రమ దోపిడీని సాగించటమే అని, అటువంటి విధానాలకు వ్యతిరేకంగా శ్రామిక మహిళ సంఘటతంగా పోరాటాలు చేయాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి పద్మశ్రీ పిలుపు నిచ్చారు. సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మార్చి 8 అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా సదస్సు నిర్వహించారు. మంగళవారం స్థానిక మంచి కంటి భవన్‌లో జరిగిన ఈ సదస్సుకు సిఐటియు జిల్లా కోశాధికారి జి.పద్మ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యదర్శి మాట్లాడుతూ మనువాద సిద్ధాంతం మహిళలను మనుషులుగా కూడ గౌరవించే స్థితి లేదని అన్నారు. మాహిళల స్వేచ్ఛ సమానత్వం, ఆర్థిక స్వావలంబనకు మనువాద సిద్ధాంతం వ్యతిరేకమైనదని అన్నారు. పెట్టుబడిదారీ కార్పోరేట్ అనుకూల ఆర్థిక విధానాలు సాగిస్తున్న శ్రమదోపిడిని సమర్ధించటమే మనువాద సిద్ధాంతం కర్తవ్యంగా వుందన్నారు. ఉత్పత్తి ప్రక్రియలో మహిళల శ్రమ కీలంగా వున్నప్పటికి అభివృద్ధి ఫలాలు మాత్రం మహిళలలకు దక్కడం లేదన్నారు. పని కేంద్రాలలో భద్రత లేదని, చేస్తున్న పనికి భద్రతలేదన్నారు. మహిళ ప్రతిరోజు 5 గంటల శ్రమను కుటుంబ నిర్వహణ, పిల్లలు, కుటుంబ సభ్యుల సంరక్షణ కోసం ఖర్చు చేస్తున్నదని ఈశ్రమ ఎక్కడా లెక్కలోకి రావటంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. లక్షల కోట్ల రూపాయల విలువ గలిగిన మహిళల శ్రమకు గుర్తింపు లేదన్నారు. వేతన బద్రత చట్టబద్ధమైన హక్కులు, కనీస వేతనం రూ.26,000లు తదితర డిమాండ్ల కోసం పోరాటలను ఉధృతం చేయాలని పిలుపు నిచ్చారు. పోరాటాలద్వార సాధించుకున్న హక్కులను సైతం పాలకవర్గాలు నాశనం చేస్తున్నాయని దుయ్యబట్టారు. సమరశీల శ్రామిక మహిళల పోరానికి మార్చి 8 ప్రతీక అన్నారు. మార్చి 6నుండి 8వరకు మండల, గ్రామ స్థాయి వరకు అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవం సందర్భంగా సభలు, సమావేశాలు, ర్యాలీలు, మానవ హారాలు వంటి కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా నిర్వహించాలని సిఐటియు జిల్లా కోశాధికారి జి.పద్మ పిలుపు నిచ్చారు.

ఈ సదస్సులో సిఐటియు జిల్లా అధ్యక్షులు కె.బ్రహ్మాచారి, జిల్లా కార్యదర్శి ఏజే.రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు వెంకటమ్మ, సహాయ కార్యదర్శి కె.సత్య, జిల్లా కమిటీ సభ్యులు సుల్తానా, అంబాల దుర్గమ్మ, భూక్య రమేష్, హేమలత, నాయకులు రాధా, జయసుధ, రోజా, భాను, నిరోషా తదితరులు పాల్గొన్నారు.

కుల సర్వే రెమ్యూనరేషన్ చెల్లించాలి

- టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు జోగ రాంబాబు

నవతెలంగాణ-ఆళ్ళపల్లి



కుల గణన సర్వే నిర్వహించిన ఎన్యూమరేటర్లు, సూపర్ వైజర్లకు నేటి వరకు అందని రెమ్యూనరేషన్ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా చెల్లించాలని స్థానిక టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు జోగ రాంబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ జిల్లాలకు నిధులు మంజూరు చేసినప్పటికీ, రెమ్యూనరేషన్ అందక పోవటంతో సర్వే నిర్వహించిన ఎన్యూమరేటర్లు, సూపర్ వైజర్లు మానసికంగా ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. తక్షణమే అధికారులు స్పందించి రెమ్యూనరేషన్ చెల్లింపులు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఇరవెండి ఎఫ్‌బీఓ సస్పెన్షన్

నవతెలంగాణ-బూర్గంపాడు

బూర్గంపాడు మండలం ఇరవెండి ఎఫ్‌బీఓ లక్ష్మతి పై సస్పెన్షన్ వేటు పడింది. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే కారణంతో ఉన్నతాధికారులు ఆయనను సస్పెండ్ చేశారు. ఇటీవల ఇరవెండి సెక్షన్లో జిల్లా అట వీశాఖ అధికారి కృష్ణ గౌడ్ పర్యటించారు. ఇరవెండిలో పోడు నరికిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఎఫ్‌బీఓ లక్ష్మతి విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్నట్లు గుర్తించి సస్పెన్షన్ వేటు వేశారు.

గిరిజనులకు న్యాయం చేయాలి

- బీటీపీఎస్ భూ నిర్వాసితులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

నవతెలంగాణ-మణుగూరు



బీటీపీఎస్ నిర్మాణంలో గిరిజనులకు అన్యాయం జరిగిందని, భూములు కోల్పోయిన ప్రతి కుటుంబానికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, రైల్వే నిర్మాణంలో భూములు కోల్పోతున్న రామానుజన్ బూందివస్తులకు న్యాయం చేయాలని మాజీ ఉమ్మడి ఖమ్మం జిల్లా జడ్పీటీసీ, శాసనసభ్యులు చందా లింగయ్య దొర డిమాండ్ చేశారు. మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో కలెక్టర్‌కి చందా లింగయ్య దొర నాయకత్వంలో వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...2014 సంవత్సరం నుండి ఇప్పటి వరకు తెలంగాణ రాష్ట్రంలో రెండు పర్యాయాలు బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడినప్పటికీ కూడా బీటీపీఎస్ భూ నిర్వాసితులైన ఆదివాసులకు న్యాయం జరగలేదన్నారు. ఆదివాసీల భూములలో ఇతరుల పేర్లు పహానిలో ఎక్కించి వీఆర్వో నుండి తహసీల్దార్ వరకు కుమ్మక్కై పెద్ద మొత్తంలో దాదాపు రూ.400 కోట్లు కాజేసి ఆదివాసీలకు అన్యాయం చేశారన్నారు. మణుగూరు మండలం, రామంజవరం రెవెన్యూ గ్రామం సర్వే నెంబరు 853లో సుమారు 1250 ఎకరాల ఆదివాసీ భూములను రికార్డులు మార్చి ఆదివాసులకు అన్యాయం చేశారన్నారు. ప్రభుత్వం వెంటనే దర్యాప్తు చేసి దోషులను శిక్షించి దిగమింగున సొమ్మును రాబట్టి ఆదివాసీలకు 1/70 చట్టం ప్రకారం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 21, 2025 రోజున హైదరాబాద్‌లో బీటీపీఎస్‌లో భూములు కోల్పోయిన ఆదివాసీలు ముఖ్యమంత్రికి ప్రజావాణిలో, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకి మెమోరాండం సమర్పించి న్యాయం చేయాలని కోరమన్నారు. సీనియర్ ఆదివాసీ నాయకులు పూనెం జయగోపాల్, చిడెం నాగేశ్వరరావు, మహిళా విభాగం రాష్ట్ర నాయకురాలు కుంజా వెంకటరమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి గొగ్గల ఆర్కే దొర, పినపాక, మణుగూరు మండల అధ్యక్షులు కొమరం శ్రీను, పాల్వంచ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టీడీపీ నేత వంశీ పుట్టినరోజు వేడుకలు

- పాల్గొన్న మున్సిపల్ మాజీ వైస్ చెర్మెన్ మడత

నవతెలంగాణ-ఇల్లందు



తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ కన్వీనర్ ముద్రగడ వంశీ పుట్టినరోజు వేడుకలు టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు చాందావత్ రమేష్ బాబు, పట్టణ అధ్యక్షులు దాసరి గోపాలకృష్ణ వారి మిత్ర బృందం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. 55 కేజీల కేకు, గజమాలతో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఇల్లందు మున్సిపల్ మాజీ వైస్ చెర్మెన్ మడత వెంకట్ గౌడ్ విచ్చేసి ముద్రగడ వంశీతో పాటు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మడత వెంకట్ గౌడ్ మాట్లాడుతూ ముద్రగడ అనే పేరును ఒక బ్రాండ్‌గా మార్చుకొని పది మందికి సహాయం చేయడంలో ముందు ఉంటాడని, అలాగే పార్టీలతో సంభందం లేకుండా అందరికీ తన సహాయ, సహకారాలు అందిస్తుంటాడని అన్నారు. తాను నమ్మిన సిద్ధంతం కోసం తెలుగుదేశం పార్టీ తెలంగాణలో కష్టకాలలో ఉన్నా తాను మాత్రం పార్టీలో అంకిత భావంతో పనిచేస్తూ పార్టీ ఒక పట్టు కొమ్మాల ముద్రగడ వంశీ మారారని అన్నారు. రానున్న కాలంలో పార్టీకి మంచి భవిష్యత్ వస్తుందని అన్నారు. ముద్రగడ వంశీ మాట్లాడుతూ ఈ రోజున పుట్టినరోజు వేడుకలు నిర్వహించిన చాందావత్ రమేష్ బాబు, దాసరి గోపాలకృష్ణ, వారి మిత్ర బృందంకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కన్సలర్ రమేష్, టీడీపీ నాయకులు శ్యామ్ తీవారి, చిలిమల బాబు, కంది రవి, కొబ్బరి శివ, మాటేలా రత్నాకర్, ముక్కు శ్రీవెద్, ప్రణయ్, వినీత్, చరణ్, స్వామి నాయక్, శివ, వేణు, నాగులు, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు జరిగే ర్యాలీ ప్రదర్శనను జయప్రదం చేయండి

నవతెలంగాణ-టేకులపల్లి

నేడు కొత్తగూడెం పోస్ట్ ఆఫీస్ సెంటర్ అంబేద్కర్ విగ్రహం నుండి రైల్వే స్టేషన్ వరకు జరిగే డప్పు ర్యాలీ ప్రదర్శన జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ నేత నల్లగట్ల వెంకన్న మంగళవారం పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల, జిల్లాలోని ఎమ్మార్పీఎస్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మంచినీటి సమస్య తలెత్తకుండా చూడాలి

- ఎమ్మెల్యే పాయం

నవతెలంగాణ-మణుగూరు



వేసవిలో మంచినీటి సమస్య తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు మంగళవారం అధికారులను ఆదేశించారు. మణుగూరు మున్సిపాలిటీ పరిధిలో చిన్నరాయి గూడెం పంప్ హౌస్‌ను ఆయన పరిశీలించారు. మణుగూరు ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో గౌరవ అధ్యక్షులు దామల్ల వెంకన్న, అధ్యక్షులు పిండిగ వెంకట్, సెక్రటరీ మారుతి శ్రీనివాస్, కోశాధికారి సాబీర్ పాషా కలిసి మణుగూరు ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న నీటి ఎద్దడి, తాగునీటి సమస్య విషయమై పాయంకు తెలియజేశారు. వెంటనే స్పందించి ఎమ్మెల్యే పాయం రానున్న వేసవికాలం దష్ట్యా ప్రజలకు ఏ విధమైన నీటి సమస్య లేకుండా చూస్తానన్నారు. అందులో భాగంగానే మణుగూరు మున్సిపాలిటీలోని చినరావి గూడెం పంప్ హౌస్‌ను ఆయన పరిశీలించి మండల ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని మున్సిపాలిటీ అధికారులను ఆదేశించారు.

పంపు హౌస్‌ని సందర్శించిన పాయం

మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని చినరావిగూడెం పంపు హౌస్ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సందర్శించారు. అనంతరం పంపు హౌస్‌లోని గోదావరి నీటిని వెలికి తీసే పెద్ద మోటర్లను పరిశీలించారు. ఎప్పటికప్పుడు మోటార్లను మెయింటెనెన్స్ చేయాలని అవసరమైతే స్పేర్ మోటార్లను అందుబాటులో ఉంచుకోవాలని రాబోయే ఎండాకాలన్ని దృష్టిలో ఉంచుకొని అధికారులకు తగు సూచనలు ఇచ్చారు. మున్సిపాలిటీ ఏరియాలలో ఎటువంటి నీటి కొరత రాకుండా ముందస్తుగా ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, మణుగూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పిరినకి నవీన్, టౌన్ అధ్యక్షులు శివ సైదులు, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తరుణ్ రెడ్డి, మణుగూరు శివాలయం గుడి చైర్మెన్ కూచిపూడి బాబు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే బంగారు భవిష్యత్తు

- గురువులను తల్లిదండ్రులను గౌరవించాలి

నవతెలంగాణ-కొత్తగూడెం



చదువు ఉంటే బంగారు భవిష్యత్తు ఉంటుందని క్రమ శిక్షణతో ఉన్నత శిఖరాలకు ఎదగాలని గురువులను, తల్లిదండ్రులను గౌరవించాలని రాంనగర్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సీత, ఉపాధ్యాయురాళ్ల పద్మజ, వెంకటరమణలు అన్నారు. మంగళవారం చుంచుపల్లి మండల పరిధిలో ఉన్న రాంనగర్ మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీలు, మహిళా టీచర్లను ఘనంగా సన్మానించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో టీచర్లు మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ముందుగా విద్యార్థినీ, విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను అలరించాయి. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

సీతారామ ప్రాజెక్టు సాగునీరు జిల్లా సాగుభూములకు అందించాలి

- పాములేరు ద్వారా రైతాంగానికి సాగు నీరు అందించాలి

నవతెలంగాణ-ములకలపల్లి



సీతారామ ప్రాజెక్ట్ సాగునీరును ఎండుతున్న పంట చేలకు అందించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సాగర్ కాలంలోకి గోదావరి నీళ్లను కలిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం రైతాంగానికి మేలు చేస్తున్నప్పటికీ జిల్లాలో ముఖ్యంగా ములకలపల్లి మండలలోని నీళ్ల లేక ఎండుతున్న వేసవి పంటలకు చెరువులకు అందించాలని పాములేరు వాగుపై ఆధారపడి సాగు చేసిన పంటలు వాగులో సరిపడా నీళ్ళు లేక వేసిన పంటలు ఎందుతున్నాయని ఇప్పటికే మండలంలో ఉన్న రెండు పంప్ హౌస్‌ల ద్వారా నీటిని ఎగువ ప్రాంతాలకు పంపిస్తుండగా వాటిలో కొద్ది నీటిని ఈ కష్ట సమయంలో మండల రైతుల అవసరాలకు ఉపయోగించాలని డిమాండ్ చేశారు. వేల కోట్ల రూపాయలతో 100 కిలోమీటర్ల పొడవున కాలువతో నిర్మాణమైన సీతారామ ప్రాజెక్ట్ కాలువ నీళ్ల జిల్లా రైతాంగానికి సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. సీతారామ ప్రాజెక్టు గోదావరి నీళ్లను పాములేరులో కలిపేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, వర్షా శ్రీరాములు, మంచాల సారయ్య, గోపగాని లక్ష్మీనరసయ్య, బైరు ప్రసాద్, నిమ్మల మధు, కీసరి వెంకట్రావు, సోయం కృష్ణ, కొండ్రు రాఘవయ్య, జగ్గు, హెమాని, పోడియం రాజు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ

9

ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం | మార్చి 05, 2025 | www.navatelangana.com

1075 కంటి ఆపరేషన్ల బ్రోచర్ ఆవిష్కరణ

- కలెక్టర్ జితేష్ వి పాటిల్

నవతెలంగాణ-మణుగూరు

భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మంగళవారం మణుగూరు ఏరియా హాస్పిటల్‌ను సందర్శించారు. ఏరియా హాస్పిటల్ నందు జరుగుతున్నటువంటి వైద్య సేవలను, అక్కడ ఏమేమి అవసరం, సమస్యలు ఉన్నాయో ఆ అవసరాలను అడిగి, ప్రతి వార్డుని స్వయంగా పరిశీలించి వివరాలు సేకరించారు.

మణుగూరు ఏరియా ఆసుపత్రి నేత్ర వైద్యాధికారి జి.సంజీవరావు పినపాక భద్రాచలం నియోజకవర్గం పరిధిలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో ఇటీవల మెగా కంటి వైద్య శిబిరం గిరిజన ప్రాంతమైన భద్రాచలంలో నిర్వహించడం జరిగినది. ఈ నేత్ర వైద్య శిబిరం సుమారు 102 రోజులపాటు నిర్విరామంగా జరిగినది. 26 విడతలుగా పేషంట్లని సికింద్రాబాద్ తరలించారు. 1075 కంటి ఆపరేషన్లు, ఇది ఒక రాష్ట్రస్థాయి రికార్డుగా ఆవిష్కరించబడుతున్నది. ఈ వైద్య శిబిరంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ బి.రాహుల్ భద్రాచలం ఎమ్మెల్యే వెంకట్రావు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ వీరయ్య పాల్గొన్న బ్రోచర్ మంగళవారం ఏరియా హాస్పిటల్ మణుగూరు నందు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ ఆవిష్కరణలో ఏరియా హాస్పిటల్ సూపర్నెంట్ డాక్టర్ సునీల్, ఆర్ఎంఓ డాక్టర్ గౌరీ ప్రసాద్, నేత్ర వైద్యాధికారి సంజీవరావు, ఏరియా హాస్పిటల్ వైద్యులు, నర్సింగ్ ఆఫీసర్స్, పారామెడికల్ సిబ్బంది పాల్గొనినారు.

రూ.24 లక్షలకు ఐపీ దాఖలు

నవతెలంగాణ-ఖమ్మం లీగల్

ఖమ్మం పట్టణానికి చెందిన కొండపల్లి లత రూ.24,10,000లకు దివాళా పిటిషన్ దాఖలు చేశారు. ఫిర్యాదిదారురాలు ప్రయివేటు హాస్టల్ నడిపించేవారు. ఈ వ్యాపారాన్ని అభివృద్ధి చేయడానికి అధిక వడ్డీలకు అప్పులు చేశారు. ఫైనాన్స్ సంస్థలు, ప్రయివేట్ వ్యక్తుల నుంచి అధిక మొత్తంలో అప్పులు చేశారు. వ్యాపారంలో తీవ్రంగా నష్టం రావడంతో, రుణదాతల నుంచి ఒత్తిడి తీవ్రం కావడంతో 12 మందిని ప్రతివాదులుగా చేరుస్తూ తన న్యాయవాది అయిన యర్ర జ్ఞానేష్ ద్వారా సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో దివాళా పిటిషన్ దాఖలు చేశారు. తనను దివాళాదారుగా ప్రకటించమని పిటిషన్‌లో కోర్టును అభ్యర్థించారు.

60.70 లక్షలకు

ఖమ్మం లీగల్ : ఖమ్మం పట్టణానికి చెందిన బోగా శ్రీనివాసరావు రూ.60,70,000 లకు దివాళా పిటిషన్ దాఖలు చేశాడు. ఫిర్యాదిదారుడు వివిధ రకాల వ్యాపారాలు చేసేవాడు. ఈ వ్యాపారాన్ని అభివృద్ధి చేయడానికి అధిక వడ్డీలకు అప్పులు చేశాడు. ఫైనాన్స్ సంస్థలు, ప్రయివేట్ వ్యక్తులు, అధిక మొత్తంలో అప్పులు చేశాడు. వ్యాపారంలో తీవ్రంగా నష్టం రావడంతో, రుణదాతల నుంచి ఒత్తిడి తీవ్రం కావడంతో 18 మందిని ప్రతివాదులుగా చేరుస్తూ తన న్యాయవాది అయిన యర్ర జ్ఞానేష్ ద్వారా సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో దివాళా పిటిషన్ దాఖలు చేశారు. తనను దివాళా దారుగా ప్రకటించమని పిటిషన్‌లో కోర్టును అభ్యర్థించారు.



పది ఉజ్వల భవిష్యత్తుకు సోపానం కావాలి

- డీడీ మణెమ్మ

నవతెలంగాణ-ఆళ్ళపల్లి

పదో తరగతి విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు సోపానం అయ్యేలా చేసుకోవాలని భద్రాచలం ట్రైబల్ వెల్ఫేర్ డీడీఓ మణెమ్మ పిల్లలకు ఉద్బోధించారు. ఈ మేరకు మంగళవారం ఆమె వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఆళ్ళపల్లిలోని అనంతోగు గ్రామం బాలిక ఆశ్రమ ఉన్నత పాఠశాలలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీడీఓ మాట్లాడుతూ.. పదవ తరగతి పూర్తి చేయగానే విద్యార్థులు తమకు ఉద్యోగ రీత్యా ఇష్టమైన రంగంలో ఆసక్తి చూపి, భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ఇష్టమైన ఉద్యోగాన్ని కష్టపడి ఉద్యోగాలు సాధించి, సత్తా చాటాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సీహెచ్.భద్రమ్మ, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వసతి గృహాలను తనిఖీ చేసిన న్యాయమూర్తి

నవతెలంగాణ-కొత్తగూడెం లీగల్

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి మంగళవారం చంద్రుగొండ మండలంలోని మూడు వసతి గృహాలను ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. కస్తూర్బా గాంధీ బాలికల వసతి గృహం, గిరిజన బాలికల వసతి గృహం, ఎస్సీ బాలుర వసతి గృహాలను ఆకస్మిక తనిఖీ చేసి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన సదుపాయాలు కల్పించాలని వార్డెన్స్ కు ఆదేశించారు. ఈ సందర్భంగా వసతి గృహంలోని తరగతి గదులు, కిచెన్ రూం, స్టోర్ రూమ్‌లను న్యాయమూర్తి పరిశీలించారు. ఎస్సీ బాలుర వసతి గృహంలో నిత్యవసర సరుకులు లేకపోవడం, పనిచేయని ఫ్యాన్, లైట్స్, ఆహారపు మెనూ, సమయపాలన పాటించని హాస్టల్ వార్డెన్ పట్ల న్యాయమూర్తి అసహనం వ్యక్తం చేశారు. న్యాయమూర్తితో పాటు డిప్యూటీ లీగల్ లో పాల్గొన్నారు.



కుంజా చిన్నక్క ఆశయ సాధనకు పోరాడుదాం

- పోడు భూములకు త్రీ ఫేస్ కరెంటు కల్పించాలి

నవతెలంగాణ-చర్ల

కుంజా చిన్నక్క ఆశయ సాధనకు పోరాటాలు సన్నద్ధం కావాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కారం నరేష్ అన్నారు. మంగళవారం గ్రామంలో చిన్నక్క ఐదవ వర్ధంతి జరిగింది. పతాకావిష్కరణ సీపీఐ(ఎం) గ్రామ సీనియర్ నాయకులు కుంజా భద్రయ్య ఆవిష్కరించారు. అనంతరం కారం నరేష్ మాట్లాడుతూ చర్ల మండలంలో ఆర్.కొత్తగూడెం గ్రామంలో పోడు భూముల పోరాటంలో ముందుండి నడిపించిన నాయకురాలని, ఎంపీటీసీగా, మండల వైస్ ఎంపీపీగా ఉన్నంతకాలం ప్రజలకు సేవ చేశారని గుర్తు చేశారు. ఆనాటి పోరాటాలను ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలని అన్నారు. పోడు భూములకు త్రీ ఫేస్ కరెంటు సౌకర్యం కల్పించాలని, ఎన్నో ఏళ్ల నుంచి పోరాటాలు నిర్వహించి సాధించుకున్న పోడు భూములకు పట్టాలు ఆధారాలు ఉన్న నీటి ఆధారంలాగా లేక రైతులు ఎంత ఇబ్బంది పడుతున్నారని పండిన పంట ఎండకు ఎండి ఇబ్బందులకు గురవుతున్నారని, పోడు భూములు కలిగిన గ్రామాలకు త్రీఫేస్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి మచ్చ రామారావు, కుంజా శ్వేత, అఖిల్, కారం వెంకటేశ్వర్లు, నూప కృష్ణ, సుధాకర్, వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.





పడవ ప్రయాణంలో జిల్లా బాస్

- ఇసుక అక్రమ రవాణా అరికట్టాలి
- చర్ల ఇసుక రీచ్‌లను ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్

నవతెలంగాణ-చర్ల

మణుగూరు మల్లెపల్లి రేవు నుండి గోదావరి నదిపై పడవ ప్రయాణం ద్వారా చర్ల మండలం పెద్దపల్లి వరకు కలెక్టర్ జితేష్ వి పాటిల్ ప్రయాణించారు. అనంతరం చర్లలో వీరాపురం, మొగళ్ళపల్లి, చింతకుంట ఇసుకరీచులను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రీచ్‌లలో రెవెన్యూ, మైనింగ్, టిఎస్ఎండిలు ఇసుక రవాణా ద్వారా వచ్చే రెవెన్యూ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఇసుక అక్రమ రవాణాను అరికట్టి, రెవెన్యూ పెంచాలని కలెక్టర్ సూచించారు. ఇసుక స్టాక్ నిల్వలను పరిశీలించారు. రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట చర్ల తహసీల్దార్ శ్రీనివాస్, మైనింగ్ శాఖ అధికారి దినేష్, ఎంపీడీవో ఈదయ, సొసైటీ సభ్యులు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్ష ఫ్యాడ్స్, పెన్నులు, స్కేల్స్ పంపిణీ

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్



ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 36వ డివిజన్ కార్పొరేటర్ పసుమర్తి రామ్మోహన్ రావు సహకారంతో గత ఐదేళ్లుగా విద్యార్థులకు అవసరమయ్యే ఫ్యాడ్స్, పెన్నులు, స్కేల్స్ విద్యార్థులకు అందజేస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం కూడా విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన కార్పొరేటర్ రామ్మోహన్ రావు మాట్లాడుతూ విద్యార్థుల చదువు కోసం కావలసిన ఎలాంటి సహకారం అయినా తప్పకుండా అందిస్తానని చెప్పారు. విద్యార్థులు వారి లక్ష్యాన్ని సాధించాలని తెలియజేశారు. నా సహకారాన్ని విద్యార్థులకు అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీకి ధన్యవాదాలు అని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి మరొక అతిథిగా విచ్చేసిన ఉమెన్స్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అరుణ్ కుమార్ మాట్లాడుతూ జీవితంలో ఇంటర్మీడియట్ స్థాయి ఒక మరుపురానిదాని విద్యార్థులు ఎల్లప్పుడూ ధైర్యంతో వారి చదువుల్లో ముందుకెళ్లడం కోసం చురుకుగా ఉండాలని తెలియజేశారు. మంచి మార్కులను సాధించి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రవీణ్ మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ అధ్యయనం పోరాటం నినాదంతో విద్యారంగ సమస్యలు పరిష్కరించడం కోసం పనిచేయడమే కాకుండా విద్యార్థులకు పరీక్షలపై ఉన్నటువంటి భయాన్ని పోగొట్టడం కోసం మోడల్ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. అలాగే రామ్మోహన్ రావు లాంటి దాతల సహకారంతో హాస్టల్లో చదువుకునే విద్యార్థులకు పరీక్షలకు అవసరమయ్యే సామగ్రిని కూడా అందిస్తున్నామని విద్యార్థులు వారి లక్ష సాధన కోసం మరింత కృషి చేసి చదువుకోవాలని, అలాగే విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ నిర్వహించే పోరాటాలలో భాగస్వాములు కావాలని తెలియజేశారు. హాస్టల్ వార్డెన్ స్వర్ణలత మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాలను సాధించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ కార్యదర్శి హెచ్చు కృష్ణ మోహన్, ప్రముఖ వ్యాపారవేత్త సత్యనారాయణ, ఎస్ఎఫ్ఐ నాయకులు వినోద్, మనోజ్, మహేష్, త్రినాథ్, సంగీత్, సింధు, పూజిత, శ్రీలత, శ్రీజ, స్వాతి, భవాని, పూజిత, నిత్య, మౌనిక, శరణ్య, కావ్య, సంజన, అంజలి, త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

ఆంగ్ల అధ్యాపకురాలికి డాక్టరేట్

నవతెలంగాణ-ఖమ్మం

ఎస్ఆర్‌బిజిఎన్ఆర్ కళాశాల ఇంగ్లీష్ విభాగంలో అధ్యాపకులుగా పని చేస్తున్న కె.విజయలక్ష్మికి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ పరీక్షల విభాగం కోఆర్డినేటర్, డాక్టరేట్ డిగ్రీ ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మొహ్మద్ జాకీరుల్లా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ఎక్స్ పేట్రియట్ ఎక్స్ పీరియన్స్ ఇన్ ఝుంపాలహరీస్ ఫిక్షన్ ఏ క్రిటికల్ స్టడీ' అనే అంశంపై పరిశోధనా సిద్ధాంత గ్రంథాన్ని డాక్టర్. కె.పంకజ్ కుమార్ వైవిఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కైకలూరు, పర్యవేక్షణలో పరిశోధనను పూర్తి చేశారు. ఈ సందర్భంగా అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

బౌద్ధ క్షేత్రాన్ని సందర్శించిన బౌద్ధ భిక్షువులు

నవతెలంగాణ-నేలకొండపల్లి



దేశవ్యాప్తంగా బౌద్ధులపై రాజ్యాంగానికి విరుద్ధంగా జరుగుతున్న చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని బౌద్ధ భికు సద్ధారక్షిత, బికు ప్రజ్ఞానంద అన్నారు. మంగళవారం నేలకొండపల్లికి సమీపంలోని దక్షిణ భారతదేశంలోనే అతిపెద్దదైన ప్రసిద్ధ బౌద్ధ క్షేత్రాన్ని వారు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీహార్ రాష్ట్రంలోని బోధ్ గయలో ఉన్న ప్రాచీన బౌద్ధ స్థూపం మహాబోధి మహా విహార ప్రపంచంలోని బౌద్ధులకు పవిత్ర పుణ్యక్షేత్రమన్నారు. 1949లో రూపొందించబడిన బీహార్ టెంపుల్ మేనేజ్మెంట్ యాక్ట్ బిటి 1949 యాక్టు ప్రకారం ఈ విహారాన్ని నిర్వహించేందుకు హిందూ, బౌద్ధ ప్రతినిధులతో కూడిన కమిటీ ఏర్పాటు చేయబడిందన్నారు. ఇటీవల బౌద్ధ సమాజం నుండి ఈ చట్టాన్ని రద్దు చేసి, మహాబోధి మహావిహార నిర్వహణను పూర్తిగా బౌద్ధ భిక్షువులతో కూడిన కమిటీకి అప్పగించాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయన్నారు. ప్రస్తుత కమిటీలో ఉన్న బ్రాహ్మణులను తొలగించి, బౌద్ధ క్షేత్రంలో జరుగుతున్న బ్రాహ్మణ పూజారుల క్రతువులను నిషేధించాలనే అభ్యర్థనలు కూడా వ్యక్తమవుతున్నాయన్నారు. ప్రభుత్వం ఈ అభ్యర్థనలను పరిగణలోకి తీసుకుని, బౌద్ధ క్షేత్రాల నిర్వహణలో మార్పులు చేయడం ద్వారా బౌద్ధ సంప్రదాయాల పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు బౌద్ధ బిక్షువులు, స్థానికులు పాల్గొన్నారు.

బోనకల్ పీహెచ్‌సిని 50 పడకల ఆస్పత్రిగా ప్రకటించాలి

నవతెలంగాణ-బోనకల్



బోనకల్ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 50 పడకల ఆస్పత్రిగా ప్రకటించాలని సీపీఐ మండల కార్యదర్శి ఆనందరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సిపిఐ మండల కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మధిర నియోజకవర్గం లోని ముదిగొండ, ఎర్రుపాలెం మండల కేంద్రాల్లో 50 పడకల ఆసుపత్రులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసిందని అన్నారు. కానీ బోనకల్ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని విస్మరించడం బాధాకరమన్నారు. బోనకల్ నుంచి ఖమ్మంకు 32 కిలోమీటర్ల పైగా ఉందని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకే వైద్యసేవనందిస్తుందన్నారు. పైగా మండల కేంద్రంలో కస్తూర్బా గాంధీ, సాంఘిక సంక్షేమ, మహాత్మ జ్యోతిరావు పూలే తదితర గురుకులాల వందలాది విద్యార్థిని, విద్యార్థులు, రైల్వే రిటైర్డ్ ఉద్యోగులు, శాంతి నిలయంలోని మానసిక వికలాంగులు, దివ్య దయాల్ వద్దులు తదితర వర్గాల వారు మండల కేంద్రంలోనే ఉంటున్నారని అన్నారు. రాత్రి సమయంలో అనారోగ్యానికి గురైన వారికి మండల కేంద్రంలో ప్రయివేటు ఆస్పత్రి వైద్య సేవలు అందించేవారు కూడా లేకపోవడం, టీజీఎంసీ దాడులతో గ్రామీణ వైద్యులు కనీస ప్రథమ చికిత్సలు అందించక పోవడంతో మండల ప్రజలు మరింత భయాందోళ గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతోపాటు గురుకులాల్లో విద్య అభ్యసించేటువంటి విద్యార్థిని, విద్యార్థులు రాత్రిళ్ళు చిన్నచిన్న అనారోగ్య సమస్యలకు వైద్యం చేయించేందుకు ఉపాధ్యాయులు, సిబ్బంది నానా తంటాలు పడుతూ మానసికంగా ఆందోళన చెందుతున్నారన్నారు. ఎన్నో ఏళ్లుగా వామపక్ష పార్టీల నాయకులు 50 పడకల ఆసుపత్రి కోసం పోరాటం చేస్తున్నారని గుర్తు చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క బోనకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 50 పడకల ఆసుపత్రిగా మార్చేందుకు వెంటనే నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శులు జక్కుల రామారావు, ఆకెన పవన్ తదితరులు పాల్గొన్నారు.

చివర భూములకు సాగర్ నీరు అందించండి

- నీటిపారుదల శాఖ అధికారులకు ఆదేశాలు
- ఎల్ఆర్ఎస్‌లను నెల చివరినాటికి పరిష్కారం చేయండి
- రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి
- 'నవతెలంగాణ' కథనానికి స్పందన

నవతెలంగాణ - బోనకల్



బోనకఎల్ బ్రాంచి కెనాల్ పరిధిలోని బోనకల్ పరిధిలోని చివర భూములకు సైతం సాగర్ నీటిని అందించే పంటలను కాపాడాలని బోనకల్ నీటిపారుదల శాఖ అధికారులను రెవిన్యూ అడిషనల్ కలెక్టర్ కె శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు. అదేవిధంగా ఎల్ఆర్ఎస్‌లను ఈ నెల చివరి నాటికి మొత్తం పరిష్కారం చేయాలని మండల తహసిల్దార్ అని శట్టి పున్నం చందర్ ను శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. 'వెలవెల బోతున్న బోనకల్ బ్రాంచ్ కెనాల్, సాగర్ నీటి కోసం ఎదురుచూస్తున్న అన్నదాతలు, కథనానికి రెవిన్యూ అడిషనల్ కలెక్టర్ కె శ్రీనివాస్‌రెడ్డి స్పందించారు. మండల తహసిల్దార్ కార్యాలయంలో నీటిపారుదుల, వ్యవసాయ, రెవెన్యూ, ఎంపీడీవోలతో మంగళవారం రెవిన్యూ అడిషనల్ కలెక్టర్ కె శ్రీనివాసరెడ్డి ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. అదే విధంగా ఎల్ఆర్ఎస్‌లపై కూడా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన బోనకల్, కలకోట క్లస్టర్ల ఏఈ పిల్లలమర్రి ఏడుకొండలను మండలంలో సాగర్ నీటి సమస్యపై ప్రశ్నించారు. దీంతో ఆయన కలకోట మేజర్, ఆళ్లపాడు మైనర్ పరిధిలోని నారాయణపురం, ఆళ్లపాడు గ్రామాలకు చెందిన రైతుల సాగు చేసిన పంటలకు సాగర్ నీటి సమస్య కొంత ఉందని తెలిపారు. అది కూడా చివర భూములకు మాత్రమే సమస్య ఉందన్నారు. వారబంది విధానం ద్వారా బోనకల్ బ్రాంచ్ కెనాల్‌కు సాగర్ నీటిని విడుదల చేస్తున్నారని తెలిపారు. మండల వ్యవసాయ శాఖ అధికారి పసునూరి వినయ్ కుమార్‌ని పంటల సాగు వివరాలపై ప్రశ్నించారు. మండలంలో ప్రధానంగా యాసంగిలో మొక్కజొన్న పంట అత్యధికంగా సాగు చేశారని తెలిపారు. కొన్ని గ్రామాలకు సాగర్ నీటి సమస్య ఉందని, రెండు మూడు రోజులలో సాగర్ నీరు రాకపోతే కొన్ని గ్రామాలలో మొక్కజొన్న పంట దెబ్బతినే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారి ఆయనకు వివరించారు. ఈనెల 10వ తేదీ నుంచి వారబందీ ప్రకారం సాగర్ నీరు వస్తుందని, దీనివలన రైతులకు నష్టం జరిగే అవకాశం ఉందని తెలిపారు. అనంతరం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ బోనకల్ మండల వ్యాప్తంగా చివర భూములకు సైతం సాగర్ నీటిని అందించే విధంగా మండల అధికారులందరూ ఒక టీముగా ఏర్పడి పనిచేయాలని సూచించారు. మండలంలో పంట ఎండిపోకుండా అధికారులందరూ పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా మండలంలో ఎల్ఆర్ఎస్‌లు ఎన్ని ఉన్నాయని మండల తహసిల్దార్ అనిశెట్టి పున్నం చందర్‌ను శ్రీనివాస్‌రెడ్డి ప్రశ్నించారు. దీంతో తహసిల్దార్ మొత్తం ఎనిమిది వందల ఎనిమిది ఉన్నాయని తెలిపారు. ఈ నెల చివరి నాటికి మొత్తం పరిష్కారం చేయాలని మండల రెవెన్యూ అధికారులను శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. ఫైళ్ల పెండింగ్‌లో ఉంచవద్దని న్యాయపరమైన సమస్యలు లేని వాటిని వెంటనే పరిష్కారం చేయాలని తహసిల్దార్‌ను ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో రురావత్ రమాదేవి, ఎంపీ ఓ వ్యాకరణం వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి, గిర్దావర్ - వన్ గుగులోతు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

చెక్కు కేసు కొట్టివేత

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

2017 సంవత్సరంలో సారపాకకు చెందిన చల్లపల్లి నాగేశ్వరరావు వరంగల్‌కు చెందిన కొత్త ఇందిరాపై రూ.20 లక్షల ఇవ్వాలని భద్రాచల జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు నందు చెక్ బౌన్స్ కేసు వేశారు. అట్టి కేసు నిరూపణ కాకపోవడంతో జ్యుడీషియల్ ఫ్రస్ట్ క్లాస్ కోర్టు న్యాయమూర్తి వి.శివ నాయక్ కేసు కొట్టి వేయడం జరిగింది. కొత్త ఇందిరా తరఫున ముత్యాల కిషోర్ దాసరి కవిత న్యాయవాదులు కేసు వాదించారు.

నేటి నుంచి ఇల్లందు కోర్టులో మెగా లోక్ అదాలత్

నవతెలంగాణ-టేకులపల్లి

ఈనెల 5 నుండి 8 వరకు ఇల్లందు కోర్టులో మెగా లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు టేకులపల్లి ఎస్సై పోగుల సురేష్ మంగళవారం తెలిపారు. తమపైన గానీ తమకు తెలిసిన వారిపైన గాని ఎలాంటి కేసులు ఉన్నా వారితో రాజీ చేసుకుని లోక్ అదాలత్ కు హాజరు కావచ్చని అన్నారు. లోక్ అదాలత్ ద్వారా కొట్టుకున్న, చీటింగ్, దొంగతనం, వివాహం తదితర కేసులను రాజీ ద్వారా పరిష్కారం చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.

పరీక్షా కేంద్రాల్లో పటిష్ట బందోబస్తు

- ఎస్‌హెచ్‌ఓ యయాతి రాజు

నవతెలంగాణ - అశ్వారావుపేట

నేటి నుండి ప్రారంభం అయ్యే ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు నిర్వహణకు విద్యాశాఖ, పోలీస్‌లు ఏర్పాట్లు పూర్తి చేశారు. మంగళవారం పరీక్షా కేంద్రాల్లో చీప్ సూపరింటెండెంట్‌లు అనిత, సంగీతలు నెంబరింగ్, సీటింగ్ ను సిద్ధం చేశారు. ఎస్‌హెచ్‌ఓ ఎస్ఐ యయాతి రాజు పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. కేంద్రానికో ఇద్దరు ఆడ మగ పోలీస్ సిబ్బందిని కేటాయించామని, జిరాక్స్ సెంటర్ లు పరీక్షలు సమయంలో మూసి ఉంచేలా చర్యలు చేపట్టామని అన్నారు. తహశీల్దార్ క్రిష్ణ ప్రసాద్ జనం గుమిగూడి ఉండకుండా 144 సెక్షన్ విధించడం జరిగిందని తెలిపారు. ఏఎన్ఎంలతో ప్రథమ చికిత్స శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు డాక్టర్ రాందాస్ తెలిపారు.

సీపీఐ(ఎం) సానుభూతిపరులు కూరపాటి గోవిందు మృతి
నివాళులర్పించిన పోతినేని

నవతెలంగాణ-ముదిగొండ



మండలపరిధిలోని బాణాపురం గ్రామానికి చెందిన సీపీఐ(ఎం) సానుభూతిపరులు కూరపాటి గోవిందు(68) (హొటల్ గోవిందు) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, రాష్ట్ర నాయకులు బండి రమేష్, బుగ్గవీటి సరళ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదినేని రమేష్, బండి పద్మ జిల్లా నాయకులు వాసిరెడ్డి వరప్రసాద్, మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు, మండల కార్యదర్శి బట్టు పురుషోత్తంతో పోతినేని కలిసి గోవిందు మృతదేహాన్ని సందర్శించి ఎర్రజెండా కప్పి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. గోవిందు మృతికి సంతాపాన్ని వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వారు తెలిపారు. గోవిందు తమ్ముడు కూరపాటి శ్రీనివాసరావు పార్టీ మండల మాజీ కార్యదర్శిగా పనిచేశారు. గోవిందుకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. నివాళ్లర్పించిన వారిలో సిపిఐ(ఎం) సీనియర్ నాయకులు పాలవాయి పాండురంగారావు, మండల కార్యదర్శి వర్గసభ్యుల పంద్రకొల రాంబాబు, టీఎస్ కళ్యాణ్, నాయకులు చింతకాయల రామారావు, కందిమల్ల తిరుపతి, మరికంటి వెంకన్న, యంద్రపల్లి రవికుమార్, మందరపు వెంకన్న, గ్రామ నాయకులు మేడి రవి, వత్సవాయి సైదులు, మరికంటి నరసింహారావు, జంగం వెంకటరాములు, తేజావత్ వెంకటేశ్వర్లు, వడ్డెబోయిన అంజయ్య, మొక్క సత్యనారాయణ, పెద్దమండవ పార్టీ గ్రామ శాఖ కార్యదర్శి మాదారపు శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వట్టికూటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ముష్టికుంట సొసైటీ ఉద్యోగి మృతి

నవతెలంగాణ - బోనకల్



వైద్యం కోసం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లాడు. వైద్య పరీక్షల అనంతరం వైద్యులు మెరుగైన వైద్యం కోసం హైదరాబాదు వెళ్లాలని సూచించారు. దీంతో ఒక్కసారిగా అతనిలో భయం ఏర్పడి గుండెపోటు వచ్చి ఆసుపత్రిలోనే ముష్టికుంట్ల సొసైటీ ఉద్యోగి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని ముష్టికుంట గ్రామంలో సోమవారం సాయంత్రం జరిగింది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని ముష్టికుంట్ల సహకారం సంఘంలో పుట్ట వెంకటేశ్వర్లు (33) 15 ఏళ్లుగా స్టాఫ్ అసిస్టెంట్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. అయితే రెండు రోజుల క్రితం కామెర్ల వ్యాధి వైద్యం కోసం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి కుటుంబ సభ్యులు తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షల అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు దీంతో ఒక్కసారిగా వెంకటేశ్వర్లు భయపడ్డాడు. ఆ భయంలోనే వెంకటేశ్వర్లకు గుండెపోటు వచ్చింది. ఆస్పత్రిలోనే వెంకటేశ్వర్లు మృతి చెందాడు. 15 ఏళ్లుగా ముష్టికుంట్ల సహకార సంఘానికి విశిష్టమైన సేవలు అందించిన వెంకటేశ్వర్లు గుండెపోటుతో మృతి చెందటం పట్ల తమను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని ముష్టికుంట్ల సొసైటీ అధ్యక్షుడు బోయినపల్లి వెంకటేశ్వర్లు, సీఈవో బోయినపల్లి ఉమామహేశ్వరరావు తెలిపారు. ముష్టికుంట్లలో వెంకటేశ్వర్లు మృతదేహాన్ని జిల్లా కోపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ కిషోర్ కుమార్, ఏఐ బిఈఏ, ఏపీ టీబీఈఎఫ్ రాష్ట్ర నాయకులు విప్ప శ్రీనివాసరావు, సిపిఎం మండల కార్యదర్శి కిలారు సురేష్, సొసైటీ అధ్యక్షులు బోయినపల్లి వెంకటేశ్వర్లు, సీఈవో బోయినపల్లి ఉమామహేశ్వరరావు, మండలంలోని వివిధ సహకార సంఘాల సీఈవోలు మండేపూడి వెంకటేశ్వరరావు, కొండా రాంబాబు, నిమ్మగడ్డ పుల్లారావు, మాధవరపు వెంకటేశ్వర్లు, దారెల్లి అశోక్, నాగలవంచ సహకార సంఘం సీఈవో యాలముడి శ్రీనివాసరావు, ముష్టికుంట సొసైటీ ఉపాధ్యక్షుడు దొడ్డ నాగేశ్వరరావు, పాలకవర్గం సభ్యులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. సిపిఎం మండల కమిటీ సభ్యులు బంధం శ్రీనివాసరావు, కందికొండ శ్రీనివాసరావు, దొప్ప కొరివి వీరభద్రం, మండల పరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యులు షేక్ హుస్సేన్, కాంగ్రెస్ ముష్టికుంట్ల అధ్యక్షుడు పిల్లల మర్రి నాగేశ్వరరావు, సిపిఎం నాయకులు దారగాని కొండలు, దుబా శ్రీను, కొమ్మినేని సీతారాములు, దూబా భద్రాచలం, బోనకల్ సొసైటీ స్టాఫ్ అసిస్టెంట్ అంబటి సంపత్ కుమార్ తదితరులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కృష్ణాజలాలపై తెగని జగడం

- తెలంగాణకు ఆశనిపాతం
- ఏపీకి ఫలహారం
- ఇదీ పాలకుల వైఫల్యం



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

దేశంలోని నదుల్లో నాలుగో పెద్దనది కృష్ణ. మహారాష్ట్ర, కర్నాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ గుండా ప్రవహిస్తున్న ఈ నది పొడవులో గంగ, బ్రహ్మపుత్ర, గోదావరి నదులు తరువాతి స్థానంలో ఉంటుంది. దాదాపు 1300 కిలోమీటర్లు ప్రవహించే ఈ నది, మహారాష్ట్ర నుంచి కర్నాటక, అక్కడి నుంచి తెలంగాణ, ఆ తరువాత ఏపీలోకి ప్రవహిస్తుంది. సుమారు 90 కిలోమీటర్ల దూరం తెలంగాణలో ప్రవహించి, రెండు తెలుగు రాష్ట్రాల సరిహద్దుగా ఉంది. ఆలంపూర్ నుంచి మక్తల్ వరకు ఈ నది రెండు రాష్ట్రాలకు సరిహద్దు. ఆ తరువాత పూర్తిగా ఆంధ్రప్రదేశ్‌లో ప్రవహించి సముద్రంలో కలుస్తుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ఉన్నప్పుడు మహారాష్ట్ర, కర్నాటక, ఆంధ్రప్రదేశ్ మధ్య నీటి పంపకాల వివాదాలు ఉండేవి. ఒకే రాష్ట్రంలో ఉన్నప్పటికీ, తెలంగాణ, ఏపీ మధ్య కూడా కృష్ణా నీటి విషయంలో పంచాయితీ ఉంది. కృష్ణానదిపై శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల ప్రాజెక్టులు తెలంగాణ, ఆంధ్రాలకు ఉమ్మడిగా ఉన్నాయి. ఈ ప్రాజెక్టులకు కుడివైపున ఏపీ ఉండగా, ఎడమవైపున తెలంగాణ ఉంది. వీటికి ఎగువన ఉన్న జూరాల ప్రాజెక్టు తెలంగాణ భూభాగంలో ఉండగా, దిగువన ఉన్న ప్రకాశం బ్యారేజీ ఏపీలో ఉంది. ఇవేకాక అనేక లిఫ్టులు ఉన్నాయి. రెండు రాష్ట్రాల అవసరాలను ఈ ప్రాజెక్టులు తీరుస్తున్నాయి.

తాజాగా కృష్ణాజలాల నీటివాటాల వివాదం మళ్లీ వేడెక్కింది. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య ఏండ్ల తరబడి ఉన్న వివాదం.. తెలంగాణలో అధికార, ప్రతిపక్షాల మధ్య ప్రచ్ఛన్నయుద్ధానికి కారణమవుతున్నది. బీఆర్ఎస్ పాలకుల విధాన వైఫల్యం మూలంగానే కృష్ణాజలాలు ఏపీకి అధికంగా తరలి వెళ్లాయనీ కాంగ్రెస్, కాదు కాదు గురువు కోసం శిష్యుడు త్యాగం చేస్తున్నాడంటూ బీఆర్ఎస్ చంద్రబాబు, రేవంత్‌కు మధ్య లింక్ పెట్టే ప్రయత్నం చేస్తున్నది. గతంలో ఏపీ నీటి దోపిడీకి బీఆర్ఎస్ సహకరించిందని కాంగ్రెస్ విమర్శలు గుప్పిస్తుంటే, అలా కాదు ఇప్పుడు ఏపీ జలచౌర్యం చేస్తుంటే, తెలంగాణ నిద్రపోతున్నదని బీఆర్ఎస్ ఆరోపిస్తున్నది. ఇలా పాలకులు, ప్రతిపక్షాల ఆరోపణలు, విమర్శల పర్వం కొనసాగుతోంది.

రాష్ట్రాల మధ్య నీటి పంపకం కోసం కేంద్ర ప్రభుత్వం 1969 ఏప్రిల్‌లో ఒక ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేసింది. నదినీళ్ల రాష్ట్రాల మధ్య పంచడమే ఈ ట్రిబ్యునల్ పని. దీనికి ఆర్ఎస్ బచావత్ అధ్యక్షులుగా, డీఎం భండారి, డీఎం సేన్ సభ్యులుగా ఉన్నారు. కృష్ణా నీటి వివాద ట్రిబ్యునల్ పేరుతో పనిచేసిన ఈ బృందం 1976 మేలో తమ తీర్పును అందించింది. వాస్తవానికి 1973లోనే ఈ తీర్పు వచ్చినా, కేంద్రం మాత్రం 1976లో ప్రకటించింది. ఇప్పటికీ నది నీటిలో 75 శాతం నీటిని లెక్కేసి పంపిణీ చేశారు. కృష్ణానదిలో మొత్తం 2060 టీఎంసీల నీరు నికరంగా ఉంటుందని లెక్కించి, అప్పటి మూడు రాష్ట్రాలకు ఆ నీటిని పంచారు. అందులో 560 టీఎంసీలు మహారాష్ట్రకు, 700 టీఎంసీలు కర్నాటకకు, 800 టీఎంసీలు ఉమ్మడి ఏపీకి కేటాయించారు. ఈ నీళ్లను నదిలో ఎక్కడి నుంచైనా, ఏ ప్రాజెక్టు ద్వారానైనా వాడుకోవచ్చని చెప్పారు. ఇక నదిలో మిగులు జలాలు 330 టీఎంసీలుగా అంచనా వేశారు. మిగులులో మహారాష్ట్రకు 25 శాతం, కర్నాటకకు 50 శాతం, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 25 శాతం ఇస్తారు. ఇప్పుడు కృష్ణా ట్రిబ్యునల్ బ్రిజేష్‌కుమార్ ఆధ్వర్యంలో నడుస్తున్నది.

ఇదిలా వుండగా గత పదేండ్లుగా తెలంగాణ, ఏపీ నీటి వినియోగాన్ని పరిశీలిస్తే మాత్రం తెలంగాణకు అన్యాయం జరిగినట్టుగానే కనిపిస్తున్నది. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) లెక్కల ప్రకారం.. 2014-15 నుంచి 2024-25 వరకు ప్రతియేటా ఏపీ ఒప్పందం కంటే ఎక్కువగా నీటిని తరలించినట్టు స్పష్టమవుతున్నది. ఇటీవల బీఆర్ఎస్ అనుసరించిన విధానంపై తెలంగాణ సీఎం రేవంత్, నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తరచుగా విమర్శలకు దిగుతున్నారు. ఇటీవల ప్రధాని, కేంద్ర మంత్రులకు సైతం ఫిర్యాదు చేశారు. కృష్ణా నది తెలంగాణలో 70 శాతం పరివాహక ప్రాంతముందనీ, ఆ మేరకు 70 శాతం జలాలు తెలంగాణకు దక్కాలనే డిమాండ్‌ను ముందుకు తెచ్చారు. కాగా 2014లో ఏపీ విభజన తర్వాత రెండు రాష్ట్రాల మధ్య జల వివాదాల సమస్య మళ్లీ ముందుకొచ్చింది. బేసిన్ల లెక్కల ప్రకారం చూస్తే తెలంగాణ రాష్ట్రంలో కృష్ణా బేసిన్ 68 శాతం ఉండగా, నీటి వాటా 37 శాతం, ఏపీలో 32 శాతం ఉంటే, నీటి వాటా 64 శాతం వచ్చింది.

ఉమ్మడి రాష్ట్రానికి ముందు నుంచి ఉన్న 811 టీఎంసీల నీటిని రెండు రాష్ట్రాలు పంచుకున్నాయి. ఏపీకి 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీలు అనుకున్నారు. 2015లో ఇది తాత్కాలిక సర్దుబాటు ఒప్పందం మాత్రమే. దాన్నే ఏపీ హక్కుగా వాడుకుంటున్నది. కృష్ణా బేసిన్ వెలుపలి అవసరాలకు నీటిని తరలిస్తున్నారు. ఇకపై ఆ నిష్పత్తిని అంగీకరించేది లేదని ఏడాది క్రితం అధికారంలోకి వచ్చిన రేవంత్ సర్కారు ఘంటాపథంగా చెబుతున్నది. 50:50 వాటా కోసం కేంద్రానికి ఫిర్యాదు చేస్తే, కేఆర్ఎంబీలోనే తేల్చుకోవాలని చెప్పింది. అనుమతులు లేకుండా ఏపీ చేపడుతున్న గోదావరి-బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టు ఇతర ప్రాజెక్టుతోపాటు ఇతర ప్రాజెక్టులపై రాష్ట్రం కేంద్రానికి చెప్పింది. కాగా పోతిరెడ్డిపాడు, రాయలసీమ, ముచ్చుమర్రి ప్రాజెక్టులకు నీటిసామర్థ్యం పెంచుకున్నా కేసీఆర్ సహకరించారనేది కాంగ్రెస్ ప్రభుత్వం విమర్శిస్తున్నది. ఉమ్మడి రాష్ట్రంలో శ్రీశైలం జలాశయం నుంచి 727 టీఎంసీలు తీసుకుంటే, తెలంగాణ వచ్చిన తర్వాత బీఆర్ఎస్ పదేండ్ల కాలంలో 120 టీఎంసీలు మాత్రమే తీసుకోగలిగింది. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్లుగా నీటిపారుదలపై రూ.1.81 లక్షల కోట్లు ఖర్చు చేసి 199 టీఎంసీలు మాత్రమే వాడింది. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చే నాటికి అప్పటికే కొనసాగుతున్న ప్రాజెక్టులకు పూర్తిచేసి ఉంటే ఎస్ఎల్‌బీసీ 40 టీఎంసీలు, కల్వకుర్తి 40 టీఎంసీలు, నెట్టెంపాడు 25 టీఎంసీలు, పాలమూరు -రంగారెడ్డి 95 టీఎంసీలు, డిండి 30 టీఎంసీలు నీళ్ల వచ్చేవని కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతున్నది. నీటి కేటాయింపుల్లో జీవో నెంబరు 203 ద్వారా ప్రతిరోజూ మూడు టీఎంసీలు నీటిని తరలించేలా ఏపీ మాజీ సీఎం జగన్‌కు బీఆర్ఎస్ సహకరించిందని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వ్యాఖ్యానించారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం కోసం అపెక్స్ కౌన్సిల్ సమావేశాన్ని వాయిదా కేసీఆర్ వాయిదా వేయించారనేది మరో ఆరోపణ. నీటి వాటాలను ఎప్పటికప్పుడు ఏపీ పెంచుకుంటూ పోయింది. కేఆర్ఎంబీ లెక్కలే ఇందుకు సాక్ష్యం. కాగా 2015 నుంచి 50:50 నిష్పత్తిలో నీటి వాటా పంచాలని ప్రభుత్వం అడుగుతున్నది. 2024-25 ఏడాది పరివాహక ప్రాంతం ఆధారంగా కాంగ్రెస్ సర్కారు 71:30 వాటాను తెలంగాణకు ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేస్తున్నది.

జీఆర్ఎంబీ వాయిదా

గోదావరి నదీ యాజమాన్య బోర్డు(జీఆర్ఎంబీ) సమావేశం వాయిదా పడింది. బుధవారం జరగాల్సిన 17వ జీఆర్ఎంబీ భేటిని వాయిదా వేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కోరింది. దీంతో సమావేశాన్ని వాయిదా వేస్తూ ఎప్పుడు నిర్వహించేది త్వరలో తెలియజేస్తామని జీఆర్ఎంబీ సభ్యకార్యదర్శి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఏడాది	నీటి వాడకం(టీఎంసీల్లో)		ఒప్పంద శాతం		వినియోగ శాతం	
	ఏపీ	టీఎస్	ఏపీ	టీఎస్	ఏపీ	టీఎస్
2014-15	529.33	227.74	63.13	36.87	69.92	30.08
2015-16	124.96	69.69	63.13	36.87	64.20	35.80
2016-17	282.51	153.39	63.13	36.87	64.81	35.19
2017-18	359.90	183.90	66.00	34.00	66.18	33.82
2018-19	426.61	207.28	66.00	34.00	67.30	32.70
2019-20	653.06	278.33	66.00	34.00	70.12	29.88
2020-21	629.07	248.23	66.00	34.00	71.71	28.29
2021-22	621.84	265.05	66.00	34.00	70.11	29.89
2022-23	681.11	277.61	66.00	34.00	71.04	28.96
2023-24	211.79	121.13			63.62	36.38
2024-25	662.58	236.13	66.00	34.00	73.7	26.27

సహకరించిన అందరికీ కృతజ్ఞతలు

- ఓటేసిన ఉపాధ్యాయ, అధ్యాపకులకు ధన్యవాదాలు : ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి తాను పోటీలో ఉండి గత నాలుగు నెలలుగా ప్రచారం చేస్తున్న సందర్భంలో తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. తనను ఆదరించి ఓటేసి రెండోస్థానంలో నిలబెట్టిన ఉపాధ్యాయులు, అధ్యాపకులకు ధన్యవాదాలు ప్రకటించారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తన ప్రచార అంశాలను ప్రింటు, ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రచురించి, ప్రసారం చేసిన మీడియా మిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటి క్యాంపెయిన్‌లో పాల్గొన్న ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. టీఎస్‌యూటీఎఫ్, టీపీటీఎఫ్‌తో పాటు ఇతర ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల నాయకులు, కార్యకర్తలు నాలుగు నెలలుగా అన్ని రకాల క్యాంపెయిన్‌లలో పాల్గొన్నారనీ, వారికి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థిని ఆత్మహత్యాయత్నం ఆందోళనకరం

- బీసీ కమిషన్ చైర్మెన్ నిరంజన్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వికారాబాద్ జిల్లాలో విద్యార్థిని ఆత్మహత్యాయత్నం ఆందోళనకరమని బీసీ కమిషన్ చైర్మెన్ నిరంజన్ తెలిపారు. ఆ జిల్లాలోని కొత్తగడి సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో ఉపాధ్యాయుల వేధింపులతో సబిత అనే పదో తరగతి విద్యార్థిని ఆత్మహత్యాయత్నం చేసుకున్న విషయం విదితమే. ఆ ఘటనను సీరియస్‌గా తీసుకున్న బీసీ కమిషన్, వికారాబాద్ జిల్లా కలెక్టర్‌కు, తెలంగాణ సోషల్ వెల్ఫేర్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్స్ సొసైటీ కార్యదర్శి అలుగు వర్షినికి మంగళవారం ఒక లేఖ రాశారు. ఈ సంఘటనపై విచారణ జరిపి పది రోజుల్లోపు కమిషన్‌కు నివేదిక సమర్పించాలని ఆదేశించారు. రాష్ట్రంలో తరచుగా ఇలాంటి సంఘటనలు జరగడం ఆందోళనకరమని తెలిపారు. సరైన కారణాలు తెలుసుకుని దిద్దుబాటు చర్యలు తెలుసుకొనే విధంగా ప్రయత్నాలు చేపట్టాలని సూచించారు.

విద్యుద్ఘాతంతో యువకుడు మృతి

- చేపల వేటకు వెళ్లిన సమయంలో ప్రమాదం
- మహబూబాబాద్ జిల్లా పురుషోత్తమాయగూడెంలో ఘటన

నవతెలంగాణ -మరిపెడ



వాగులో చేపలు పట్టేందుకు వెళ్లిన యువకుడు విద్యుద్ఘాతానికి గురై మృతి చెందిన సంఘటన మహబూబా బాద్ జిల్లా మరిపెడ మండలంలోని పురుషోత్తమాయ గూడెం వద్దనున్న ఆకేరు వాగులో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ సతీష్ వివరాల ప్రకారం.. పురుషోత్తమాయ గూడెం గ్రామానికి చెందిన జర్పుల కోట, అరుణ దంపతులకు సందీప్, శశి(20) ఇద్దరు కుమారులు న్నారు. దంపతులు వ్యవసాయ కూలీలుగా జీవనం సాగిస్తున్నారు. కాగా చిన్న కుమారుడు శశి ఇంటర్ పూర్తి చేసి ఇంటివద్దే ఉంటున్నాడు. బంధువులతో కలిసి గూడెం సమీపంలోని ఆకేరు వాగులో చేపలు పట్టేందుకు వెళ్లారు. కరెంటు తీగతో చేపలు పట్టేందుకు చేసిన ప్రయతం విఫలమై విద్యుద్ఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సతీష్ తెలిపారు.



మామునూర్ ఎయిర్‌పోర్ట్ భూ సర్వే

- ఆర్‌డీఓ, తహసీల్దార్లను అడ్డుకున్న రైతులు

నవతెలంగాణ-వరంగల్

మామునూర్ ఎయిర్‌పోర్ట్ భూ సర్వేకి వచ్చిన ఆర్‌డీఓ సత్యపాల్ రెడ్డి, ఎమ్మార్వో నాగేశ్వరరావు, రెవెన్యూ అధికారులను రైతులు అడ్డుకున్నారు. సరైన పరిహారం, ప్రత్యామ్నాయ రోడ్డు మార్గాలు చూపెట్టిన తర్వాతే సర్వే నిర్వహించాలని, అప్పటివరకు ఇటువైపు రావద్దంటూ 200 మంది రైతులు ఆందోళన చేపట్టారు. అదేవిధంగా ఎయిర్‌పోర్ట్‌కు భూమి కోల్పోతున్న గుంటూరు పల్లి, గాడిపెల్లి రైతులు ప్రత్యామ్నాయ రోడ్డు కావాలని కోరారు. మార్కెట్ ధరకి తగినట్టుగా పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీగా పోలీసులు మోహరించారు. ధర్నాకు అనుమతి లేదని రైతులతో పోలీసులు వాదించారు.

నిజాంపేటలో ఆక్రమణల తొలగింపు

ఏడెనిమిది కాలనీల్లో తప్పిన ట్రాఫిక్ ఇబ్బందులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నిజాంపేట మున్సిపాలిటీలో వార్డ్ నంబర్ 12లోని బాలాజీహిల్స్, ఇందిరమ్మ కాలనీ రహదారుల ఆక్రమణలను మంగళవారం హైడ్రా తొలగించింది. రహదారులను ఆక్రమించి నిర్మించిన అపార్ట్‌మెంట్ ర్యాంపులు, రోడ్డు మీదకు జరిపి మొక్కల కోసం ఏర్పాటు చేసిన ఫెన్సింగ్‌లను, పై అంతస్తులకు చేరేందుకు ఏర్పాటు చేసిన ఐరన్ ఫ్రేమ్ మెట్లను హైడ్రా తొలగించింది. ఇందిరమ్మ కాలనీలో రహదారులను ఆక్రమించి దుకాణాల ఏర్పాటు, అదనంగా గదులు నిర్మించడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయని హైడ్రాకు ఫిర్యాదులందాయి. ముఖ్యంగా వెంకటరాయ నగర్, బాలాజీ కాలనీ, కేఎస్ఆర్ కాలనీ, కొలను తులసి రెడ్డి (కేటీఆర్) కాలనీలకు వెళ్లే దారిలో నిత్యం ట్రాఫిక్ సమస్య ఎదురవుతోందని హైడ్రాకు స్థానికులు ఫిర్యాదు చేశారు. ఓల్డ్ ఏజ్ హోం నుంచి మియాపూర్ మెట్రో స్టేషన్‌కు నిజాంపేట రహదారుల మీదుగా వెళ్లే వాహనాలతో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఫిర్యాదు రావడంతో కిలో మీటరుకు పైగా ఆక్రమణలు తొలగించారు. ఆక్రమణలను తొలగించాలని సదరు నిర్మాణదారులకు రెండు నెలల గడువు ఇచ్చినా ఫలితం లేకపోవడంతో నిజాంపేట మున్సిపల్ అధికారుల సమక్షంలో హైడ్రా చర్యలు తీసుకుంది. బాలాజీ హిల్స్ కాలనీలోని పలు రహదారులతో పాటు ఇందిరమ్మ కాలనీ దారుల్లోనూ కబ్జాలు తొలగించారు. కూల్చివేతలకు స్థానికులు, కాలనీ వాసులు సహకరించారు. అక్రమ నిర్మాణాలతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయంటూ ఇందిరమ్మ కాలనీ వాసులకు హైడ్రా అధికారులు నచ్చజెప్పారు. మెట్రో రైలుతో పాటు, ప్రధాన రహదారికి సులభంగా చేరుకునే అవకాశం లభించందంటూ బాలాజీ హిల్స్ కాలనీ వాసులు ఆనందం వ్యక్తం చేశారు. దీనిపై బాలాజీ హిల్స్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు చిరంజీవి మాట్లాడుతూ.. "రహదారుల ఆక్రమణలపై రెండున్నరేండ్లుగా పోరాడుతున్నాం. కోర్టును కూడా ఆశ్రయించాం. ఆక్రమణలను తొలగించాలని కోర్టు తీర్పు కూడా ఉంది. మున్సిపాలిటీ అధికారులకు ఫిర్యాదు చేశాం. అయినా ప్రయోజనం లేకపోవడంతో హైడ్రాను ఆశ్రయించాం. వెంటనే విచారణ చేపట్టి.. ఆక్రమణదారులకు రెండు నెలల కిందట నోటీసులు ఇచ్చింది. ఎవరూ స్పందించక పోవడంతో కూల్చివేతలు చేపట్టారు" అని తెలిపారు.

రెండు దఫాలా? ఒకేసారా?


అసెంబ్లీ సమావేశాలపై తర్జనభర్జన

- రేపు రాష్ట్ర మంత్రివర్గ సమావేశం
- కులగణన, ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత, బడ్జెట్‌పై చర్చించనున్న క్యాబినెట్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీసీ కుల గణనతోపాటు ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించటం, రాబోయే ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌ను ప్రతిపాదించటం... రాష్ట్ర ప్రభుత్వానికి రాబోయే రెండు మూడు వారాల్లో ఇవి కీలకాంశాలు. ఇందుకోసం అసెంబ్లీ సమావేశాలను నిర్వహించాలి. ఈ మేరకు ఇటీవలే శాసనసభ, మండలిని ప్రొరోగ్ చేస్తూ గవర్నర్ గెజిట్ నోటిఫికేషన్‌ను జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఈనెల మొదటి వారంలోనే అసెంబ్లీని సమావేశపరుస్తారని అందరూ భావించారు. కానీ ఆ దిశగా ప్రభుత్వంలో ఇప్పటిదాకా కదలికల్లేకపోవటం గమనార్హం. ముఖ్యమంత్రి రేవంత్ ఉన్నత స్థాయి సమీక్షలు, ఢిల్లీ పర్యటనలతో బిజీగా ఉండగా, మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, జూపల్లి తదితరులు ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదానికి సంబంధించిన సహాయక చర్యలపై పూర్తి స్థాయిలో దృష్టి సారించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క... బడ్జెట్‌కు ముందు వివిధ శాఖలతో నిర్వహించే ప్రతిపాదిత సమావేశాలతో బిజీగా ఉన్నారు.

వాస్తవానికి కులగణన, ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించేందుకు వీలుగా ఈనెల మొదటి వారంలోనే అసెంబ్లీని నిర్వహిస్తామంటూ ప్రభుత్వం గత నెలాఖరులో ప్రకటించింది. అందుకనుగుణంగా క్యాబినెట్ భేటీ ఉంటుందని తెలిపింది. ఆ మేరకు గురువారం ముఖ్యమంత్రి రేవంత్ అధ్యక్షతన మంత్రివర్గ సమావేశాన్ని నిర్వహించనున్నారు. కులగణన, ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత, దానికి న్యాయపరంగా ఎలాంటి చిక్కుల్లేకుండా చూసుకోవటం తదితరాంశాలపై క్యాబినెట్‌లో కూలకుశంగా చర్చిస్తారని సమాచారం. ఆ తర్వాత ఈ రెండింటి చట్టబద్ధత కోసం త్వరలోనే (ఈనెల పదిలోపు) అసెంబ్లీని సమావేశపరుస్తారని ఒక అధికారి తెలిపారు. ఈ రెండింటికీ అసెంబ్లీలో చట్టబద్ధత కల్పించిన తర్వాత సభను ఒక వారంపాటు వాయిదా వేస్తారని సమాచారం. అనంతరం సీఎం ఢిల్లీకి వెళ్లి ప్రధానిని కలుస్తారనే చర్చలు కూడా కొనసాగుతున్నాయి. కులగణన, ఎస్సీ వర్గీకరణపై తాము తీర్మానం చేసిన



దరిమిలా...కేంద్రం కూడా పార్లమెంటులో ఆ మేరకు తీర్మానించాలంటూ ఆయన ప్రధానిని కోరనున్నారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఈనెల 10 నుంచి పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు తిరిగి ప్రారంభం కానున్న నేపథ్యంలో దానికి కొద్ది రోజులు అటుఇటుగా (15 నుంచి 20లోపు) మళ్లీ అసెంబ్లీని సమావేశపరిచి...బడ్జెట్‌ను ప్రతిపాదించేందుకు సీఎం సమాలోచనలు చేస్తున్నారని వినికిడి. అయితే వీటన్నింటికి సంబంధించి అటు అసెంబ్లీ వర్గాల నుంచి గాని, ఇటు ముఖ్యమంత్రి కార్యాలయం వైపు నుంచి గానీ ఎలాంటి స్పష్టత రాలేదు. గురువారం నాటి క్యాబినెట్ తర్వాత దీనిపై మరింత క్లారిటీ వచ్చే అవకాశముంది.

అమెరికాపై టారిఫ్ వార్

(మొదటిపేజీ తరువాయి)

విదేశీ కంపెనీలు అమెరికాలోనే ఫ్యాక్టరీలు ఏర్పాటు చేయాలని.. తమ దేశం నుంచే కార్యకలాపాలు నిర్వహిం చాలన్నారు. అప్పుడైతే సుంకాలు ఉండవన్నారు.

యూఎస్ రక్షణ రంగ ఉత్పత్తులు బ్లాక్

ముఖ్యంగా అమెరికా నుంచి తమ దేశంలోకి దిగుమతి అయ్యే చికెన్, గోధుమ, పత్తి, కార్న్‌పై అదనంగా 15 శాతం సుంకాలు విధిస్తామని చైనా వాణిజ్య శాఖ స్పష్టం చేసింది. సోయా, పోర్క్, బీఫ్, సముద్ర ఉత్పత్తులు, పండ్లు, కూరగాయలు, డైరీ ఉత్పత్తులపై ప్రస్తుతమున్న సుంకాలను 10 శాతం మేర పెంచుతున్నట్టు వెల్లడించింది. అదే విధంగా అమెరికాకు చెందిన 10 రక్షణ రంగ సంస్థలను బ్లాక్‌లిస్ట్‌లో పెడుతున్నట్టు చైనా తెలిపింది. ఫలితంగా అమెరికా సంస్థలు చైనాలో పెట్టుబడులు పెట్టేందుకు అవకాశం ఉండదు.

కెనడా ఏకంగా 25 శాతం వడ్డింపు..

ట్రంప్ సుంకాల పెంపు నిర్ణయాన్ని కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో తీవ్రంగా ఖండించారు. కెనడా నుంచి దిగుమతి చేసుకునే పలు ఉత్పత్తులపై 25శాతం, చమురు, సహజవాయువు, విద్యుత్తుపై 10 శాతం టారీఫ్‌లు విధిస్తున్నట్లు ట్రంప్ ప్రకటనకు ధీటుగా ట్రూడో ప్రతికార చర్యలు తీసుకున్నారు. తాము కూడా అమెరికా దిగుమతులపై 25 శాతం టారిఫ్‌లను విధించనున్నట్టు స్పష్టం చేశారు. కొన్ని ఉత్పత్తులపై సుంకాల పెంపు తక్షణమే అమల్లోకి వస్తుందన్నారు. మరికొన్ని వస్తువలపై రాబోయే రోజుల్లో విధిస్తామని హెచ్చరించారు. అమెరికా నుంచి దిగుమతి చేసుకునే ఆల్కహాల్, పండ్లు సహా 107 బిలియన్ డాలర్ల విలువ చేసే ఉత్పత్తులపై తాము కూడా 25 శాతం టారిఫ్‌లను విధించనున్నట్లు. ఇవి తక్షణమే అమల్లోకి వస్తోందని ట్రూడో వెల్లడించారు.

త్వరలో గల్ఫ్ అమరుల సభ

- మాజీ ఎమ్మెల్యే అనిల్ ఈరవత్రి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

గల్ఫ్ దేశాల్లో మరణించిన కార్మికుల కుటుంబాలతో త్వరలో 'గల్ఫ్ అమరుల సభ'ను నిర్వహిస్తామని మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ అనిల్ ఈరవత్రి వెల్లడించారు. అమరుల కుటుంబాలతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహపంక్తి భోజనం చేయను న్నారని ఒక ప్రకటనలో తెలిపారు. 'చనిపోయిన వారిని స్మరించండి... బతికున్న వారి కోసం పోరాడండి' అనే స్ఫూర్తితో గల్ఫ్ దేశాల్లో ఏ కారణంగా చనిపోయినా... విధి నిర్వహణలో మరణం (ఆన్‌డ్యూటీ డెత్)గా పరిగణించి రాష్ట్ర ప్రభుత్వం రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా ఆర్థిక సహాయం అందజేస్తు న్నదని తెలిపారు. ఇది దేశ చరిత్రలోనే ప్రథమమని పేర్కొన్నారు. భారత దేశ సరిహద్దులు దాటి ఎడారి దేశాల్లో పనిచేస్తూ మరణిం చిన కార్మికులు సైనికుల్లాంటి వారని తెలిపారు. విదేశీ మారక ద్రవ్యాన్ని పంపిస్తూ ఆర్థిక జవాన్లుగా సేవలందించిన వారిని 'గల్ఫ్ అమరులు'గా స్మరించుకోవాలని సీఎం సూచించారని గుర్తు చేశారు. ఇప్పటివరకూ 94 మంది గల్ఫ్ మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున రూ.4.70 కోట్ల ఎక్స్‌గ్రేషియా చెల్లించామని పేర్కొన్నారు.



పంటల కొనుగోళ్లలో జోరు

గతేడాది కంటే పెరిగిన వైనం

21 కేంద్రాల్లో పొద్దుతిరుగుడు కేంద్రాల ఏర్పాటు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో కంది, సోయా, జొన్న, పొద్దుతిరుగుడు తదితర పంటల కొనుగోళ్లు ఊపందుకున్నాయి. గతేడాది కంటే ఎక్కువ పరిమాణంలో పంటలను రాష్ట్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తోంది. మార్కెట్లో మద్దతు ధర ఆశించిన స్థాయిలో లేనప్పుడు ఆయా రాష్ట్రాల్లో ఉత్పత్తి అయిన పంటలను కేంద్రం 25 శాతం కంటే ఎప్పుడూ ఎక్కువ కొనుగోలు చేసిన దాఖలాలు లేవు. ఈ క్రమంలో కేంద్రంతో సంబంధం లేకుండానే కాంగ్రెస్ సర్కార్ ఏడాది కాలం నుంచి పంటలకు మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేస్తుండటం గమనార్హం. పొద్దుతిరుగుడు సేకరణకు మార్క్‌ఫెడ్ ద్వారా రాష్ట్రంలోని 21 చోట్ల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే ఐదు చోట్ల ఏర్పాటు చేసింది. పంట కోతను బట్టి మిగతా కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

2021 నుంచి రాష్ట్రంలో పంటల కొనుగోళ్ల వివరాలు

సంవత్సరం	మద్దతు ధర	కొన్న పరిమాణం (మెట్రిక్ టన్నుల్లో)
కంది		
2021-22	6,300	1,833
2022-23	కొనలేదు	.....
2023-24	7,000	382.72
2024-25	7,550	4,625.10
సోయాబీన్		
2020-21	కొనలేదు	....
2021-22	కొనలేదు	....
2022-23	కొనలేదు	....
2023-24	4,600	6,025.950
2024-25	4,892	81,119.720
జొన్న		
2020-21	2,620	37,560
2021-22	2,738	25,860
2022-23	2,970	37,073
2023-24	3,180	93,900.53
ప్రొద్దుతిరుగుడు		
2020-21	కొనలేదు	....
2021-22	కొనలేదు	....
2022-23	6,400	8,957
2023-24	6,760	8,775.58
2024-25	7,280	21 కేంద్రాల్లో కొనుగోళ్ల ప్రారంభం

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరిస్తాం

- ప్రజావాణి ఇన్‌చార్జి జి.చిన్నారెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర వ్యాప్తంగా విధులు నిర్వహిస్తున్న నాలుగు వేల మంది మినీ అంగన్‌వాడీ టీచర్ల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని ప్రజావాణి ఇన్‌చార్జి చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ హామీ ఇచ్చారు. హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి అంగన్‌వాడీలు భారీగా తరలివచ్చి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. పెండింగ్ సమస్యలపై సర్కార్ సానుకూలంగా ఉందని వారికి అధికారులు ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. మంగళవారం ప్రజావాణికి మొత్తం 401 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 60, విద్యుత్ శాఖకు సంబంధించి 38, రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 40, ఇందిరమ్మ ఇండ్ల పథకం కోసం 216 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 47 దరఖాస్తులు అందినట్టు అధికారులు తెలిపారు.

ఆడపిల్ల పుడితే 'ఆడపిల్లనా..' అంటూ సాగదీస్తుంటారు. ఇక రెండో సారీ అమ్మాయే అయితే 'మళ్లీ ఆడపిల్లేనే' అని జాలిగా చూస్తుంటారు. ఆడపిల్ల పుడితే ఆమెకు పెళ్లి, పిల్లలు ఇలా చాలా బాధ్యతలు ఉంటాయి. ఓ ఇంటికి పంపే వరకూ చాలా కేర్‌తో చూసుకోవలసి ఉంటుందనే ధోరణి ఇప్పటికీ చాలా మంది తల్లిదండ్రుల్లో ఉంది. అదే మగపిల్లవాడు పుట్టగానే వంశోద్ధారకుడు పుట్టాడని తెగ సంబరపడిపోతుంటారు. అదే ఆడపిల్ల పుట్టిందనే సరికి ఒకింత ఢీలా పడిపోతారు. ఇలా ఎందుకు ఆలోచిస్తున్నారు..? దీనికి కారణం ఏంటీ? తల్లిదండ్రుల పెంపకంలో మార్పు రావాలి. సమాజం ఆలోచించే ధోరణిలో మార్పు రావాలి. మరి కొద్ది రోజుల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకోబోతున్న నేపథ్యంలో ఆ మార్పు ఎలా ఉండాలో చూద్దాం...

పెంపకంలో మార్పు అవసరం





పూర్వపు రోజుల్లో ఆడవారికి పరిమితులు విధించి వారు ఈ పనులు మాత్రమే చేయగలరనే ఆలోచనలు ఉండేవి. వారిని కేవలం నాలుగ్గోడలకే పరిమితం చేసేవారు. ముఖ్యంగా మన భారతదేశంలో ఈ పరిస్థితి బాగా ఉండేది. ఆడపిల్లకు చదువు నిషేదం. బయట అడుగుపెట్టకూడదు. అదే మగపిల్లవాడి విషయానికి వచ్చే సరికి కుటుంబాన్ని పోషిస్తాడని.. బాధ్యతలను పంచుకుంటాడని ఆలోచించేవారు. అదే ధోరణి ఇప్పటికీ చాలా చోట్ల చూస్తున్నాం. ఆడపిల్ల పుడితే ఆమెకు పెండ్లి చేసి ఓ ఇంటికి పంపించాలి. కట్నకానుకలు భారీగా ఇవ్వాలి. ఆస్తి పంపకాల విషయంలోనూ, నచ్చిన చదువును చదివించడానికి మగపిల్లాడికి ఉన్న ప్రాధాన్యం ఆడపిల్లకి తక్కువే అని చెప్పాలి. ఈ ధోరణి మారాలంటే అసలు ఏం చేయాలనే కోణాన్ని తీసుకుంటే చిన్నతనం నుండి పిల్లలకు స్త్రీ, పురుష సమానత్వం గురించి తల్లిదండ్రులు చెబుతూ ఉండటం వల్ల పెరిగేకొద్దీ పిల్లలు లింగవివక్ష అనే పదానికి దూరంగా ఉంటారు.

ప్రతి పనిలోనూ...

మనం చేసే, చేయించే పనులతోనే స్త్రీ, పురుషులను వేరు చేయడం మొదలవుతుంది. కాబట్టి మొదట దాన్ని దూరం చెయ్యాలి. ఆడపిల్ల చేసే పనులు, మగ పిల్లాడు చేసే పనులు అంటూ విభజించి పనులు అప్పగించకూడదు. ఇంటిపని, వంటపని, బయట పనుల్లోనూ ఇద్దరు పిల్లల్ని భాగస్వామ్యం చేయాలి. ఇద్దరినీ ప్రతి పనిలోనూ భాగస్వామ్యం చేసి ప్రోత్సహించే బాధ్యత తల్లిదండ్రుల మీద మాత్రమే ఉంటుంది.

కథలు ద్వారా చెప్తే

మంచి కథలను ఎంచుకుని పిల్లలకి ఆసక్తి కలిగించేలా చెప్పాలి. అందులో ఎంచుకునే కథాంశం కూడా లింగవివక్ష, ధీరవనితల గురించి మగపిల్లలుకు కథలు అల్లి చెప్పడం వల్ల పిల్లలకు సరదాగా ఉంటుంది. అవి భవిష్యత్‌లో వారికి ఆడవారిపట్ల గౌరవంతో మెలిగేలా చేస్తాయి. అందుకే కథలతో పిల్లలను ఆలోచింప జేయాలి.



కుటుంబమే ఉదాహరణ

సమానత్వం అనే విషయం గురించి మాటల్లో చెబితే అర్థం కాకపోవచ్చు, పాటించకపోవచ్చు. అందుకే ఇంట్లో తల్లిదండ్రులు సమానత్వం అనే విషయాన్ని అనుసరిస్తూ పిల్లల్ని ప్రేరేపించాలి. ఆడ పిల్ల మగ పిల్లవాడనే తేడా చూపకుండా ఇద్దరినీ సమానంగా చూసినప్పుడు వారిలో లింగవివక్షత అనే భావనే కలగదు.

గౌరవించడం నేర్పాలి

ప్రతి ఒక్కరినీ గౌరవించాలని పిల్లలకు చెప్పాలి. ఇంట్లో పెద్దవారి పట్ల ఎలా మసులుకోవాలో వారికి నేర్పించాలి. ఏదైనా నేర్పేముందు, చెప్పేముందు మనం ఆచరిస్తే దానినే సులువుగా పిల్లలు ఫాలో అవుతారు.

పంచుకోవడం...

ఏ వస్తువు కొన్నా మొదటగా ఆడపిల్లకు పంచాకే మగవారికి ఇచ్చే అలవాటు చేయాలి. ఇలా చేయడం వల్ల మగపిల్లాడికి ఆడపిల్ల పట్ల ప్రత్యేకమైన శ్రద్ధ ఇంట్లో చూపుతున్నారని అర్థం అవుతుంది. ఇక నుంచి తను కూడా అలా చూసేందుకు అలవాటు పడతాడు. ఎక్కువ తక్కువ లేకుండా అన్నిటినీ ఆడపిల్లలు, మగపిల్లలు సమానంగా పంచుకునే అలవాటు అలవడుతుంది.

- ఎదుటివ్యక్తులు ఏ జెండర్ వారు అయినా వాళ్ళను ఏ విషయంలోనూ ఎప్పుడూ జడ్జ్ చేయకూడదనే విషయం పిల్లలకు చెప్పాలి. సమానత్వం అనేది పిల్లల ఆలోచనలను నిలకడగా ఉండేలా చేస్తుంది. అందుకే అన్ని విషయాలలో సమానత్వాన్ని ప్రోత్సహించండి.
- ఇంట్లో భార్యాభర్తలు ఎక్కువ తక్కువ అనే విషయాన్ని వదిలెయ్యాలి. భార్యాభర్తలు ఇద్దరూ ఉద్యోగస్తులు అయినా కాకపోయినా ఎవరిపని వాళ్ళు బాధ్యతగా చేస్తుంటారు. కాబట్టి ఒకరికి ఒకరు గౌరవం ఇచ్చుకుంటే పిల్లలకు అదే అలవాటు అవుతుంది.
- ఎదుటివారి ఎమోషన్స్‌ను, వారి పరిస్థితులను అర్థం చేసుకోవాలి. దానివల్ల ఎదుటి వ్యక్తులకు గౌరవం ఇచ్చినట్టు అవుతుంది. తల్లిదండ్రులు పిల్లలు ఏ జెండర్ అయినా సొంత నిర్ణయాలు తీసుకోవడానికి అవకాశం ఇవ్వాలి. అవసరమైతే సలహాలు సూచనలు ఇవ్వచ్చు.
- తప్పు చేసినా, తప్పుగా ప్రవర్తించినా, ఏదైనా సమస్యలో చిక్కుకున్నా దాన్ని బయటకు చెప్పి ఒప్పుకునే మనస్తత్వాన్ని పెంచాలి. దీనివల్ల భవిష్యత్తులో అన్నింటినీ అంగీకరించే మానసిక సామర్థ్యం పెరుగుతుంది.

చిన్నపాటి చర్చలు అవసరం

పిల్లలతో చిన్న చర్చలు చేయాలి. దేశంలో జరుగుతున్న పరిస్థితుల గురించి, వాటి కారణాలు, పరిష్కారాల గురించి ఆ చిన్ని మెదళ్లు ఏం చేబుతాయనేది విని కాస్త చర్చించాలి. చుట్టూ జరుగుతున్న విషయాల గురించి మాట్లాడాలి. ఇది వారికి ప్రతి విషయాన్ని గమనించే శక్తిని ఇస్తుంది.

పైన చెప్పుకున్నట్టు పిల్లలకు తల్లిదండ్రులు ఇంటి నుండే నేర్పించాల్సిన విషయాలు ఎన్నో ఉన్నాయి. ఈ పద్దతిని అందరూ పాటిస్తే సమాజంలో లింగ వివక్షత అనే పెద్ద విషయాన్ని పరిష్కరించి లింగసమానత్వాన్ని సాధించవచ్చు.

ఆద్యంతం మగువే



ప్రతి గాయాన్ని గేయంగ
పురాణ గానాలుగ
మౌన వ్రతాలుగ
అప్పగింతల వంతనలుగ
కూడా పాడుకునే
స్త్రీలు కదూ
సహనంలో మిమ్ము
మించి లేరెవరు మరి !!

శారీరక బలాన్ని మించిన
మనోధైర్యంతో సాగి
నాడు వనారణ్యంలో
నేడు నాగరికతారణ్యంలో
అన్నింటా మేమే నంటూ
పరిగెత్తే మహిళలు కదూ
పురుషుని కంటే ఎక్కువ కాక
ఏమవుతారు మరి !!

ఎన్ని తరాలు కన్నారు
ఎన్నెన్ని వంశాలు పెంచారు
ఐనా మీకు ఇంటిపేరు ఎందుకని
అంతకుమించిన ప్రకృతివని
ప్రత్యేకంగ నిలిపిన
మాతలు కదూ
వికృతి కంటే ప్రకృతి ఎక్కువ
కాక ఏమవుతుంది మరి !!

జ్ఞానమనే దీపాన్ని ఆర్పుకొని
కొవ్వొత్తిలా కరిగిపోయే మీకు
మనోపూర్వక అనుభవాలు
ఎందుకని
భౌతిక అలంకారానికి
మాత్రం మిగిలిన
తనూలతలు కదూ
మకరందాన్ని, మాధుర్యాన్ని
అందించక
మీకు సాటి రాని వారి గురించి
పోటీ ఎందుకు
మీరెప్పుడూ ఎక్కువే మరి !!

మానం తీసేదొకరు
పరువు పోతుందని
ప్రాణం తీసేదొకరు
చివరకు మీ బొమ్మను చూపక
ప్రతిష్ట కాపాడేదొకరు
ఇన్ని యుద్ధాలు, వ్యాపారాలు
స్త్రీల గురించే జరిగాయంటూ
కితాబిచ్చేదొకరు ఐనా మీరు
స్థిర చిత్తంతో ఉండక
మీ ఉనికిని నిలబెట్టే
స్త్రీత్వాన్ని మరిచిపోయి కయ్యానికి
కాలు దువ్వడమెందుకు
నిరూపణ అవసరమే
లేని మీరు
ఎప్పటికీ ఎక్కువే మరి !!

దేశ కాలమాన వృద్ధిలో
మిమ్ము సమిధను చేసి
కొలమానం లేని
సామర్థ్యం మీదని
ఏ జీతమిచ్చినా తక్కువేనని
కరణేషు మంత్రిగ పొగిడి
ఆదివారం కూడా సెలవెరుగని
కార్యేషు దాసిగ
గణతికెక్కిన మీరు
వర్ణించలేనంత ఎక్కువే మరి !!

- మృదుల, 7093470828

ఫీజులపై బెంబేలెత్తుతున్న తల్లిదండ్రులు

(మొదటిపేజీ తరువాయి)

ముగియనున్న ప్రస్తుత బడ్జెట్‌లో విద్యా రంగానికి రూ.21,292 కోట్లను కేటాయించారు. ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయటం ద్వారానే 'ప్రయివేటు, కార్పొరేట్ వ్యామోహం' నుంచి తల్లిదండ్రులను బయటపడేయొచ్చని విద్యారంగ నిపుణులు చెబుతున్న క్రమంలో ఈసారి ఆ మొత్తాన్ని ఎంతమేరకు పెంచుతారనేది ఆసక్తికరంగా మారింది.

ప్రయివేటు చేతికి యుద్ధ విమానాల తయారీ

(మొదటిపేజీ తరువాయి)

పెంచాల్సిన అవసరాన్ని ఐఎఎఫ్ నొక్కి చెప్పింది. ఎల్‌సీఏ ప్రోగ్రామ్‌లోని లొసుగులు, లోపాలను నిర్మూలించేందుకు, వాయుసేన నిర్వహణా సామర్థ్యాన్ని పెంపొందించేందుకు పలు స్వల్పకాల, మధ్య, దీర్ఘకాలిక చర్యలను కమిటీ ప్రతిపాదించింది. ప్రభుత్వ రంగానికి చెందిన హిందూస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్‌ఏఎల్)పై ఆధారపడడాన్ని తగ్గిస్తూ, తేలికపాటి యుద్ధ విమానాల తయారీని వేగిరపరిచేందుకు ప్రయివేటు రంగ కంపెనీల పాత్రను కూడా పెంచాల్సి వుందని కమిటీ కీలకమైన సిఫారసు చేసింది. రక్షణ ప్రభుత్వ రంగ సంస్థలు, డీఆర్‌డీఓ సమన్వయంతో ప్రయివేటు రంగం పాత్రను విస్తరించాల్సిన ఆవశ్యకతను నివేదిక నొక్కి చెప్పింది. భారత వైమానిక దళం రానున్న 10ఏండ్లలో వివిధ వేరియంట్లకు చెందిన 350 తేలికపాటి యుద్ధ విమానాలను వినియోగించాలని భావిస్తోంది. కానీ అమెరికా నుంచి ఇంజన్లు రావడంలో జరుగుతున్న ఆలస్యంతో పురోగతి దెబ్బతింటోంది. దీనివల్ల ఈ విమానాలను వాయు సేనలోకి సకాలంలో తీసుకోవడం కూడా ప్రభావితమవుతోంది.

రక్షణ తయారీలో స్వావలంబను సాధించాలన్న భారతదేశ లక్ష్యాన్ని ఈ నివేదిక నొక్కి చెప్పింది. భారత వైమానిక దళం తన నిర్వహణా అవసరాలను ఎదుర్కొనడానికి వీలుగా సకాలంలో విమానాలు అందుతాయని కూడా హామీ కల్పించింది.ఎయిర్ చీఫ్ మార్షల్ వ్యక్తం చేసిన ఆందోళనలను కమిటీ తన నివేదికలో నొక్కి చెప్పింది. కీలకమైన ప్రాధాన్యతా రంగాలను కమిటీ గుర్తించిందని రక్షణ మంత్రిత్వ శాఖ కూడా ఒక ప్రకటనలో నిర్ధారించింది. ఏరోస్పేస్ రంగంలో స్వావలంబన ప్రాముఖ్యతను నొక్కి చెప్పిందని పేర్కొంది. ఐఎఎఫ్ స్క్వాడ్రన్‌లను అవసరాలకు తగినట్లుగా నిర్వహించాలంటే ఏటా కొత్తగా 35 నుండి 40 యుద్ధ విమానాల అవసరం వుందని ఎయిర్‌చీఫ్ మార్షల్ చెప్పారు. 42 స్క్వాడ్రన్‌లు అవసరం కాగా, ప్రస్తుతం ఎయిర్ ఫోర్స్ వద్ద కేవలం 31 యుద్ధ స్క్వాడ్రన్‌లే వున్నాయి. దీంతో ఐఎఎఫ్ యుద్ధ సంసిద్ధత పట్ల ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. హెచ్‌ఏఎల్‌లో జాప్యమవుతుందనే నెపంతో..ప్రయివేటుకు కట్టబెట్టడానికి మోడీ సర్కార్ ప్రయత్నిస్తున్నదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రక్షణరంగంలోకి ప్రయివేటు అనుమతించటం సరైంది కాదని రక్షణ రంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు. కేవలం కాషాయ నేతలు కమీషన్ల కోసమే ఇలాంటి ప్రయివేటు మార్గాలను అన్వేషిస్తున్నారని పేర్కొంటున్నారు.

15 నెలల్లో 400 మంది రైతుల ఆత్మహత్య

మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ 15 నెలల పాలనలో రాష్ట్రంలో 440 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్‌తో కలిసి మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్, సాగునీరు, రైతుభరోసా అందక పోవడంతో అన్నదాతలు బలవన్మరణాలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుబీమా, రైతుబంధు పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. ఏడాదికి రూ.1500 కోట్లకు గాను రెండో విడత కాంగ్రెస్ ప్రభుత్వం రూ.750 కోట్ల ప్రీమియం చెల్లించని కారణంగా ఏడు వేలకు పైగా కుటుంబాలకు రైతు భీమా పరిహారం పెండింగులో ఉందని గుర్తు చేశారు. రైతుబంధు ఎప్పుడు చెల్లిస్తారో తెలియని అయోమయ పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. పంటల సాగుకు సైతం వ్యవసాయ మంత్రికి, అధికారులకు మధ్య సమన్వయం లేదని విమర్శించారు. గోదావరిలో నీళ్లున్నా ఎత్తిపోయకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ఆరోపించారు.

బడ్జెట్లో మేమెక్కడ..?

(మొదటిపేజీ తరువాయి)

చింది. వీటిలో ఇప్పటి వరకూ 2.24 లక్షల ఇండ్లు పూర్త యినట్టు, అందులో 1.24 లక్షల ఇండ్లను లబ్దిదారులకు వంపిణీ చేసినట్టు కేంద్రం పార్లమెంటులో ప్రకటించింది. కానీ వాటిని ఎక్కడ పంపిణీ చేసింది.. ఎవరికి పంపిణీ చేసిందనే వివరాలను ఇప్పటి వరకూ చెప్పకపోవటం గమనార్హం. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ సర్కారు సైతం ప్రతీ నియోజకవర్గానికి 3.500 ఇండ్ల చొప్పున 110 నియోజకవర్గాలకు 4.5 లక్షల ఇండ్లను నిర్మిస్తామని హామీ ఇచ్చింది. ఇది జరిగి 14 నెలలు గడిచినప్పటికీ ఇంతవరకూ అతీగతీ లేదు. ప్రజా పాలన, సమగ్ర కుటుంబ సర్వే పేరిట పలుమార్లు దరఖాస్తులు స్వీకరించారేగానీ ఇండ్లను తమకు మంజూరు చేయటం లేదని లబ్దిదారులు వాపోతున్నారు. 2024-25 బడ్జెట్‌లో ప్రభుత్వం గృహ నిర్మాణానికి రూ.7,740 కోట్లు కేటాయించింది. ఇవి ఏ మూలకూ సరిపోలేదని అధికారవర్గాలు తెలిపాయి. ఈ క్రమంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఈసారి ఎన్ని నిధులు కేటాయిస్తారో వేచి చూడాలి. కేసీఆర్ హయాంలో పదేండ్ల కాలంపాటు రాష్ట్రంలో రేషన్ కార్డులను జారీ చేయలేదు. ఆ క్రమంలో తాము అధికారంలోకి వస్తే కొత్త రేషన్ కార్డులను జారీ చేస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. దీంతో గత 15 నెలల కాలంలో దాదాపు 11 లక్షల మంది రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. గతంలో రాష్ట్రంలో 87.55 లక్షల రేషన్ కార్డులుండగా, వీటి ద్వారా 2.79 కోట్ల మంది లబ్దిపొందుతున్నారు. వీటిలో కేంద్రం 53.30 లక్షల కార్డులను మాత్రమే ఆమోదించగా, మిగతా 34.25 లక్షల కార్డులను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. వీటిపై ఒక్కో మనిషికి నెలకు ఆరు కిలోల చొప్పున బియ్యం ఇస్తుండగా, అవి సరిపోకపో వటంతో అదనంగా కిలోకు రూ.50 నుంచి రూ.70 వరకు వెచ్చించి పేదలు బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. మిగతా నిత్యావసర వస్తువుల ధరలు సైతం ఆకాశాన్ని అంటటంతో వారిపై తీవ్ర భారాలు పడుతున్నాయి. 2024-25 బడ్జెట్‌లో ప్రజా పంపిణీ వ్యవస్థకు ప్రభుత్వం రూ.3,836 కోట్లను మాత్రమే కేటాయించింది. కొత్తగా దరఖాస్తు చేసుకున్న పదకొండు లక్షల మందికి రేషన్ కార్డులిచ్చేందుకు ఈసారి ఎక్కువ మొత్తంలో నిధులు అవసరమవుతాయని ఆర్థికశాఖ అంచనా వేసింది. మరోవైపు రాష్ట్రంలోని వివిధ శాఖల్లో గత 25 ఏండ్లుగా సేవలందిస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, టైమ్ స్కేల్ ఉద్యోగులు, సిబ్బంది వెతలు పాలకులకు పట్టటం లేదు. దాదాపు లక్షన్నర మంది సిబ్బంది తమను క్రమబద్ధీకరిం చాలంటూ రెండున్నర దశాబ్దాలుగా పోరాడుతు న్నారు. తాము అధికారం లోకి వస్తే తెలంగాణలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ వ్యవస్థను పూర్తిగా రద్దు చేస్తామంటూ 2014 ఎన్నికల్లో హామీనిచ్చిన బీఆర్ఎస్...పదేండ్ల పాటు కాలయాపన చేసి దాన్ని అటకెక్కించింది. వారందర్నీ పర్మినెంట్ చేస్తామంటూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ హామీనిచ్చింది. అయితే ఇంతవరకూ కార్యాచరణ రూపొందించకపో వటంతో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది తీవ్ర నిరాశలో కూరుకుపోయారు. తమను రెగ్యులరైజ్ చేయటానికి అడ్డంకిగా ఉన్న 2/94 చట్టాన్ని, కాంట్రాక్టు ఏజెన్సీ విధానాన్ని రద్దు చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. దీంతోపాటు ప్రతీనెలా వేతనాలు చెల్లించకపోవట ంతో ఆయా ఉద్యోగులు, సిబ్బంది తమ కుటుంబాలను పోషించలేక సతమతమవుతు న్నారు. గిరిజన సంక్షేమశాఖలోని ఔట్‌సోర్సింగ్ కార్మికులకు గత రెండేండ్లుగా వేతనాలు చెల్లించటం లేదు. ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలోని సిబ్బందికి 11 నెల్ల వేతనాలు బకాయి పడ్డాయి. ఈ సమస్యలన్నిం టినీ పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. అందుకనుగుణంగా రాబోయే బడ్జెట్‌లో నిధులు కేటాయించాల్సిన అవసరముంది.

ప్రభుత్వ భూముల అమ్మకానికి సర్కారు కుట్ర

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వ భూముల అమ్మకానికి రాష్ట్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఒక ప్రకటనలో విమర్శించారు. అసెంబ్లీ సాక్షిగా ప్రజలను తప్పుదోవ పట్టించిన సర్కార్ వెంటనే క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. "ప్రభుత్వ భూములంటే పెద్దలిచ్చిన ఆస్తి. తెలంగాణ జాతి సంపద. ఆ భూములను అమ్మితే భవిష్యత్‌లో శ్మశానాలు నిర్మించాలంటే కూడా భూమి లేకుండా పోతుందని నాడు పీసీసీ అధ్యక్షుడి హెూదాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మొసలి కన్నీరు కార్చిండు. తాము అధికారంలోకి వస్తే ఇంచు ప్రభుత్వ భూమిని కూడా అమ్మబోమంటూ ఎన్నికల సమయంలో వాగ్దానాలు చేసిండు. ప్రస్తుతం రూ.20 వేల కోట్ల విలువైన భూములను వేలం వేసేందుకు తెరలేపిండు" అని హరీశ్‌రావు విమర్శలు గుప్పించారు. నిధుల సమీకరణ పేరుతో కారు చౌకగా భూములను అమ్ముతుండటం కాంగ్రెస్ ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనమని ఆరోపించారు. మాస్టర్ ప్లాన్ పేరిట వేలం పాట నిర్వహించేందుకు కన్సల్టెంట్ నియామకానికి (ఆర్ఎఫ్‌పీ) గత నెల 28న టెండర్లు పిలవడం ప్రభుత్వ దిగజారుడు తనానికి పరాకాష్ట అని వ్యాఖ్యానించారు. "కంచ గచ్చిబౌలి గ్రామం సర్వే నంబర్ 25 పరిధిలోని 400 ఎకరాలను బ్యాంకర్లకు తనఖా పెట్టిన సమయంలో ప్రభుత్వం రూ. 25 కోట్లకు ఎకరం చొప్పున రూ.10వేల కోట్లు ఇప్పటికే సమీకరించింది. బ్యాంకులో తనఖా పెట్టిన అవే భూములనే వేలం వేసి అమ్ముకోవడం ప్రభుత్వ దివాలాకోరు తనానికి నిదర్శనం" అని ఆయన విమర్శించారు.

అసెంబ్లీని తప్పుదోవ పట్టించారు.

"జూన్ 26, 2024న విడుదల చేసిన జీవో ఎంఎస్ 54తో ఎకరానికి రూ. 75 కోట్ల చొప్పున మొత్తం 30వేల కోట్ల విలువైన భూములను అమ్ముతున్నారని నేను అసెంబ్లీలో నిలదీస్తే.. అలాంటిదేమి లేదని, టీజీఐఐసీకి చేస్తున్న భూ బదలాయింపు మాత్రమేనని బుకాయించారు.

నిండు సభలో ముఖ్యమంత్రి సహా మంత్రులు తప్పుడు సమాధానం చెప్పి, సభను, సభ్యులను తప్పుదోవ పట్టించారు. అసెంబ్లీ అయ్యిందో, లేదో వెంటనే అదే భూమిని తనఖా పెట్టి రూ. 10వేల కోట్ల రుణం తెచ్చుకున్నరు. తిరిగి అసెంబ్లీ మొదలయ్యే లోపే ఇప్పుడు అదే భూమి అమ్మకానికి టెండర్లు పిలుస్తున్నారు. భూముల అమ్మకంపై అసెంబ్లీని తప్పుదోవ పట్టించారు. సర్కార్ భూముల అమ్మకం ప్రక్రియను వెంటనే ఉపసంహరించుకోవాలి" అని హరీశ్ డిమాండ్ చేశారు.

రాష్ట్రాల తీరువల్లే వైద్యం అందట్లే

ప్రయివేటు ఆస్పత్రులకు ప్రోత్సాహకంగా మారింది
ఔషధ ధరలు పెరిగాయి : సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: అందుబాటు ధరల్లో వైద్య సంరక్షణ, సదుపాయాలు అందించడంలో రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యమే ప్రయివేటు ఆస్పత్రులకు ప్రోత్సాహకంగా మారిందని వ్యాఖ్యానించింది. ప్రయివేటు ఆస్పత్రులన్నీ రోగులు, వారి బంధువులతో బలవంతంగా అధిక ధరలతో కూడిన మందులను కొనుగోలు చేయిస్తున్నాయని ఆరోపిస్తూ దాఖలైన పిటిషన్‌పై తాజాగా సుప్రీంలో విచారణ జరిగింది. తమ ఫార్మసీల నుంచే ఔషధాలు కొనుగోలు చేయాలని రోగులను బలవంతం చేయకుండా ప్రయివేటు ఆస్పత్రులకు ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్ కోరారు.నియంత్రణ చర్యలు తీసుకోవడంలో కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని, దానివల్ల రోగులు దోపిడీకి గురవుతున్నారని పేర్కొన్నారు. పిటిషనర్ వాదనతో సుప్రీం ధర్మాసనం ఏకీభవించింది. రోగులకు సూచించిన ఔషధం వేరే చోట తక్కువ ధరకు లభిస్తున్నప్పుడు, దానిని తమ ఫార్మసీలోనే కొనుగోలు చేయాలని ప్రయివేటు ఆస్పత్రులు బలవంతం చేయకుండా చూడాలని రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది. ముఖ్యంగా సమాజంలోని పేద వర్గాలకు ప్రాణాధార ఔషధాలు అందుబాటు ధరల్లో లభించడం కష్టమైపోయిందని వ్యాఖ్యానించింది. పౌరులు ఈ రకమైన దోపిడికీ గురికాకుండా రక్షించేందుకు తగిన మార్గదర్శకాలు రూపొందించాలని కేంద్రాన్ని ఆదేశించింది.

ఫోర్త్ సిటీ పేరుతో భూములు గుంజుకుంటుండ్రు

(మొదటిపేజీ తరువాయి)

రైతులతో కలిసి జాన్‌వెస్లీ పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఫార్మాసిటీ బాధిత రైతుల సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఫార్మాసిటీ ఏర్పాటుపై స్పష్టమైన వైఖరిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఫోర్త్ సిటీ పేరుతో దొడ్డి దారిన రైతుల అనుమతి లేకుండా భూములను గుంజుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరలోనే ఫార్మా బాధిత గ్రామాలైన మేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాలతో పాటు కందుకూరు మండలంలో పర్యటించి, సదస్సులు నిర్వహించి రైతుల సమస్యలపై నివేదికను తయారుచేసి ప్రభుత్వానికి అందిస్తామని తెలిపారు. రైతులందరినీ ఒక వేదికపైకి తీసుకొచ్చి వారి సమస్యల పరిష్కారానికి సీపీఐ(ఎం) పోరాడుతుందని అన్నారు. ఎన్నికలకు ముందు ఫార్మాసిటీని రద్దు చేస్తామని చెప్పిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చాక మాట మార్చిందని విమర్శించారు. రైతుల పేర్లను రికార్డుల్లో నుంచి తొలగించి అటు ప్రభుత్వం, ఇటు అధికారులు రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. రైతుల ఓట్లతో గెలిచిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తక్షణమే ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి రైతులందరికీ న్యాయం జరిగేలా చూడాలని కోరారు. ప్రభుత్వం హైకోర్టు ఆర్డర్‌ను వెంటనే అమలు చేసి నిషేధిత జాబితాలో ఉన్న రైతుల పేర్లు తొలగించి, వారికి రైతు భరోసా, రైతు బీమా, పంట లోన్లు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. లేకుంటే సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరుబాట నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి. మధుసూదన్ రెడ్డి, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ఆలంపల్లి నరసింహ, జిల్లా కమిటీ సభ్యులు పి. అంజయ్య, పార్టీ మండల కార్యదర్శివర్గ సభ్యులు పి. బ్రహ్మయ్య, ఆలంపల్లి జంగయ్య, చందు నాయక్, మండల కమిటీ సభ్యులు పిరాటి వెంకటయ్య, దంతుక పెద్దయ్య, కావలి జగన్, ముచ్చర్ల లాజర్, మండల బాలరాజ్, ఎండీ జాంగిర్, విప్లవ కుమార్, ఫార్మా బాధిత రైతులు తదితరులు పాల్గొన్నారు.

సీతారామ ప్రాజెక్ట్ కాలువ పరవళ్ళు

కొత్తగూడెం జిల్లా అశ్వాపురంలో పంప్ హౌజ్ ప్రారంభించడంతో సీతారామ ప్రాజెక్ట్ కాలువలో నీళ్ళు ఏరులై పారుతున్నాయి. నూతన మండలం అయిన అన్నపురెడ్డిపల్లి మండలానికి మంగళవారం ఉదయం 6 గంటల సమయంలో నీళ్లు రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నీళ్ళు లేక పంటలు ఎండిపోతున్న సమయంలో ఒక్కసారిగా నీళ్ళు రావడంతో గ్రామాల్లో ప్రజలు సీతారామ కాలువను చూడటానికి వందల సంఖ్యలో చేరుకున్నారు. ఇది అంతా ఒక ఎత్తు అయితే స్థానిక సంస్థల ఎన్నికలు పంచాయతీ ఎన్నికల దగ్గర పడటంతో రాజపురం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సీతారామ ప్రాజెక్ట్ కాలువలో గోదావరి జలాలకు ఉదయం పసుపు, కుంకుమ చల్లి కొబ్బరికాయలు కొట్టారు. సాయంత్రం సమయంలో బీఆర్ఎస్ నాయకులు కేసీఆర్ చిత్రపటం కెనాల్‌లో పెట్టి పాలాభిషేకం చేసి గోదావరి జలాలు పల్లెలోకి తీసుకువచ్చి పంట పొలాలకు అందించిన ఘనత కేసీఆర్‌కి దక్కుతుందంటూ పార్టీల ప్రతాపాన్ని చూపించారు.

సుప్రీం నోటీసులు

(మొదటిపేజీ తరువాయి)

మంగళవారం సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ అగస్టైన్ జార్జ్ మాసిస్‌ల నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరపు సీనియర్ న్యాయవాది అర్యమ సుందరం, నాయుడు, మోహిత్ రావులు, స్పీకర్ కార్యాలయం తరపు సీనియర్ న్యాయవాదులు అభిషేక్ మనుసింఘ్వి, ముకుల్ రోహిత్గిలు హాజరయ్యారు. వాద ప్రతివాదనల అనంతరం ఫిరాయింపులపై నిర్ణయానికి సంబంధించి స్పీకర్ కార్యాలయానికి నోటీసులు జారీ చేస్తున్నట్టు ధర్మాసనం స్పష్టం చేసింది. స్పీకర్ కార్యాలయంతో పాటు, స్పీకర్ సెక్రెటరీ, రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ఎన్నికల సంఘం, ప్రతివాదులకు నోటీసులు ఇస్తున్నట్టు ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ నెల 22లోగా వివరణ ఇవ్వాలని, తదుపరి విచారణ 25కు వాయిదా వేస్తున్నట్టు స్పష్టం చేసింది.

రెజ్లర్ సుశీల్‌కు బెయిల్

మర్డర్ కేసులో మల్లయోధుడికి ఊరట



న్యూఢిల్లీ : భారత స్టార్ రెజ్లర్, ఒలింపిక్ పతక విజేత సుశీల్ కుమార్‌కు ఎట్టకేలకు న్యాయస్థానం నుంచి ఊరట లభించింది. 2021లో న్యూఢిల్లీలోని ఛత్రశాల్ స్టేడియంలో జరిగిన ఘర్షణలో జాతీయ మాజీ జూనియర్ చాంపియన్ సాగర్‌ను తీవ్రంగా కొట్టి చంపిన కేసులో సుశీల్ కుమార్ ఏ1 ముద్దాయి. సుశీల్ కుమార్ మూడున్నర సంవత్సరాలుగా జైల్లోనే మగ్గుతున్నాడని. 222 మంది సాక్షులలో ఇప్పటివరకు 21 మందిని మాత్రమే విచారించారని... ఈ కేసులో విచారణ పూర్తయ్యేందుకు సుదీర్ఘ సమయం పడుతుందని జాప్యం కారణంగా సుశీల్‌కుమార్‌కు బెయిల్ మంజూరు చేయాలని ఆయన తరఫున న్యాయవాది ఆర్ఎస్ మాలిక్, సుమీత్ షోకీన్‌లు వాదించారు. 2021 మేలో సుశీల్ కుమార్‌ను అరెస్టు చేయగా మోకాలు శస్త్రచికిత్స నిమిత్తం ఓ వారం రోజుల మధ్యంతర బెయిల్‌పై హాస్పిటల్‌లో చేరాడు. ఢిల్లీ హైకోర్టు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేయటంతో మూడున్నరేండ్ల తర్వాత సుశీల్ కుమార్ జైల్ నుంచి బయటకు రానున్నాడు.

విద్యలో నాణ్యత ఏది?

చట్టంలో లోపాలను ఎత్తిచూపిన నివేదిక | ప్రక్షాళన అవసరమంటున్న విద్యావేత్తలు



న్యూఢిల్లీ : చారిత్రక విద్యా హక్కు చట్టం వచ్చి పదిహేను సంవత్సరాలు గడిచాయి. ఇప్పుడు భారతీయ విద్యా వ్యవస్థ కీలకమైన సవాలును ఎదుర్కొంటోంది. దేశంలో విద్యా వ్యవస్థ తీరుతెన్నులపై జనవరిలో ఓ నివేదిక విడుదలైంది. అది ఈ రంగంలో దేశం సాధించిన ప్రగతిని ప్రశంసిస్తూనే కొన్ని లోపాలను ఎత్తిచూపింది. 6-14 సంవత్సరాల మధ్య వయసున్న పిల్లల్లో 98.4 శాతం మంది పాఠశాల విద్యను అభ్యసిస్తున్నారని నివేదిక తెలిపింది. అయితే విద్యా నాణ్యత నాసిరకంగా ఉన్నదని అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ నివేదిక ప్రకారం...మూడో తరగతి చదువున్న వారిలో మూడో వంతు మంది మాత్రమే ప్రాథమికమైన తీసివేతలు చేయగలుగుతున్నారు. ఐదో తరగతి విద్యార్థుల్లో సగం మంది కూడా రెండో తరగతి పుస్తకాలు చదవలేకపోతున్నారు.

బడిలో చేర్చితే సరిపోదు

విద్యా హక్కును అమలు చేస్తున్నామని చంకలు గుద్దుకుంటే సరిపోదని, విద్యార్థులు పాఠశాలలో చేరిన తర్వాత వారికి ఎంత నాణ్యమైన చదువు లభిస్తోందన్నది కూడా ముఖ్యమేనని నివేదిక తెలిపింది. సైకిల్ ఉంటే సరిపోదు...దానిని తొక్కే సమర్థత కూడా ఉండాలని ప్రముఖ ఆర్థికవేత్త అమర్త్యసేన్ చెప్పిన సూక్తిని ఈ సందర్భంగా గుర్తుకు తెచ్చుకోవాల్సిన అవసరం ఉంది. విద్య యొక్క విలువ బడికి వెళ్లడంపై ఆధారపడి ఉండదు.

అక్కడ నేర్చుకోవడం, ఎదగడంపై ఆధారపడి ఉంటుంది. చిన్నారులను తరగతి గదికి చేర్చే విషయంలో మన దేశం విజయం సాధించినప్పటికీ వారికి సమర్థవంతంగా విద్యను అందించడంలో మాత్రం వెనుకబడి పోయింది.ఇందుకు విద్యా హక్కు చట్టాన్ని కూడా నిందించాల్సి ఉంటుంది.

నిబంధనలకు నీళ్లు

దేశంలోని అనేక పాఠశాలల్లో మౌలిక వసతులు కూడా లేవు. ప్రతి స్కూలులో గ్రంథాలయం ఉండాలన్న నిబంధన అమలుకు నోచుకోవడం లేదు. కాలం చెల్లిన పాఠ్య పుస్తకాలతో కుస్తీ పట్టడంతోనే విద్యార్థుల సమయం గడిచిపోతోంది. ప్రతి ప్రైవేటు పాఠశాలలో నాలుగో వంతు సీట్లను ఆర్థికంగా వెనుకబడిన తరగతులు, అట్టడుగు వర్గాల ప్రజల పిల్లలకు కేటాయించాలన్న నిబంధన కూడా ఎక్కడా అమలవుతున్న దాఖలాలు లేవు. ఇక్కడ మరో లోపం కూడా కన్పిస్తోంది. 'ఉచిత విద్య' కింద ప్రైవేటు పాఠశాలల్లో 8వ తరగతి వరకూ ప్రవేశం పొందే విద్యార్థులు 12వ తరగతి వరకూ ఎలాంటి ఫీజులు చెల్లించనవసరం లేకుండా విద్యాభ్యాసాన్ని కొనసాగించవచ్చు. అయితే ఈ నిబంధన కూడా అమలు కావడం లేదు.

డిటెన్షన్‌తో భయం...భయం

విద్యా హక్కు చట్టానికి 2019, 2024 సంవత్సరాలలో చేసిన సవరణల ప్రకారం డిటెన్షన్ విధానం మళ్లీ అమలులోకి వచ్చింది. 16 రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాలతో పాటు కేంద్రం నిర్వహించే పాఠశాలలు డిటెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టాయి. దీంతో పరీక్ష ఫెయిలయితే మళ్లీ అదే తరగతి చదవాల్సి ఉంటుందన్న భయం విద్యార్థుల్లో పెరిగిపోతోంది. ఈ సవరణల కారణంగా విద్యా హక్కుకు అర్థమే లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో విద్యా హక్కు చట్టంలో పలు మార్పులు చేయాల్సిన అవసరం ఉన్నదని విద్యావేత్తలు సూచిస్తున్నారు. విద్యార్థులు విద్యాభ్యాసాన్ని ఆనందోత్సాహాలతో కొనసాగించేలా చూడాలని, వారిలో విషయ పరిజ్ఞానాన్ని, సృజనాత్మకతను పెంచాలని వారు కోరారు. విద్యాబోధన మాత్రమే ఉచితం కాకూడదని, విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు కూడా ఉచితంగానే అందించాలని చెప్పారు.డిటెన్షన్ విధానానికి స్వస్తి చెప్పాలని, విద్యార్థుల్లో భయాన్ని దూరం చేయాలని సూచించారు.

సఫారీ, కివీస్ అమీతుమీ

- **లాహోర్‌లో రెండో సెమీస్ నేడు**
- **మ॥ 2.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..**

లాహోర్ (పాకిస్థాన్)

ప్రపంచ క్రికెట్‌లో సత్తా, సామర్థ్యం ఉన్నప్పటికీ ఐసీసీ వైట్‌బాల్ టైటిల్ సాధించని జట్లు దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్. ఇటీవల న్యూజిలాండ్ నిలకడగా ఐసీసీ ఈవెంట్లలో టైటిల్ పోరుకు చేరుకుంటూ ఆకట్టుకుంటోంది. దక్షిణాఫ్రికా సైతం టీ20 వరల్డ్‌కప్‌లో ఫైనల్‌కు చేరి చరిత్ర తిరగరాసేందుకు ప్రయత్నం చేసింది. 2015 వన్డే వరల్డ్‌కప్‌లో న్యూజిలాండ్, 2024 టీ20 వరల్డ్‌కప్‌లో దక్షిణాఫ్రికా భంగపాటు తప్పలేదు. చాంపియన్స్ ట్రోఫీని మాత్రం ఇరు జట్లు సాధించినా.. అప్పటికి ఆ టోర్నమెంట్ పేరు నాకౌట్ కప్‌గా ఉండేది. గతాన్ని మరిపిస్తూ.. ఐసీసీ టైటిల్ వేటలో సరికొత్త శకానికి నాంది పలికేందుకు ఇటు దక్షిణాఫ్రికా, అటు న్యూజిలాండ్ ఎదురుచూస్తున్నాయి. ఐసీసీ వరల్డ్‌కప్ దక్కకపోయినా.. ఐసీసీ మినీ వరల్డ్‌కప్‌ను సొంతం చేసుకునే దిశగా నేడు కివీస్, సఫారీలు నేడు లాహోర్‌లో సెమీఫైనల్లో అమీతుమీ తేల్చుకోనున్నాయి.

సమవుజ్జీల సమరం

కాగితంపై న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా సమవుజ్జీలు. బ్యాటింగ్, బౌలింగ్‌లో ఈ రెండు జట్లకు పెద్దగా వ్యత్యాసం చూపించలేము. స్పిన్ విభాగంలో న్యూజిలాండ్‌ది కాస్త పైచేయి కనిపించినా... బ్యాట్‌తో ఎదురుదాడి చేయటంలో దక్షిణాఫ్రికా ముందంజలో ఉంది. హెన్రిచ్ క్లాసెన్, డెవిడ్ మిల్లర్ సహా రికెల్టన్‌లు దక్షిణాఫ్రికా బ్యాటింగ్‌ను



దుర్భేద్యంగా మార్చారు. తెంబ బవుమా, ఎడెన్ మార్‌క్రామ్‌లు స్లో పిచ్‌లపై గొప్పగా రాణించగలరు. మార్కో జాన్సెన్, కగిసో రబాడ, లుంగిసాని ఎంగిడి రూపంలో నిప్పులు చెరిగే పేస్ త్రయం సఫారీల సొంతం. కేశవ్ మహరాజ్‌కు తోడుగా మార్‌క్రామ్ స్పిన్ బాధ్యతలు పంచుకునే వీలుంది. న్యూజిలాండ్ శిబిరంలో కేన్ విలియమ్సన్, రచిన్ రవీంద్రలకు తోడు టామ్ లేథమ్ మంచి ఫామ్‌లో ఉన్నారు. మాట్ హెన్రీ, కైల్ జెమీసన్‌లు కొత్త బంతితో ఎవరినైనా ఇబ్బంది పెట్టగలరు. పరుగుల వరద పారనున్న మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా ఫేవరేట్‌గా బరిలోకి దిగుతోంది. 2017 నుంచి కివీస్, సఫారీలు ద్వైపాక్షిక వైట్‌బాల్ సిరీస్‌లో పోటీపడలేదు. కానీ 2019, 2023 ప్రపంచకప్‌లో తలపడి చెరో మ్యాచ్‌లో నెగ్గారు. ఇటీవల పాకిస్థాన్‌లో ముక్కోణపు వన్డే సిరీస్‌లోనూ ఈ రెండు జట్లు ఢీకొన్నాయి. ఐసీసీ టోర్నమెంట్లలో దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ 11 మ్యాచుల్లో పోటీపడగా కివీస్ ఏడింట విజయాలు సాధించింది.

పిచ్, వాతావరణం

లాహోర్‌లో ఈ ఏడాది ఐదు వన్డేలు జరిగాయి. సగటు తొలి ఇన్నింగ్స్ స్కోరు 316.5 పరుగులు. ఏ ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేశామనే అంశంతో సంబంధం లేకుండా ఫలితాలు ఉన్నాయి. సెమీఫైనల్‌కు పరుగుల పిచ్‌ను సిద్ధం చేసినట్టు తెలుస్తోంది. సోమవారం ఇక్కడ చిరు జల్లులతో కూడిన వర్షం కురిసింది. కానీ నేడు మ్యాచ్‌కు వర్షం సూచనలు లేవని వాతావరణ శాఖ తెలిపింది. టాస్ నెగ్గిన జట్టు ఛేదనకు మొగ్గు చూపవచ్చు!.

తుది జట్లు (అంచనా) :

దక్షిణాఫ్రికా : తెంబ బవుమా (కెప్టెన్), రియాన్ రికెల్టన్, వాండర్ డసెన్, ఎడెన్ మార్‌క్రామ్, హెన్రిచ్ క్లాసెన్ (వికెట్ కీపర్), డెవిడ్ మిల్లర్, వియాన్ ముల్డర్, మార్కో జాన్సెన్, కేశవ్ మహరాజ్, కగిసో రబాడ, లుంగి ఎంగిడి.

న్యూజిలాండ్ : విల్ యంగ్, రచిన్ రవీంద్ర, కేన్ విలియమ్సన్, డార్లీ మిచెల్, టామ్ లేథమ్ (వికెట్ కీపర్), గ్లెన్ ఫిలిప్స్, మైకల్ బ్రాస్‌వెల్, మిచెల్ శాంట్నర్ (కెప్టెన్), మాట్ హెన్రీ, కైల్ జెమీసన్, విలియం ఓరౌర్క్.

నిధుల కేటాయింపును పెంచండి

- ప్రీ బడ్జెట్ సమావేశంలో అటవీ, దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి విజ్ఞప్తి :సానుకూలంగా స్పందించిన ఆర్థిక మంత్రి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

వచ్చే ఆర్థిక సంవత్సర బడ్జెట్ (2025-26)లో అటవీ, దేవాదాయ, పర్యావరణ శాఖలకు నిధుల కేటాయింపును పెంచాలని ఆ శాఖ మంత్రి కొండా సురేఖ డిప్యూటీ సీఎం, ఆర్థిక, విద్యుత్ శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్కకు విజ్ఞప్తి చేశారు. వచ్చే ఏడాది తమ శాఖ పరిధిలో అనేక ప్రతిష్టాత్మక వేడుకలు, జాతరలు నిర్వహించాల్సి ఉన్నదనీ, గోదావరి పుష్కరాలు కూడా వస్తున్నందున ఆ ఏర్పాట్లు కూడా చూడాల్సి ఉందని వివరించారు. మంగళవారంనాడిక్కడి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఆర్థిక మంత్రి అధ్యక్షతన ప్రీ బడ్జెట్ సమావేశం జరిగింది. దీనికి మంత్రి కొండా సురేఖతో పాటు స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, అటవీశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ అహ్మద్ నదీం, దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యర్, అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ డోబ్రియాల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తమ శాఖల బడ్జెట్ ప్రతిపాదనలను అధికారులు ఆర్థికమంత్రికి వివరించారు. వచ్చే ఏడాది సమ్మక్క, సారలమ్మ జాతర, గోదావరి పుష్కరాలు ఉన్నాయనీ, దీనికి సంబంధించిన పనులకు శాశ్వత ప్రాతిపదికన చేపడితే, భవిష్యత్‌లో నిర్వహణ ఖర్చు తగ్గే అవకాశాలు ఉన్నాయని అధికారులు వివరించారు. అలాగే ఎకో టూరిజం అభివృద్ధి ప్రణాళికలను మంత్రి కొండా సురేఖ వివరించారు. టైగర్ రిజర్వ్ ప్రాంతాల అభివృద్ధి, పురాతన దేవాలయాల పునరుద్ధరణ చేపట్టాల్సి ఉందని వివరించారు. ఈ సందర్భంగా ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ అటవీ నిర్మూలన పరిహార నిధి నిర్వహణ, ప్రణాళికా విభాగం (కంపా), ఉపాధి హామీ పథకాన్ని వినియోగించుకోవాలని సూచించారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో అర్బన్ పార్కుల అభివృద్ధిని ప్రస్తావించారు. సోలార్ విద్యుత్ ద్వారా గిరిజన రైతులు పంపుసెట్ల వినియోగం వంటి వాటిపై ఇంధనశాఖ అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేస్తామన్నారు.

పాక్ కెప్టెన్‌గా సల్మాన్

రిజ్వాన్, బాబర్‌లకు దక్కని చోటు



లాహోర్ : పాకిస్థాన్ సీనియర్ సెలక్షన్ కమిటీ సంచలన నిర్ణయాలు తీసుకుంది. రానున్న న్యూజిలాండ్ పర్యటనకు పీసీబీ మంగళవారం వైట్‌బాల్ ఫార్మాట్ జట్లను ప్రకటించింది. టీ20 జట్టు నుంచి మహ్మద్ రిజ్వాన్, బాబర్ ఆజామ్‌ను తప్పించగా.. వన్డే జట్టు నుంచి స్టార్ పేసర్ షహీన్ షా అఫ్రిదిపై వేటు వేశారు. పాకిస్థాన్, న్యూజిలాండ్ ఐదు మ్యాచుల టీ20 సిరీస్ మార్చి 16 నుంచి ఆరంభం కానుండగా, మూడు మ్యాచుల వన్డే సిరీస్ మార్చి 29 నుంచి షురూ అవుతుంది. చాంపియన్స్ ట్రోఫీలో దారుణ ఓటమి చవిచూసినా.. మహ్మద్ రిజ్వాన్ వన్డే జట్టు పగ్గాలను నిలుపుకున్నాడు. టీ20 జట్టుకు సల్మాన్ అలీ ఆఘా కెప్టెన్‌గా ఎంపిక కాగా..షాదాబ్ ఖాన్ వైస్ కెప్టెన్ ఎంపికయ్యాడు.

నా కెరీర్‌లో గుర్తు పెట్టుకునే క్యారెక్టర్ చేశా



రాజేంద్రప్రసాద్

హీరో నితిన్ హైలీ యాంటిసిపేటెడ్ హీస్ట్ కామెడీ ఎంటర్‌టైనర్ 'రాబిన్‌హుడ్'. శ్రీలీల కథానాయికగా నటించింది. వెంకీ కుడుముల దర్శకత్వం వహించిన ఈ సినిమాని మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. ఈ చిత్రంలో రాజేంద్రప్రసాద్ కీలక పాత్ర పోషించారు. ఈ సినిమా ఈనెల 28న థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో రాజేంద్రప్రసాద్ మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.

- సినిమా ఇండస్ట్రీకి వచ్చి 48 ఏళ్లు అయ్యింది. 'రాబిన్‌హుడ్' చేశాక యాక్టర్‌గా నామీద నాకు కాన్ఫిడెన్స్ లెవల్ పెరిగింది. ఈ సినిమా చూసాక నేను హీరోగా చేసిన ఎంటర్‌టైనింగ్ సినిమాలు, ఆనాటి రోజులు ఆడియన్స్‌కి గుర్తుకు వస్తాయి. క్యారెక్టర్, పెర్ఫార్మెన్స్ పరంగా సినిమా చాలా ఎంటర్టైనింగ్‌గా ఉంటుంది. దర్శకుడు వెంకీ అద్భుతంగా రాశాడు, తీశాడు. ఈ సినిమా, క్యారెక్టర్ పట్ల చాలా హ్యాపీగా ఉన్నాను.
- ఇందులో ఇండియాలోనే హయ్యస్ట్ సెక్యూరిటీ ఏజెన్సీ నాది. నా ఏజెన్సీలో పని చేయడానికి హీరో వస్తాడు. ఇంతకంటే కథ చెప్పకూడదు(నవ్వుతూ). నితిన్, నా కాంబినేషన్ చాలా అద్భుతంగా ఉంటుంది. ఇందులో నా టైమింగ్ నితిన్ ఫాలో అవ్వాలి, నితిన్ టైమింగ్‌ని నేను ఫాలో అవ్వాలి. క్యారెక్టర్స్ అలా డిజైన్ చేశారు. మేము ఇద్దరం వెన్నెల కిశోర్‌కి దొరక్కూడదు. సినిమా చూసినప్పుడు భలే గమ్మత్తుగా ఉంటుంది. ఇలాంటి ఎంటర్‌టైనింగ్ సినిమా చేసి చాలా కాలమైంది.
- 'జులాయి' తర్వాత 'సన్నాఫ్ సత్యమూర్తి, నాన్నకు ప్రేమతో, శ్రీమంతుడు, ఓ బేబీ, ఎఫ్2' చిత్రాల్లో నా పాత్రలని ఎలా అయితే గుర్తుపెట్టుకున్నారో.. రాబిన్‌హుడ్‌లో చేసిన క్యారెక్టర్ కూడా నేను గ్యారెంటీగా గుర్తుపెట్టుకునే క్యారెక్టర్ అవుతుంది.

నవచిత్రం

అనుబంధాల నేపథ్యంలో..



మనీషా ఆర్ట్స్ అండ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్, అన్నపరెడ్డి స్టూడియోస్ సంయుక్తంగా నిర్మించిన తాజా చిత్రం 'ఎల్ ఎఫ్ వై - లవ్ యువర్ ఫాదర్'. ఈ సినిమా ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసేందుకు సిద్ధంగా ఉంది. పవన్ కేతరాజు దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో శ్రీ హర్ష, కశికా కపూర్ జంటగా నటించగా, గాయకుడు ఎస్.పి.చరణ్ హీరోకి తండ్రిగా నటించారు.

కుటుంబ సంబంధాలను, ప్రేమను సమర్థవంతంగా చూపించే ఈ కుటుంబ కథా చిత్రం ప్రేక్షకుల హృదయాలను గెలుచుకుంటుందనే నమ్మకాన్ని మేకర్స్ వ్యక్తం చేస్తున్నారు. ఈ సినిమాలోని 'హే మధుమతి' పాటను ఇటీవల మల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజీలోని మెయిన్ క్యాంపస్‌లో చామకూర శాలిని రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 'మా స్టూడెంట్ శ్రీ హర్ష ఈ సినిమాలో నటించారు. ఈ సినిమా ఆయనకు మంచి పేరు తెచ్చిపెట్టాలని కోరుకుంటున్నాను' అని తెలిపారు.

'సినిమా అద్భుతంగా వచ్చింది. మార్చి చివరివారంలో ప్రేక్షకుల ముందుకు ఈ సినిమా వెండి తెరపైకి రానుంది' అని దర్శకుడు పవన్ కేతరాజు చెప్పారు. హీరో శ్రీ హర్ష మాట్లాడుతూ, "మణిశర్మ ఈ సినిమాకి అద్భుతమైన సంగీతం అందించారు. సకుటుంబ సపరివార సమేతంగా చూడదగ్గ చిత్రమిది' అని అన్నారు. భద్రం, షకలక శంకర్, నవాబ్ షా, రఘు బాబు, ప్రవీణ్, ఛత్రపతి శేఖర్, జబర్దస్త్ శాంతి కుమార్ తదితరులు కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి కెమెరా - శ్యామ్.కే.నాయుడు, మ్యూజిక్ - మణిశర్మ, నిర్మాతలు కిషోర్ రాఠీ, ఎ. సామ్రాజ్యం.

విజువల్ వండర్



మ్యూజిక్ డైరెక్టర్‌గా, నటుడిగా, నిర్మాతగా, హీరోగా జీవీ ప్రకాష్ కుమార్ రాణిస్తున్నారు. ఆయన తాజాగా 'కింగ్‌స్టన్' మూవీతో థియేటర్లలోకి రావడానికి సిద్ధమవుతున్నారు. ఫస్ట్ సీ అడ్వెంచర్ ఫ్యాంటసీ మూవీగా రూపొందుతున్న ఈ మూవీలో 'బ్యాచిలర్' తరువాత మరోసారి దివ్యభారతి, జీవీ ప్రకాష్ జంటగా కనిపించబోతున్నారు. ఈ మూవీకి కమల్ ప్రకాష్ దర్శకత్వం వహించగా, జీవీ ప్రకాష్ కుమార్ మ్యూజిక్ డైరెక్టర్‌గా, నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. జీ స్టూడియోస్‌తో పాటు జీవీ ప్రకాష్ కుమార్ తన సొంత బ్యానర్ ప్యారలల్ యూనివర్స్ పిక్చర్స్ పై ఈ మూవీని నిర్మిస్తున్నారు. తమిళ, తెలుగు భాషల్లో ఈ సినిమా ఈ నెల 7న రిలీజ్ చేయబోతున్నారు. గంగ ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత మహేశ్వర్ రెడ్డి తెలుగులో సినిమాను విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా మేకర్స్ నిర్వహించిన చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు హీరో నితిన్, డైరెక్టర్లు వెంకీ కుడుముల, వెంకీ అట్లూరి, మైత్రి మూవీ మేకర్స్ అధినేత రవిశంకర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా హీరో నితిన్ మాట్లాడుతూ, 'ట్రైలర్ స్టన్నింగ్‌గా ఉంది. విజువల్స్ ఫెంటాస్టిక్‌గా ఉన్నాయి. ట్రైలరే ఇలా ఉంటే, ఇంక సినిమా ఎలా ఉంటుందో అనే ఆతృత పెరిగింది' అని తెలిపారు.

'ఈ మూవీని రిలీజ్ చేయబోతున్న గంగ ఎంటర్టైన్మెంట్స్ మహేశ్వర్ రెడ్డికి థ్యాంక్స్. 'కింగ్స్టన్' మూవీ ఒక బిగ్ డ్రీమ్. నిర్మాతగా ఇది నా ఫస్ట్ మూవీ. 'హ్యారీ పోటర్' లాంటి మల్టీ యూనివర్స్ సినిమాలు చూసినప్పుడు డ్రీమ్‌లోకి వెళ్లినట్టుగా అనిపిస్తుంది. అలాంటి సినిమాలను చూసి ఇన్స్పైర్ అయ్యి, ఈ మూవీని తీసాను. 'కింగ్స్టన్' దానికి కేవలం స్టార్టింగ్ పాయింట్. త్వరలో చాలా పార్ట్స్ రాబోతున్నాయి' అని జీవీ ప్రకాష్ కుమార్ చెప్పారు. మైత్రి డిస్ట్రిబ్యూటర్ శశిధర్ రెడ్డి మాట్లాడుతూ, 'ట్రైలర్‌ని చూసాము. అద్భుతంగా ఉంది. స్క్రీన్ పై సినిమాని చూసి ప్రేక్షకులు అద్భుతంగా ఫీల్ అవుతారు' అని అన్నారు.

చిన్నారులకు సాయం అందించండి



వరలక్ష్మీ శరత్‌కుమార్, నికోలయ్ సచ్‌దేవ్

వరలక్ష్మీ శరత్ కుమార్ బర్త్ డే సందర్భంగా కుటుంబంతో కలసి హైదరాబాద్‌లోని లెప్రా సొసైటీ ఆర్ఫానేజ్‌కి వెళ్లి చిన్నారులతో సమయాన్ని గడిపి, వారికి గిఫ్ట్స్ అందించారు. అనంతరం భర్త నికోలయ్ సచ్‌దేవ్‌తో కలసి డొనేషన్ అందజేశారు.

ఈ సందర్భంగా వరలక్ష్మీ శరత్‌కుమార్ మాట్లాడుతూ, "నేడు(బుధవారం) నా బర్త్ డే. ఈ చిన్నారులతో కలవడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. మా వంతుగా డొనేషన్ ఇచ్చాం. ఇది చిన్నదే. అయితే ఈ చిన్న సాయం కూడా వారికి పెద్ద సంతోషాన్ని ఇస్తుంది. అందరూ ఈ చిన్నారులకు సాయం అందించండి. నా ప్రతి బర్త్ డేకి నావంతు సాయంగా సోషల్ సర్వీస్ చేస్తాను. చెన్నై నుంచి మొత్తంగా హైదరాబాద్ షిఫ్ట్ అయ్యాను కాబట్టి ఈసారి హైదరాబాద్‌లో ఏదైనా మంచి కార్యక్రమం చేయాలని అనుకున్నాను. ఈ ఆర్ఫనేజ్‌లో చాలామంది ఆడబిడ్డలు ఉన్నారు. ఈ బ్రాంచ్‌లో 62 మంది చిన్నారులు ఉన్నారు. దయచేసి అందరూ హెల్పింగ్ హ్యాండ్స్ అందించండి' అని తెలిపారు.

కపుల్స్‌కి 1+1 టికెట్ ఆఫర్



మౌనిక రెడ్డి

ఆమని, వికాస్ వశిష్ఠ, మౌనిక రెడ్డి, ప్రగతి, సునయన, కేదార్ శంకర్, ప్రమోదినీ తదితరులు కీలక పాత్రల్లో నటించిన సినిమా 'నారి'. మహిళల్ని గౌరవించాలి, ఆడపిల్లలు అన్ని రంగాల్లో ఎదిగేందుకు సహకరించాలి, ఇప్పుడున్న సామాజిక పరిస్థితుల్లో 13-20 ఏళ్ల పిల్లలు ప్రమాదంలో ఉన్నారనే విషయాన్ని చెబుతూ దర్శకుడు సూర్య వంటిపల్లి ఈ చిత్రాన్ని రూపొందించారు. శ్రీమతి శశి వంటిపల్లి నిర్మించారు. ఈ సినిమా మహిళా దినోత్సవం సందర్భంగా ఈనెల 7న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ నేపథ్యంలో మేకర్స్ ఓ బంపర్ ఆఫర్ అనౌన్స్ చేశారు.

ఈ నెల 7, 8 తేదీల్లో ఈ సినిమా చూసే కపుల్స్ కోసం టికెట్స్ పై వన్ ప్లస్ వన్ ఆఫర్ ప్రకటించారు. 7, 8వ తేదీల్లోని అన్ని షోస్‌కు ఈ ఆఫర్ వర్తించనుంది. అందరూ తమ టికెట్స్ సమీపంలోని థియేటర్లలో, బుక్ మై షో ద్వారా బుకింగ్ చేసుకోవచ్చు అని మేకర్స్ తెలిపారు.

'ఈ సినిమా నుంచి రిలీజ్ చేసిన కంటెంట్, పాటలు సెన్సేషన్ క్రియేట్ చేస్తున్నాయి. సింగర్ సునీత పాడిన 'హవాయి హవాయి హవాయి', రమణ గోగుల పాడిన 'గుండెలోన ఏదో గట్టి సప్పుడైనదే' పాట మిలియన్స్ వ్యూస్ సాధిస్తూ సూపర్ హిట్ అయ్యాయి. ఈ సినిమా అందర్నీ అలరిస్తుందనే నమ్మకం ఉంది' అని నిర్మాత శశి వంటిపల్లి అన్నారు.

సరికొత్తగా 'రా రాజా'



పద్మ సమర్పణలో శ్రీ పద్మిణి సినిమాస్ బ్యానర్ మీద బి.శివ ప్రసాద్ తెరకెక్కించిన చిత్రం 'రా రాజా'. మొహాలు చూపించకుండా సినిమాను తీయడం అనేది మామూలు సాహసం కాదు. ఆర్టిస్టుల్ని చూపించకుండా కేవలం కథ, కథనాల మీదే నడిచే సినిమా ఇది. ఈ చిత్రానికి బూర్లే హరి ప్రసాద్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా, కిట్టు లైన్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు.

ఈ చిత్రాన్ని ఈనెల 7న భారీ ఎత్తున రిలీజ్ చేయబోతున్నారు.

ఈ సందర్భంగా దర్శకుడు బి. శివ ప్రసాద్ మాట్లాడుతూ, 'నిర్మాతగా సినిమాలు చేస్తున్న టైంలో నా మైండ్‌లోకి వచ్చిన పాయింట్‌ను కథగా మార్చాను. అలా అనుకోకుండానే నేను దర్శకుడిగా మారిపోయాను. ఈ సినిమా చాలా బాగా వచ్చింది. ఇప్పటి వరకు చూసిన వారంతా మెచ్చుకున్నారు. ఈ చిత్రం ఈనెల 7న రాబోతోంది. అందరూ చూసి ఆదరించాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.

'ఈ చిత్రానికి మంచి మ్యూజిక్ ఇచ్చే స్కోప్ దక్కింది. శివ ప్రసాద్ నాకు నిర్మాతగా ఎప్పటి నుంచో తెలుసు. ఈ కథ గురించి ఆయన చెప్పారు. కానీ అప్పుడు నిర్మాతగా చెబుతున్నారని అనుకున్నా.. కానీ దర్శకుడిగా కథ చెబుతున్నారని తరువాత అర్థమైంది. కథ చాలా బాగుంది. సినిమా బాగా వచ్చింది' అని మ్యూజిక్ డైరెక్టర్ శేఖర్ చంద్ర చెప్పారు.

'టుక్ టుక్' రిలీజ్‌కి రెడీ



వైవిధ్యమైన కాన్సెప్ట్‌తో, ఫ్రెష్ కంటెంట్‌తో రాబోతున్న చిత్రం 'టుక్ టుక్'. హర్ష రోషన్, కార్తికేయ దేవ్, స్టీవెన్ మధు, శాన్వీ మేఘన, నిహాల్ కోధాటి ముఖ్యతారలుగా రూపొందుతున్న ఈ చిత్రానికి సి.సుప్రీత్ కృష్ణ దర్శకుడు. చిత్రవాహిని, ఆర్‌వైజి సినిమాస్ పతాకంపై రాహుల్ రెడ్డి, లోక్కు శ్రీ వరుణ్, శ్రీరాముల రెడ్డి, సుప్రీత్ సి కృష్ణ నిర్మిస్తున్నారు.

ఈ చిత్రాన్ని ఈనెల 21న ప్రపంచవ్యాప్తంగా మేకర్స్ విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఈ చిత్ర టీజర్‌ను విడుదల చేసింది చిత్రబృందం. ఈ సందర్భంగా శాన్వీ మేఘన మాట్లాడుతూ "పుష్పక విమానం' తరువాత నేను చేసిన చిత్రమిది. టీజర్ అందరికి నచ్చిందని అనుకుంటున్నాను. ఈ సినిమాలో సూపర్ నేచురల్, మ్యాజికల్ పవర్ ఎలిమెంట్స్ ఉన్నాయి. ఈ సినిమాలో ఉన్న చాలా సర్‌ప్రైజెస్‌ని ఎంజాయ్ చేయడానికి అందరూ ఈ సినిమాను థియేటర్‌లో చూడాలి' అని అన్నారు. 'ముగ్గురు యువకుల ప్రయాణం. వాళ్ల జీవితంలో వచ్చిన మ్యాజికల్ ఎలిమెంట్స్‌ను ఎలా ఫేస్ చేశారనేదే ఈ సినిమా' అని రోషన్ చెప్పారు. కార్తికేయ మాట్లాడుతూ, 'ఈ సినిమాలో ఎమోషన్, ఎంటర్‌టైన్‌మెంట్ అన్నీ ఉన్నాయి' అని తెలిపారు. 'థియేటర్‌లో ఎక్స్‌పీరి యన్స్ చేయాల్సిన సినిమా ఇది. త్వరలో ఈ సినిమా గురించి ఓ బిగ్గెస్ట్ సర్‌ప్రైజ్ రాబోతుంది. అది చూసి అందరూ షాక్ అవుతారు' అని దర్శకుడు సుప్రీత్ కృష్ణ చెప్పారు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886